21-05Pg1exHMNWJQE.qxd:21-05Pg1exHMNWJQE.qxd 1/1/02 6:11 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-5-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 111 పేజీలు: 16 వెల: 6.50

బెంగాల్ మదర్సాల్లో వందేమాతరం తప్పనిసరి
జిన్‌పింగ్ మధ్యవర్తిత్వంతో ట్రంప్-కిమ్ చర్చలు
5లో

# సెప్టెంబర్ కల్లా ప్రాజెక్టుల గ్రౌండింగ్

## 2028 చివరినాటికి ప్రారంభించేలా కార్యాచరణ

మంత్రుల కమిటీ, అధికారులకు సిఎం దిశానిర్దేశం

పెట్టుబడిదారులకు సింగిల్ పోర్టల్ ద్వారా సేవలు

భూ కేటాయింపుల్లో పర్యాటక ప్రాజెక్టులకు ప్రాధాన్యం

గోవా ప్లస్‌గా సూర్యలంక బీచ్.. త్వరలో బాపట్ల మాస్టర్ ప్లాన్

23 నెలల్లో ఏపికి 756 ప్రాజెక్టులు, రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్ర యువతకు 21.20 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు

ఎంఒయులు, ఎస్ఐపిబి ఆమోదం పొందిన ప్రాజెక్టులపై చంద్రబాబు సమీక్ష



గురువారం ఎంఒయు, ఎస్ఐపిబి ఆమోదం పొందిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల గ్రౌండింగ్ ఈ యేడాది సెప్టెంబర్ కల్లా జరగాలని, డిసెంబర్ 2028 కల్లా ప్రారంభమయ్యేలా చూడాలని మంత్రుల కమిటీ, అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రం అనుసరిస్తున్న "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానాన్ని ఆచరణలో చూపాలన్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపిబి ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంఒయుల స్థితిగతులు, ప్రాజెక్టుల పురోగతిపై ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలు, ప్రస్తుత కార్యాచరణ, భవిష్యత్ ప్రాజెక్టుల గురించి వివరించారు. ఈ 23 నెలల్లో రూ.21,64,258 కోట్ల విలువైన మొత్తం 756 ప్రాజెక్టులు రాష్ట్రానికి వచ్చాయని, వీటితో 21,20,567 ఉద్యోగాలు వస్తున్నట్టు తెలిపారు. ప్రైవేటు రంగంలో ఏవియేషన్ ప్రాజెక్టులను ఆకర్షించేలా చర్యలు చేపడతామని లోకేష్ చెప్పారు. పెట్టుబడుల సాధనలో దేశంలోనూ, ప్రైవేటు రంగంలోనూ ఎపి పేరు మార్మోగుతోందని, ఎంఎస్ఎంఇల అనుమతులు, ఇతర వివరాలను త్వరలోనే వెబ్‌సైట్ ద్వారా అందిస్తామని లోకేష్ తెలిపారు.

**21 ప్రధాన ఆలయాలతో టెంపుల్ టూరిజం సర్క్యూట్**

ప్రాజెక్టుల గ్రౌండింగ్, అనుమతుల వివరాలు, ఉద్యోగాల కల్పనపై సింగిల్ పోర్టల్‌లో డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. భూ కేటాయింపుల్లో మొదటగా పర్యాటక ప్రాజెక్టులకు, తర్వాత ఐటీ కంపెనీలకు ప్రాధాన్యత కల్పించాలని సిఎం స్పష్టం చేశారు. టూరిజం, ఐటి లాంటి ప్రాజెక్టులకు వినూత్నంగా మల్టీ పర్పస్ భవనాల నిర్మాణం చేపట్టే ఆలోచన చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ ఫ్రంట్‌ను గోవా ప్లస్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేయాలని, బాపట్ల బీచ్‌కు త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎపిలోని 21 ప్రధానఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజం ప్రాజెక్టు వేగంగా చేపట్టాలన్నారు. ఐటి ప్రాజెక్టులు తమ కార్యకలాపాలు 18 నెలల్లో ప్రారంభించేలా చూడాలని స్పష్టం చేశారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ కాంపొనెంట్స్ తయారీ ప్రాజెక్టులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించారు.

**నౌకా నిర్మాణ రంగంలో విస్తృత అవకాశాలు**

ట్రాన్స్ మిషన్‌తో పాటు సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎపి నిర్దేశించుకున్న 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యాన్ని వేగంగా చేరుకోవాలని సిఎం చంద్రబాబు అన్నారు. అయితే ఇప్పటికే 99 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు తెలిపారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించేలా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు త్వరితగతిన ఏర్పాటయ్యేలా చూడా >>2

# కార్యకర్తే అధినేత



మహానాడులో ప్రతిబింబించాలి

స్త్రీ శక్తి థీమ్‌తో మహానాడు 2026

పండుగలా మహానాడు నిర్వహించాలి

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

వర్చువల్‌గా టిడిపి పొలిట్ బ్యూరో సమావేశం

20 తీర్మానాలు ప్రవేశపెట్టాలని నిర్ణయం

**విజయవాడ, మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కార్యకర్త అధినేత అనేది ఈ మహానాడులో ప్రతిబింబించాలని తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మహిళలకు తెలుగుదేశం ఇస్తున్న ప్రాధాన్యం మహానాడు వేదికగా అందరికీ అర్థమయ్యేలా చాటాలని సూచించారు. సంప్రదాయ ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. టిడిపి మహానాడు-2026ను స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని టిడిపి పొలిట్ బ్యూరో నిర్ణయించింది. 20 తీర్మానాలు ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. గురువారం పార్టీ అధినేత, సిఎం చంద్రబాబు నేతృత్వంలో టిడిపి పొలిట్ బ్యూరో సమావేశం వర్చువల్‌గా జరిగింది. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్‌గా జరిగిన ఈ పొలిట్ బ్యూరో భేటీలో సిఎం క్యాంప్ కార్యాలయం నుంచి చంద్రబాబు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ పాల్గొనగా వేర్వేరు ప్రదేశాల నుంచి మిగిలిన పొలిట్ బ్యూరో సభ్యులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు రెండున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో మహానాడు నిర్వహణపై సుదీర్ఘంగా చర్చించారు. ఏయే తీర్మానాలు ప్రవేశపెట్టాలి, తీర్మానాల్లో సారాంశం ఏ విధంగా ఉండాలి, వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారు. ఈ నెల 27, 28వ తేదీల్లో జరగనున్న మహానాడులో మొత్తంగా 20 తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరోలో నిర్ణయించారు. వీటిల్లో 10 ఎపి, 4 తెలంగాణ, 1 అండమాన్‌కు సంబంధించి తీర్మానాలు >>2

# ఎబోలా డేంజర్ బెల్స్

భారత్‌లో అప్రమత్తత

విమానాశ్రయాల్లో ప్రయాణికుల స్క్రీనింగ్

ఆఫ్రికా ఫోరమ్ సదస్సు వాయిదా



**న్యూఢిల్లీ,మే 21:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం అప్రమత్తమైంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వస్తున్న లేదా ఆయా దేశాల మీదుగా ప్రయాణిస్తున్న ప్రయాణికుల కోసం ఇవాళ ఒక హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది. వ్యాధి లక్షణాలు కనిపించిన వారు వెంటనే విమానాశ్రయంలోని ఆరోగ్య అధికారులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా పంచుకుంది. >>2



# తారెత్తిస్తున్న మండుటెండలు

## పిడుగురాళ్లలో అత్యధికంగా 48.1 డిగ్రీలు

వడగాడ్పులతో నలుగురు మృతి

మరో నాలుగు రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

అప్రమత్తంగా ఉండాలంటూ ఐఎండి హెచ్చరిక

**విజయవాడ, మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎండలు మంటలు పుట్టిస్తున్నాయి. ప్రజలు ఇళ్లనుండి బయటకు రావడానికి భయపడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు విపరీతంగా విస్తున్నాయి. గురువారం వడగాడ్పులకు నలుగురు ప్రాణాలు కోల్పోయారు. గురువారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు నమోదైంది. బాపట్ల జిల్లా వేటపాలెం, కృష్ణా జిల్లా నందివాడ 47.6, ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండల శివారు తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4, ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3, మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 46.6, పోలవరం జిల్లా కూనవరంలో 46.5, నెల్లూరు జిల్లా కావలిలో 46.4, గుంటూరు జిల్లా తెనాలిలో 46, తూర్పుగోదావరి జిల్లా బ్రహ్మణగూడెంలో 45.8, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 45.5, విశాఖ జిల్లా ములగాడలో 45.2, అనకాపల్లి జిల్లా మాకవరపాలెం, అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం, తిరుపతి జిల్లా బోనుపల్లెలో 45.1, కాకినాడ జిల్లా కందరాడ, విజయనగరం జిల్లా గుర్లలో 45 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**వడదెబ్బతో నలుగురు మృతి:**

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలంలో గీత కార్మికుడు దార్ల కృష్ణ (50) వడదెబ్బతో మృతి చెందాడు. కృష్ణా జిల్లా వణుకూరుకు చెందిన రైతు కూనపరెడ్డి రామకృష్ణ (53) పొలంలో వడదెబ్బ తగిలి చనిపోయినట్లు రైతులు తెలిపారు. గుంటూరు నగరంలో అక్బర్ బాషా, విజయవాడ నగరం సుందరయ్య నగర్ వెంకటేశ్వరరావులు వడదెబ్బకు మరణించినట్లు సమాచారం. రాష్ట్రంలో ఎండ తీవ్రత రికార్డు స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం వరకు ఎండ తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకుగాను 20 జిల్లాల పరిధిలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పల్నాడు జిల్లాలో 26, ప్రకాశం 23, కృష్ణా 22, ఏలూరు 21, బాపట్ల 20, ఎన్టీఆర్ >>2



# సినీరంగానికి కొత్త ఊపు

ఎపిఎఫ్‌టివిటిడిసి చైర్మన్‌గా భరత్ భూషణ్

వైస్ చైర్మన్‌గా మెహర్ రమేష్

14 మంది డైరెక్టర్లు నియామకం

**విజయవాడ, మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిల్మ్ టివి థియేటర్ అభివృద్ధి సంస్థ (ఎపిఎఫ్‌టివిటిడిసి) చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ పి.భరత్ భూషణ్ పేరుకే మొగ్గు చూపించింది. వైస్ చైర్మన్‌గా దర్శకుడు మెహర్ రమేష్‌ను ఎంపిక చేసింది. 14 మంది డైరెక్టర్లను నియమించింది. సినీ రచయిత, తెనాలి కళల కాణాచి పరిషత్ >>2



ప్రధాని మోదీ అధ్యక్షతన కేబినెట్ సమావేశం

# చమురు కొరత లేకుండా పకడ్బందీ చర్యలు

మంత్రిత్వ శాఖలవారీగా ప్రధాని మోడీ సుదీర్ఘ సమీక్షలు

నాలుగున్నర గంటలకుపైగా సాగిన మంత్రివర్గ సమావేశం

**న్యూఢిల్లీ, మే 21:** ఐదు యూరోప్ దేశాల్లో పర్యటనలు ముగించుకుని వచ్చిన ప్రధానిమోడీ గురువారం నిర్వహించిన అత్యవసర భేటీలో చమురు, గ్యాస్ కొరతరాకుండా చూడాలని ఆదేశాలు జారీచేసారు. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావం దేశంపై పడకూడదని ఇందుకోసంముందస్తు కార్యాచరణ అమలుచేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న నిల్వలు, రానున్న చమురు వనరుల ట్యాంకర్లు వంటివాటిని సమీక్షించడంతోపాటు ప్రభుత్వశాఖల పనితీరు కూడా నివేదికలు కోరారు. సాయంత్రం ఐదు గంటలకు భారత్‌మండపంలో ప్రారంభించిన ఈ సమావేశం సుమారు నాలుగున్నర గంటలకుపైగా సాగింది. ఈ సమావేశానికి కేంద్ర కేబినెట్ మంత్రులతో పాటు జూనియర్ మంత్రులు (సహాయ మంత్రులు) అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని, ఎవరూ ఢిల్లీ వదిలి వెళ్లకూడదని ఆకస్మిక ఆదేశాలు జారీ కావడంతో జూనియర్ మంత్రులతోసహా అందరూ >>2

# మెగా రైల్వే స్టేషన్



38 నెలల్లోనే రోబోలతో నిర్మాణం

ప్రపంచంలో అతిపెద్ద స్టేషన్ ఇదే

చైనాలోని చాంగ్ కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్

**బీజింగ్, మే 21:** ప్రపంచంలోనే అతిపెద్దదైన చైనాలోని చాంగ్‌కింగ్ ఈస్ట్ రైల్వే స్టేషన్ నిర్మాణ దృశ్యాలు టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌ను సైతం ఆశ్చర్యపరిచాయి. గతంలో ప్రజా రవాణాపై పెదవి విరిచిన మస్క్ ఈ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో షేర్ చేయడంతో ఇపుడుప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. 40 డిగ్రీల ఎండ, కొండ ప్రాంతంలో కేవలం 38 నెలల రికార్డు కాలంలోనే చైనా ఈ అద్భుతాన్ని నిర్మించడం వెనుక ఒక పెద్ద రోబో విప్లవం ఉందని అన్నారు. చైనాకు చెందిన ప్రభుత్వ మీడియా సంస్థ జిన్హువా కథనం ప్రకారం ఈ భారీ ప్రాజెక్ట్ కోసం చైనా పెద్ద ఎత్తున రోబోల సైన్యాన్ని రంగంలోకి దించింది. లేజర్ సాయంతో నడిచే ఫోర్‌వీల్ రోబోలు మనుషుల కంటే మూడు రెట్లు వేగంగా, మిల్లీమీటర్ల కచ్చితత్వంతో కాంక్రీట్ లెవలింగ్ పనులను పూర్తి చేశాయి. ఎఐ, 5జీ సాంకేతికతతో పనిచేసిన ఈ రోబోల వల్ల కార్మిక ఖర్చులు 40 శాతం వరకు తగ్గినట్లు సమాచారం. దాదాపు 800 కిలోల బరువైన భారీ గ్లాస్ ప్యానెళ్లను >>2

# 28న బక్రీద్ పండుగ సెలవు

ప్రభుత్వం ప్రకటన... ఉత్తర్వులు జారీ

**విజయవాడ, మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండగ సెలవు దినాన్ని మారుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా ప్రకటించిన మే 27న కాకుండా మే 28వ తేదీన ఈ బక్రీద్ సెలవు దినంగా ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈ మార్పు వర్తిస్తుందని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతంలో ఎపి ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక క్యాలెండర్ ప్రకారం.. మే 27వ తేదీ బక్రీద్ సెలవుగా ప్రకటించారు. అయితే చంద్రదర్శనం ఆధారంగా పండుగ తేదీ మారింది. దాంతో సెలవు రోజును కూడా మార్చాలని ఎపి వక్ఫ్ బోర్డు ముఖ్య కార్య నిర్వాహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ బోర్డు సిఇఒ చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం పరిశీలించింది. అనంతరం సెలవును మే 28కి మారుస్తూ నిర్ణయం తీసుకుంది.

# 'మావిగన్'ను అందుకే ప్రతిపాదించాం

ఆ పేరు ఎత్తితేనే చంద్రబాబుకు బిపి పెరుగుతోంది

ఎపికి రాజధాని లేకుండా చేసేందుకు పెద్ద కుట్ర

అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం భవనాలు ఉండగా, మళ్లీకడతామనడం విచ్చలవిడి దోపిడీకి నిదర్శనం

వైఎస్సార్సీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ ఆరోపణ



**విజయవాడ, మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న పెద్ద దురదృష్టమని వైఎస్సార్సీ అధినేత జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల భవిష్యత్తులో కూడా ఎపికి రాజధాని లేకుండా పోయే ప్రమాదం ఉందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన మావిగన్ పేరు ఎత్తితేనే చంద్రబాబుకుగుండె ఆగిపోయేలా ఉందని, భయంతో మంత్రులతో బూతులు మాట్లాడిస్తున్నారని జగన్ విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సున్నా నుంచి ప్రారంభించాల్సిన అమరావతి కంటే, ఇప్పటికే అన్ని సదుపాయాలు ఉన్న మావిగన్ ప్రాంతాన్ని ప్రత్యామ్నాయంగా చూపించామని జగన్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా తమ ప్రతిపాదనకు మద్దతు పలికారని, ఆ వాస్తవాన్ని తట్టుకోలేకనే చంద్రబాబు తనపై, వైసిపిపై బురద జల్లుతున్నారని వైఎస్ జగన్ విమర్శించారు. అమరావతిలో కేవలం రోడ్లు, నీరు, డ్రైనేజీ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలకే రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతుందన్నారు. రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని తెలిసినా చంద్రబాబు కేవలం స్కామ్‌ల కోసమే >>2

22-05pg2exHMNWJQE.qxd:22-05pg2exHMNWJQE.qxd 1/1/02 6:19 AM Page 1





గురువారం సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న దృశ్యం

# ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలు

**మహాదేవపూర్, మే 21, ప్రభాతవార్త:** సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పుష్కరాల తొలి రోజు ఉదయం 5:43 గంటలకు పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రంలో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య తొలి పుష్కర స్నాన ఘట్టం నిర్వహించబడింది. వేదమంత్రాల మధ్య ప్రముఖుల పుణ్యస్నానాలు మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు పవిత్ర నదిలో తొలి పుష్కర స్నానం ఆచరించి, నదీ మాతకు ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ పుణ్యస్నాన మహోత్సవంలో తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుశైలజా రామయ్యర్ దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొని పవిత్ర స్నానాలు ఆచరించారు. వీరితో పాటు భూపాలపల్లి, రంగారెడ్డి నియోజకవర్గాల శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా పుష్కర స్నానాలు చేసి నదికి హారతి ఇచ్చారు. పుష్కరాల ప్రారంభదినం కావడంతో తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు పవిత్ర క్షేత్రానికి తరలివచ్చారు. నమస్తే శారదే దేవి అంటూ భక్తులు చేసిన స్మరణలతో ఘాట్లన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని రకాల కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టింది. సమన్వయంతో యంత్రాంగం పనులు భక్తుల రద్దీని తట్టుకునేలా భారీ భద్రత, నిరంతర పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, అత్యవసర వైద్య సేవలు మరియు ప్రత్యేక రవాణా సదుపాయాలను సిద్ధం చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు అత్యంత సౌకర్యవంతంగా, సురక్షి తంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని ప్రభుత్వ శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా తెలిపారు.

# ఫాల్టా రీపోలింగ్‌లో 86.11శాతం ఓటింగ్ నమోదు



**కోల్‌కత్తా, మే 21:** ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని, ఓటర్లను బెదిరింపులకు గురిచేసారన్న ఆరోపణలపై నియోజకవర్గం మొత్తం ఉప ఎన్నిక నిర్వహించిన ఫాల్టా నియోజకవర్గంలో గురువారం జరిగిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల సమయానికి 86.11శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టా నియోజకవర్గంలో జరిగిన మొత్తం పోలింగ్ అత్యంత పకడ్బందీగా జరిగింది. భారీ ఎత్తున పోలీసులను మోహరించడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని ఎన్నికల అధికారులు ప్రకటించారు.

# ఎబోలా డేంజర్ బెల్స్

>> ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ఆధారంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లను హైరిస్క్ దేశాలుగా గుర్తించారు. ఈ దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో జ్వరం, వాంతులు, తీవ్రమైన నీరసం, విరేచనాలు, తలనొప్పి, కండరాల నొప్పి, గొంతునొప్పి, వివరించలేని రక్తస్రావం వంటి లక్షణాలు ఉంటే ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆఫీసర్‌కు లేదా హెల్త్ డెస్క్‌కు తెలియజేయాలని సూచించారు. ఎబోలా సోకినట్లు అనుమానిస్తున్న లేదా నిర్ధారణ అయిన రోగి రక్తం లేదా శరీర ద్రవాలతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్నవారు కూడా అధికారులకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భారత్‌కు వచ్చిన 21 రోజుల్లోగా ఈ లక్షణాలు కనిపిస్తే, తక్షణమే వైద్య సహాయం తీసుకోవాలని, తమ ప్రయాణ వివరాలను వైద్యులకు వెల్లడించాలని అడ్వైజరీలో పేర్కొన్నారు. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో తాజాగా 513 అనుమానిత ఎబోలా కేసులు, 131 అనుమానిత మరణాలు నమోదయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జోర్డాన్ ఇప్పటికే కాంగో, ఉగాండా ప్రయాణికులపై తాత్కాలిక నిషేధం విధించింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆరోగ్య తనిఖీలకు అందరూ సహకరించాలని ఢిల్లీ విమానాశ్రయం విజ్ఞప్తి చేసింది.

**ఆఫ్రికా ఫోరమ్ సదస్సు వాయిదా**

ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ కలకలం రేపుతుండటంతో ఢిల్లీలో జరగాల్సిన నాలుగో భారత్-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ వాయిదా పడింది. మే 28 నుంచి 31 వరకు జరగాల్సిన ఈ సదస్సును ప్రస్తుత ప్రజారోగ్య పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్రంగా ఉండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల అంతర్జాతీయ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సదస్సును వాయిదా వేయడానికి ముందు భారత ప్రభుత్వం, ఆఫ్రికన్ యూనియన్ ఛైర్‌పర్సన్, ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ మధ్య సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఆఫ్రికా దేశాల ప్రతినిధులు, కీలక నేతలు అందరూ పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడటంతో పాటు, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సదస్సును మరో తేదీకి మార్చడమే మంచిదని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఆఫ్రికాలో ఎబోలాను అదుపు చేయడానికి ఆఫ్రికా సిడిసి తీసుకుంటున్న చర్యలకు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించింది.

# సినీరంగానికి కొత్త ఊపు

>> నిర్వాహకులు బుర్రా సాయిమాధవ్, చిలకలూరిపేటకు చెందిన రిటైర్డ్ అధ్యాపకులు, రచయిత డా. కందిమళ్ల సాంబశివరావులను డైరెక్టర్లుగా నియమించారు. హీరో సుమన్ తల్వార్, హీరో శివాజీ, నిర్మాతలు చదలవాడ శ్రీనివాసరావు, కూచిభోట్ల వివేకానంద, నటి ఝాన్సీ, సీనియర్ జర్నలిస్ట్ కె.ఉమామహేశ్వర రావు, దర్శకుడు వి. సముద్ర, మీర్ ఎస్., ఎ.సత్యనారాయణ, ఎస్.వెంకట కృష్ణారెడ్డి, జి.రాజ్ వెంకటేశ్వర యాదవ్, డి.సత్యనారాయణలను డైరెక్టర్లుగా నియమించారు. ఇక టివి, సినిమా నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు ఈ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో సినిమా, టివి షూటింగులు జరిగేందుకు, సినీ, టివి, రంగస్థల కళాకారుల అభివృద్ధికి ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చిత్తశుద్ధితో కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# మెగా రైల్వే స్టేషన్

>> అమర్చడానికి ప్రత్యేక రోబోలను ఉపయోగించారు. ఇవి ప్రమాదాల ముప్పును 90 శాతం తగ్గించడమే కాకుండా, పనులను మూడు రెట్లు వేగవంతం చేశాయని నిర్మాణ సంస్థ అధికారులు వెల్లడించారు. వీటితో పాటు రాత్రింబవళ్లు గస్తీ కాసే పెట్రోలింగ్ రోబోలు, వెల్డింగ్ రోబోలు కూడా ఈ పనుల్లో పాల్గొన్నాయి. గతేడాది మే నెలలోనే ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ స్టేషన్ వైశాల్యం అక్షరాలా 1.22 మిలియన్ చదరపు మీటర్లు. ఇందులో 15 ప్లాట్‌ఫామ్‌లు, 29 రైల్వే ట్రాక్‌లు ఉన్నాయి. రద్దీ సమయాల్లో గంటకు 16 వేల మంది ప్రయాణికులను చేరవేసే సామర్థ్యం ఈస్టేషన్‌కు ఉంది. ఈ ఒక్క స్టేషన్ నుంచే చైనాలోని బీజింగ్, షాంఘై వంటి 14 ప్రధాన నగరాలకు హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఉంది.




గురువారం చెన్నైలోని లోక్‌భవన్‌లో జరిగిన నూతన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ ఆర్లేకర్, సిఎం విజయ్ తదితరులు

# కార్యకర్తే అధినేత

>> ఉన్నాయి. మరో 4 ఉమ్మడి తీర్మానాలతో పాటు అంతిమంగా కీలక రాజకీయ తీర్మానం చేపట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. మహానాడును స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని నిర్ణయించడంతో, దాన్ని ప్రతిఫలించేలా మహానాడు ఉండాలని, అలాగే ప్రసంగాలు ఉండాలని సిఎం ఆదేశించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు, మహిళా సాధికారతకు, వారికి హక్కులు కల్పించే విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారనే అంశాన్ని వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతీ పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేసేలా చర్యలు తీసుకుంటున్నామనే విషయాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. వీటితో పాటు ప్రభుత్వం అమలు చేసే పథకాలు, చేపడుతోన్న కార్యక్రమాలు, చేస్తున్న అభివృద్ధి, వస్తున్న పెట్టుబడులు వంటి వాటిపై కూలంకుషంగా చర్చించాలని అధ్యక్షుడు ఆదేశించారు.

ఈ మహానాడులో జరిగిన చర్చతో రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై మరోసారి చర్చ జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇక "మన దేశం -మన బాధ్యత" పేరుతో పొదుపు చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రత్యేకంగా చర్చ జరపాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలను, కుట్రలను బహిర్గతం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉండాలని పొలిట్ బ్యూరో అభిప్రాయపడింది. మహానాడు కార్యక్రమాన్ని పండుగలా చేపట్టాలని పొలిట్ బ్యూరో సమావేశంలో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. పార్టీ అగ్రనాయకత్వం మొదలుకుని క్షేత్ర స్థాయి కార్యకర్తవరకు మహానాడులో భాగస్వాములను చేసేలా నిర్వహించాలని ఆదేశించారు. ఇక అన్ని క్లస్టర్లల్లో ఎన్టీఆర్ విగ్రహం పెట్టి మహానాడును ప్రారంభించాలని పొలిట్ బ్యూరో సమావేశంలో నిర్ణయించారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. అలాగే రెండేళ్ల పాలనా విజయాలను నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణపై చర్చించారు. ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించే అంశంపై చర్చ జరిగింది.

**1848 క్లస్టర్లలో స్క్రీన్‌లు ఏర్పాటు**

ఈ నెల 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహణకు టిడిపి నేతలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 1848 క్లస్టర్లలో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి, ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫిజికల్‌గా, అదే విధంగా జిల్లాల నుంచి వర్చ్యువల్ విధానంలో మహానాడుకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే మహానాడుకు ఆహ్వానితులుగా పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ, అధికార ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇక నియోజకవర్గాల నుంచి ఆన్‌లైన్ విధానంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపిలు, కార్యకర్తలు మహానాడు కార్యక్రమంలో పాల్గొంటారు.

# సెప్టెంబర్ కల్లా ప్రాజెక్టుల గ్రౌండింగ్

>> లని సిఎం అన్నారు. 2027 డిసెంబరు నాటికి 46 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు ఉత్పత్తి ప్రారంభించేలా నిరంతరం పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు చేయాలని సిఎం సూచించారు. షిప్ బిల్డింగ్ సెంటర్ నిర్మాణం, పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. నౌకా నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య రంగ ప్రాజెక్టులు రాష్ట్రంలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. గడచిన 30 ఏళ్లుగా ఏపిలో భూసేకరణ గురించి వివాదాలు ఏర్పడలేదని, రైతులకు, పరిశ్రమలకు, ప్రభుత్వానికి ప్రయోజనం కలిగేలా భూ సేకరణ ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.

**పర్యావరణ హితంగా ప్రాజెక్టులు**

రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో పర్యావరణ హిత టెక్నాలజీ వినియోగించాలని సిఎం చంద్రబాబు సూచించారు. తీరప్రాంతాల్లో సముద్రంలోకి కాలుష్య కారకాలను విడిచిపెట్టకుండా చూడాలని అన్నారు. సూర్యలంక, నెల్లూరు మైపాడు వంటి బీచ్ ప్రాంతాల్లో పరిశుభ్రమైన పరిస్థితులు ఉండాలన్నారు. కాలుష్యాన్ని సముద్రంలోకి విడిచిపెడితే భవిష్యత్తులో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పరిశ్రమలకు ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేసే విషయంలోనూ త్వరితగతిన కార్యాచరణ చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఇ రైట్ టూ బిజినెస్ యాక్ట్ వెంటనే అమల్లోకి తీసుకురావాలని, నమోదు చేసుకుని పరిశ్రమ ప్రారంభించుకునేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. పరిశ్రమలు, ఎంఎస్ఎంఇల్లో తయారయ్యే ఉత్పత్తులు నాణ్యతపై దృష్టిపెట్టాలని, ప్రొడక్ట్ పర్ఫెక్షన్‌పై ప్రత్యేకంగా ఫోకస్ చేయాలన్నారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ద్వారా ప్రాజెక్టులను సాకారంచేసేలా యాక్షన్‌ప్లాన్ తయారు చేయాలని సిఎం అన్నారు.

**ఎస్ఐపిబి ఆమోదం పొందిన ప్రాజెక్టుల్లో 114 గ్రౌండింగ్**

రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి మొత్తం 282 ప్రాజెక్టులకు ఎస్ఐపిబి ఆమోదం తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.4.32 లక్షల కోట్లు, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.4.72 లక్షల కోట్లు, 2026-27లో (ఈనెల వరకు) రూ.2.39 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. వీటిలో ఇప్పటికే 114 గ్రౌండింగ్ అయ్యాయి. 2026 సెప్టెంబర్ నాటికి అన్ని ప్రాజెక్టుల గ్రౌండింగ్ లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఇందుకోసం పర్యావరణం సహా ఇతర అనుమతులు, విద్యుత్, నీరు, రహదారులు వంటి మౌలిక వసతులు, భూముల రిజిస్ట్రేషన్, స్థానిక సమస్యల పరిష్కారం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. బిపిసిఎల్, ఇండోసోల్, శ్రీసిటీ ఫేజ్-2వంటి ప్రాజెక్టులకు భూసేకరణ అత్యంత వేగంగా కొనసాగుతోందని, బిపిసిఎల్ ప్రాజెక్టుకు అవసరమైన సుమారు 3,000 ఎకరాల్లో 2,000 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ కేవలం మూడు రోజుల్లో పూర్తి చేసినట్టు అధికారులు వివరించారు.

**అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ కృషి**

పరిశ్రమల గ్రౌండింగ్ వేగవంతం కోసం మంత్రుల కమిటీ కృషి చేస్తుండగా, విదేశాల నుంచి రాష్ట్రంలో ఏర్పాటు చేసే పెట్టుబడుల వివరాలను ఇడిబి సేకరిస్తోంది. అన్ని శాఖల పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు ఐటి పోర్టల్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఎప్పటికప్పుడు పెట్టుబడిదారులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ప్రాజెక్టుల వేగవంతమైన గ్రౌండింగ్ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా కార్యకలాపాలు చేపట్టేలా చూడాలని మంత్రుల కమిటీకి సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, టిజి భరత్, కొండపల్లి శ్రీనివాస్, బిసి జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మండుటెండలు

>> 15, గుంటూరు 14, మార్కాపురం 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బిపి ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

## వారం - వర్జ్యం

22-05-2026, అధికజ్యేష్ఠ శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
షష్ఠి ఉ.6.25, సప్తమి తె.5.06
ఆశ్లేష రా.2.10
వర్జ్యం : మ.3.17-సా.4.51
ు.ఉ.8.10-ఉ.9.02,2) మ.12.29-మ.1.21
శుభసమయం : ఉ.7.30-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఉన్నతస్థాయి వ్యక్తులు తగిన విధంగా ప్రవర్తించ లేదని, సాయపడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తారు. నూతన విద్యావకాశాలు.

**వృషభం:** వర్గాలను కూడ గడతారు. భూమి సంబంధిత వ్యవహారాలు కలిసి వస్తాయి. విలువైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** సంతానవిషయంలో నిర్ణయాలు చేయడం కష్టతరంగా అనిపిస్తుంది. ఏది మంచో, ఏది చెడో తెలియదు.

**కర్కాటకం:** ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. పొదుపుకు సంబంధించి పురోగతి సాధిస్తారు. వాహన సౌలభ్యం.

**సింహం:** ఇష్టపడి కొనుగోలు చేసినా వాటిని తిరిగి మార్పు చేయాలని యోచిస్తారు. మిత్రుల సలహాలు, పోరు విసుగు కలిగిస్తాయి.

**కన్య :** ఎవరు ఆప్తులో, ఎవరు నిజమైన హితులో తెచ్చుకోలేరు. ఉద్యోగం పనిభారం అధికమవుతోంది. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** రకరకాల సమస్యలు అన్నింటికీ మీరే బాధ్యత వహించాల్సిన స్థితి సంభవం. పాస్ పోర్ట్ వంటి అంశాలు సానుకూలంగా ఉంటాయి.

**వృశ్చికం:** కుటుంబ ప్రతిష్ఠ దృష్టిలో ఉంచు కొని జారిపోయిన అవకాశాలను తిరిగి అను కూలంగా చేసుకునే యత్నాలు పట్టుదలగా చేస్తారు.

**ధనుస్సు:** మీడియాను, ప్రచారాన్ని అనుకూలంగా మార్చుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సాహంగా చేస్తారు.

**మకరం:** స్త్రీల విషయంలో ఎంత దిగి వచ్చినా సయోధ్య కుదరటం కష్టం. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు.

**కుంభం:** కలిసి వచ్చిన, పొదుపు చేసిన ధనాన్ని పెట్టుబడి రూపంలో చూసుకోవలసి ఉంటుంది. ఆస్తుల విలువ పెరుగుతుంది.

**మీనం:** ఇతరులకు వస్తువులు ఇచ్చి విరోధి అవుతారు. ఉద్యోగంలో నిందలు, ఆరోపణలు రావచ్చు. ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అమెరికాలో వృద్ధులను మోసగిస్తున్న భారత్ కాల్‌సెంటర్ మూసివేత

**వాషింగ్టన్, మే 21:** భారత్ కేంద్రంగా పనిచేస్తూ.. వృద్ధులను మోసం చేస్తున్న ఓ కాల్‌సెంటర్ కార్యకలాపాలను అమెరికాలో మూసివేయించారు. వందల మంది వృద్ధుల నుంచి మిలియన్ల కొద్దీ డాలర్లలో ఈ సంస్థ దోచుకొన్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై యేళ్ల తరబడి దర్యాప్తు నిర్వహించిన ఎఫ్‌బిఐ ఐదుగురు టెలీమార్కెటింగ్ మోసగాళ్ల నేరాలను నిరూపించింది. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో బోస్టన్‌లోని ఎఫ్‌బిఐ దీనిని ప్రకటించింది. మియామీకి చెందిన ఆడమ్ యంగ్, లాస్ వేగాస్‌కు చెందిన హారిసన్ గెవిర్జ్ టెలీకమ్యూనికేషన్ సంబంధిత సేవలను అందించే ఓ కంపెనీని నడుపుతున్నారు. ఆ కంపెనీ కాల్ రూటింగ్, టెలిఫోన్ నంబర్స్, కాల్ ట్రాకింగ్, కాల్ ఫార్వర్డ్ సర్వీసులు అందించేది. తమ సంస్థలో మోసాలు జరుగుతున్నట్లు యంగ్, హారిసన్‌లకు తెలుసు. 2020లో దర్యాప్తు ప్రారంభమడంతో మరో ఐదుగురు భారతీయుల పేర్లు బయటకు వచ్చాయి. వీరిలో సాహిల్ నారంగ్, చిరాగ్ సచిదేవ్, అబ్రార్ అన్జుమ్, మనీష్‌కుమార్ ఉన్నారు. వీరంతా అమెరికన్లే లక్ష్యంగా భారత్ కేంద్రంగా చేసుకొని టెలీమార్కెటింగ్ మోసాలకు పాల్పడుతున్నారు. వీరితోపాటు జగ్మీత్‌సింగ్ విర్క్ అనే వ్యక్తిపైనా నేరం నిరూపణ అయినట్లు ఎఫ్‌బిఐ పేర్కొంది. అమెరికాలో ఉన్న భారత్‌కు చెందిన కాల్ సెంటర్లు యంగ్, హారిసన్ గెవిర్జ్ సేవలను వాడుకొని మోసాలకు పాల్పడుతున్నాయని అధికారులు వెల్లడించారు.

# కాంగ్రెస్‌నేతలను వద్దు పొమ్మన్న మాయావతి

**లక్నో, మే 21:** లక్నోలో ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ముందస్తు అనుమతి లేకుండా బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఇంటికెళ్లిన ఇద్దరు కాంగ్రెస్ నేతలకు చేదు అనుభవం ఎదురైంది. భద్రతా సిబ్బంది వారిని లోపలికి అనుమతించకపోవడంతో వెనుతిరగాల్సి వచ్చింది. కాంగ్రెస్ నాయకులు రాజేంద్ర పాల్ గౌతమ్, బారాబంకీ ఎంపీ తనూజ్ పునియా లక్నోలోని మాయావతి నివాసానికి వెళ్లారు. ఆమెతో భేటీ కావాలని కోరారు. భద్రతా సిబ్బంది ఈ సమాచారాన్ని లోపలికి పంపారు. అయితే వారిని కలవడానికి ఆమె నిరాకరించారు. మీడియా ప్రతినిధులు దీనిపై ప్రశ్నించగా కాంగ్రెస్ నేతలు దాటవేశారు. మాయావతి ఆరోగ్యం గురించి తెలుసుకోవడానికే వచ్చామని చెప్పారు. ఆమె చాలా రోజులుగా బయట కనిపించడం లేదని, అందుకే మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చామని వివరించారు. రాహుల్ గాంధీ సందేశాన్ని తెచ్చారనే ప్రచారాన్ని పునియా ఖండించారు. ఈ పర్యటనపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. ఇది అనధికారిక పర్యటన అని స్పష్టం చేసింది. పార్టీ అనుమతి లేకుండా వెళ్లినందుకు ఇద్దరు నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పెద్ద నాయకులను కలిసేటప్పుడు ముందే అనుమతి తీసుకోవాలని యూపీ కాంగ్రెస్ విభాగం తెలిపింది. యూపీలో బిజెపిని ఎదుర్కొనేందుకు మాయావతిని కూటమిలోకి తేవాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ)తో కాంగ్రెస్‌కు పొత్తు ఉంది. మాయావతి కూడా తోడైతే ఓట్ల చీలికను ఆపొచ్చని కాంగ్రెస్ వ్యూహం. అయితే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని మాయావతి ఇదివరకే ప్రకటించారు.

# 'మావిగన్'ను అందుకే ప్రతిపాదించాం

>> ముందుకు వెళుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే అమరావతి పేరుతో రూ.47,387 కోట్లు అప్పు చేశారని, ఖజానా నుంచి మరో రూ.9,200 కోట్లు ఖర్చు చేస్తూ రాష్ట్ర ప్రజల వెన్ను విరుస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో ఇప్పటికే రూ.1,200 కోట్లతో నిర్మించిన అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ భవనాలు ఉన్నప్పటికీ, మళ్లీ కొత్తగా కడతామనడం విచ్చలవిడి దోపిడీకి నిదర్శనమన్నారు. కొత్తగా నిర్మించ తలపెట్టిన 5 బిల్డింగ్‌ల అంచనాలను జగన్ ప్రశ్నించారు. ఈ ఐదు బిల్డింగుల డిజైన్లకే రూ.401 కోట్లు తగలేశారని, మొత్తం నిర్మాణ ఖర్చు రూ.10,665 కోట్లుగా చూపించారని లెక్కలు కట్టారు. 'ప్రస్తుత అంచనాల ప్రకారం చదరపు అడుగుకు నిర్మాణ వ్యయం రూ.20,427 అవుతోంది. దీనికి ఫర్నీచర్, ఇంటీరియర్ ఖర్చులు కూడా కలిపితే చదరపు అడుగుకు రూ.30 వేలు దాటుతుంది. ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికే చదరపు అడుగుకు రూ.4,500 లోపు ఖర్చవుతుంటే, ఇక్కడ ఇంత భారీ ఖర్చు దేనికి?" అని జగన్ నిలదీశారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో కెసిఆర్ కేవలం రూ.615 కోట్లతోనే అత్యంత ఆధునిక సచివాలయాన్ని నిర్మించారని, కానీ ఏపిలో మాత్రం కొత్త టెండర్ల పేరుతో పాత కాంట్రాక్టర్లకే పనులు ఇస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు.

**సంతానం పెంచాలన్న వ్యాఖ్యలపై జగన్ సెటైర్లు**

"సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు ఇప్పుడు సంతానమే సంపద అంటున్నాడు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, ముగ్గురిని, నలుగురిని కనమంటున్నాడు. అలాకంటే డబ్బులు ఇస్తానంటున్నారు. చంద్రబాబూ మీరు ఎందుకు కనలేదు? ఒక్కరితోనే ఎందుకు ఆపావ్? నీ కొడుకు లోకేష్ కూడా ఒక్కడితోనే ఎందుకు సరిపెట్టారు? నీకొడుకైనా నువ్వు చెప్తున్నదాన్ని పాటించాలి కదా? చంద్రబాబూ నువ్వు వచ్చిన తర్వాత ప్రభుత్వం బాధ్యతగా ప్రజలకు అందించాల్సిన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను పూర్తిగా మూలనపడేశారు. మెడికల్ కాలేజీలకు, నాడు నేడు స్కూళ్లకు డబ్బులు ఇవ్వడానికి చంద్రబాబుకు మనసు రాదు కాని, అమరావతిలో బిల్డింగుల అద్దాలకు రూ.2,540 కోట్లు. ముగ్గురు నలుగురిని కంటే, వారికి కనీసం మంచి భోజనమైనా పెట్టే పరిస్థితి కుటుంబాలకు ఉంటుందా? వారి చదువులు ఏం కావాలి? వారి నాణ్యమైన వైద్యం ఎక్కడ నుంచి అందుతుంది? ముగ్గురు, నలుగుర్ని కనాలంటూ మహిళలను పిల్లలు కనే యంత్రాలుగా చూడ్డం, వారిని చులకన చేసి ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉండి నువ్వు ఇలా మాట్లాడ్డం తప్పు. మహిళలు బాగుంటనే కుటుంబాలు బాగుంటాయి. ఇంత దారుణమైన పరిపాలన చంద్రబాబు ఓవైపు చేస్తూ మరోవైపు తన కొడుకు చేత ఇద్దరు ఒకలా కాదు అని పబ్లిక్ మీటింగ్స్‌లో డైలాగ్స్ చెప్పిస్తున్నారు అది నిజమే ఎవరు ఒకేలాగా ఉండరు వెన్నుపోటుతో పార్టీని, పార్టీ గుర్తును దోచేయడం మీ హిస్టరీ ఎదురొడ్డి నిలబడి ప్రజా మద్దతు సంపాదించి, ప్రభుత్వంలోకి రావడం మా హిస్టరీ. మీరు నేను ఒకే రకం కాదు కాలేం కూడా ప్రజలకు ద్రోహం చేయడం, నమ్మించి ముంచడం మీ క్యారెక్టర్ ఆరు నూరైనా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం మా క్యారెక్టర్. పనులు చేసి చూపించడం మా స్టైల్. పబ్లిసిటీతో క్రెడిట్ చోరీకి పాల్పడ్డం మీ స్టైల్. ఇద్దరం ఎప్పటికి ఒకే విధంగా ఉండలేం" అని జగన్ పేర్కొన్నారు.

**హత్యా రాజకీయాలకు మాదే అతి పెద్ద బాధిత కుటుంబం**

రాష్ట్రంలో ఎవరిది గొడ్డలి పార్టీ, ఎవరిది గన్ కల్చర్, ఎవరివి కుట్ర రాజకీయాలు అనే అంశాలపై చంద్రబాబు సమాధానం చెప్పాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శవ రాజకీయాలు, హత్యా రాజకీయాలు చేస్తోంది చంద్రబాబేనని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. హత్యా రాజకీయాలకు తమదే అతి పెద్ద బాధిత కుటుంబం జగన్ పేర్కొన్నారు. తమ కుటుంబంలో ముగ్గురు కీలక వ్యక్తులు బలయ్యారంటూ ఆయన పలు సంచలన విషయాలను ప్రస్తావించారు. 1999 ఎన్నికలకు ఏడాది ముందు చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడే తన తాత రాజారెడ్డి హత్యకు గురయ్యారని, తన తాతాను చంపింది టిడిపి కాదా? అని ప్రశ్నించారు. వైఎస్సార్‌ను పులివెందులకు పరిమితం చేయాలనే రాజకీయ కోణంలోనే ఈ హత్య జరిగిందన్నారు. ఈ కేసులో నిందితులను హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో దాచిపెట్టి అధికార దుర్వినియోగంతో రక్షించారని ఆరోపించారు. అసెంబ్లీలో నువ్వు సభకు ఎలా వస్తావో చూస్తాం అని వైఎస్ రాజశేఖరరెడ్డిని ఉద్దేశించి చంద్రబాబు అన్న క్లిప్పింగులు ఇప్పటికీ ఉన్నాయని, ఆ మాట అన్న నాలుగు రోజులకే వైఎస్సార్ ప్రమాదంలో చనిపోయారని జగన్ గుర్తుచేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తానే చంపానని టివి లైవ్ షోలలో ఒప్పుకున్న దస్తగిరి అనే వ్యక్తి ఇవాళ పోలీసుల అండతో స్వేచ్ఛగా తిరుగుతున్నాడని, చంద్రబాబుకు, దస్తగిరికి ఒకే లాయర్ (లూథ్రా) వాదిస్తున్నారని, దీని వెనుక ఎవరి క్రిమినల్ బ్రెయిన్ ఉందో ప్రజలు ఆలోచించాలన్నారు.

# కొరత లేకుండా పకడ్బందీ చర్యలు

>> హాజరయ్యారు. అత్యవసర భేటీగా పేర్కొనడంతో ఈ సమావేశంపై బిజెపి వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను సైతం రేకెత్తించింది. దేశ భద్రత, ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ పరిణామాలపై సీనియర్ ప్రభుత్వ అధికారులు ప్రధానికి నివేదికలు ఇచ్చారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు. అంతర్జాతీయ పరిణామాల వల్ల ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా గొలుసు దెబ్బతినడం, తద్వారా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాలపై ప్రభుత్వం నిఘా ఉంచింది. మంత్రులు, అధికారులతో తన సమీక్షలోప్రధానిమోడీ వివిధ ప్రభుత్వ శాఖల పనితీరునివేదికలను కూడా పరిశీలనచేసి అనంతరం పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తిచేయాలని ఎప్పటికప్పుడు నివేదికలు రావాలని సూచించారు.

ప్రధాని విదేశీ పర్యటనలో ఉన్న సమయంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిలతో కూడిన ఒక ఉన్నత స్థాయి బృందం ఈ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చింది. దేశంలో ముడి చమురు, ఎల్‌పీజీ తగినంత నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాజ్‌నాథ్ సింగ్ ఇప్పటికే దేశ ప్రజలకు హామీ ఇచ్చారు.

ఈ అత్యవసరసమావేశంపై ఉత్కంఠ పెరగడానికి రెండో బలమైన కారణం కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ. జూన్ 10 నాటికి మోదీ 3.0 ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో, దీనికి ముందే భారీ స్థాయిలో కేంద్ర మంత్రివర్గ విస్తరణ లేదా మార్పులు చేర్పులు జరగవచ్చని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. జూన్ రెండో వారంలో పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండవచ్చన్న ప్రచారం భారీగా జరిగినా సమావేశంలో ఈ విస్తరణ ప్రస్తావన వచ్చినట్లు ఎక్కడా సమాచారం లేదు. సమావేశంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, హోంమంత్రి అమిత్‌షా ఇతర అన్ని శాఖలతోపాటు సీనియర్ అధికారులు కూడా పాల్గొని తమతమ శాఖల నివేదికలు ప్రధానికి అందించారు.

# మంత్రి నారా లోకేష్‌కు ఘనస్వాగతం



**కడప మే 21 ప్రభాతవార్త** రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం కడప విమానాశ్రయమునకు చేరుకున్న రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా నేతలను మంత్రి లోకేష్ పేరుపేరునా పలకరించారు. వారి నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ప్రభుత్వ విప్, కడప శాసన సభ్యురాలు రెడ్డప్ప గారి మాధవి రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధిమీనా, రాజం పేట సబ్ కలెక్టర్ భావన, ప్రొద్దుటూరు, మైదుకూరు, కమలాపురం శాసనసభ్యులు నంద్యాల వరదరాజుల రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్, డిసిసి బి బ్యాంక్ చైర్మన్ సూర్య నారాయణ, డిసిఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, ఎఫ్ సిఓఎఫ్ చైర్మన్ యాదగిరి రామ్ ప్రసాద్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, ఆర్ డి ఓ మురళీ, డిఈఓ శంషుద్దీన్, సమగ్ర శిక్ష ఏపీసి అనురాధ, టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు హరిప్రసాద్, అనంతపురం హిందూపురం జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్ప గారి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పుత్తా నరసింహా రెడ్డి, రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి జగన్మోహన్ రాజు, పులివెందుల నియోజకవర్గం ఇంచార్జ్ బీటెక్ రవి, బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు మన్సూర్ అలీ ఖాన్, అమీర్ బాబు, ప్రజా ప్రతినిధులు,అభిమానులు తదితరులు ఘన స్వాగతం పలికారు.కార్యకర్తల సమావేశానికి భారీ భద్రత..కడప నగర చివారులోని రాజరాజేశ్వరి కళ్యాణ మండప సమీపంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశానికి జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలీస్ అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. పలు సూచనలు చేస్తూ దగ్గరుండి పర్యవేక్షించారు. స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్, కడప ఇంచార్జ్ డీఎస్పీ ఇ. బాలస్వామి రెడ్డి, ఎఆర్ డీఎస్పీ పి.నాగేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

# యాంటీ టెర్రరిజం డే మే 21నే ఎందుకు?

**పలాసశ్రీకాకుళం, మే 21 ప్రభాతవార్త:** మే 21న ప్రతి సంవత్సరం భారతదేశంలో ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం (యాంటీ టెర్రరిజం డే) జరుపుకుంటారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు. ఈ విషాద ఘటనకు గుర్తుగా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఉగ్రవాదం వల్ల దేశానికి, సమాజానికి కలిగే నష్టాలపై యువతకు మరియు ప్రజలకు అవగాహన కల్పించడం, దేశంలో శాంతి, సామరస్యాలను పెంపొందించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం. శ్రీలంకలో తమిళులకు, అక్కడి ప్రభుత్వానికి మధ్య జరిగిన ఘర్షణలను నివారించడానికి 1987లో రాజీవ్ గాంధీ, శ్రీలంకతో ఒప్పందం చేసుకుని శాంతి సేనను (ఐపికెఎఫ్) ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్‌ను పంపారు. అయితే, ఈ దళాలు ఎల్‌టిటిఇకి నిరాయుధులను చేసే క్రమంలో ఎల్‌టిటిఇకి చెందిన చాలా మంది క్యాడర్, నాయకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. తమ ప్రత్యేక ఈలం (తమిళ రాజ్యం) సాధనకు అడ్డుపడ్డారని కక్షతో రాజీవ్ గాంధీపై తీవ్ర ఆగ్రహాన్ని పెంచుకొన్న ఎల్‌టిటిఇ అధినేత వేలుపిళ్లై ప్రభాకరన్ 1991 మే 21వ తేదీన తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఒక మహిళా ఆత్మాహుతి బాంబర్ ద్వారా రాజీవ్ గాంధీని దారుణంగా హత్య చేయించడం జరిగింది.

# తిరుమల సమాచారం

## టిటిడిని కదిలించిన 'వార్త' కథనం

## జులై నాటికి నెయ్యి తయారీ కేంద్రం పూర్తి

### - తనిఖీల్లో జెఇఒ డాక్టర్ శరత్



**తిరుపతి,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని టిటిడి ఎస్వీ గోశాలలో నిర్మాణంలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనులు రానున్న జులై నాటికి పూర్తి కానున్నాయి. ఈ పనులు పూర్తయితే టిటిడికే సొంతంగా నెయ్యితయారీకి సిద్ధంగా నుంది. టిటిడి నెయ్యిప్లాంట్ పనులకు బ్రేక్ అంటూ ఇటీవల "వార్త"ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనంపై టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆదేశంతో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర స్పందించారు. టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్‌కు బాధ్యతలు అప్పగించారు. ఆయన గురువారం మధ్యాహ్నం ఎస్వీగోశాలలోని నెయ్యితయారీ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను సమీక్షించారు. నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో వేదమవుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనులను ,చివరి దశలో ఉన్న నెయ్యి తయారీ కేంద్రం పెండింగ్ పనులు జులై నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్వీ గోశాలలో రోజుకు సుమారు 2 వేల లీటర్ల పాలను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్వీ గోశాల నుండి సేకరించే పాలను వినియోగించి స్వామివారి కైంకర్యాలు, సేవల కోసం పాలు, పెరుగు, నెయ్యి తదితర ఉత్పత్తులను టిటిడి స్వయంగా తయారు చేసేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నెయ్యి తయారీ ప్లాంట్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, వెంటనే ట్రయల్ రన్ నిర్వహించి మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. పాలు ఇచ్చే దేశీయ ఆవులను మరింతగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని, టిటిడి తరఫున చేపట్టాల్సిన నీరు, విద్యుత్, ఫ్యాన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైటింగ్, సైన్ బోర్డులు తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# రెవెన్యూశాఖలో పలు సంస్కరణలు : మంత్రి అనగాని సత్యప్రసాద్

### వేగంగా 22ఎ నిషేధిత జాబితా భూములకు విముక్తి - ఇప్పటికే 1.6 లక్షల ఎకరాలపై

### రైతులకు శాశ్వత హక్కులు - మరో 1.9 లక్షల ఎకరాల చుక్కల భూములకు త్వరలో మోక్షం



విజయవాడ,మే 21, ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో రెవెన్యూశాఖ పలు సంస్కరణలను చేపట్టింది.గతంలో ఎదురైన పలు సమస్యలను పరిష్కరించుకుంటూ భూహక్కుదారులకు ప్రయోజనం కలిగిస్తుంది.నూతన విధానంలో రైతువారి సేవలు, పట్టాదారు పుస్తకాలు అందించింది.ఈ మేరకు ఏపీలో రెండేళ్ళ సీఎం చంద్రబాబు పాలనలో తీసుకుని వచ్చిన సంస్కరణలను వివరిస్తూ రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.రెండేళ్ళలో రెవెన్యూశాఖలో ప్రజా ప్రయోజన దిశలో చోటు చేసుకున్న మార్పులు వివరించింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ వ్యవస్థను గాడిలో పెట్టడానికి చాలా శ్రమించాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా భూములకు సంబంధించిన ఫిర్యాదులే 90 శాతం వస్తున్నాయంటే గత ప్రభుత్వం ఏ స్థాయిలో సమస్యలు సృష్టించిందో అవగాహన చేసుకోవచ్చు. రెవెన్యూ సమస్యల్లేని రాష్ట్రంగా ఏపీ ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ మార్గదర్శకంలో ఈ రెండేళ్లలో ఎన్నో సంస్కరణలను రెవెన్యూ శాఖలో తీసుకొచ్చారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ లాంటి నల్ల చట్టాన్ని, ఇబ్బందికరంగా ఉన్న నాలా చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసి కీలక నిర్ణయం తీసుకుంది. అంతే కాదు భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిటేడ్ యాక్ట్‌ను తీసుకొచ్చారు. రైతులకు ఊరట కలిగించేందుకు ఆర్ఓఆర్ యాక్ట్‌ను సవరించారు. రీ సర్వేపై గ్రామసభలు, అన్ని రకాల భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు నిర్వహించి అక్కడిక్కడే రైతుల సమస్యలను పరిష్కరించారు. రీ సర్వే 2.0లో రైతలను భాగాస్వాములను చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. భవిష్యత్తులో వివాదాలకు తావులేని భూ రికార్డులను రూపొందిస్తున్నారు. రెవెన్యూ వ్యవస్థలో బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగిస్తూ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖలను అనుసంధిస్తూ భూములకు డిజిటల్ భద్రతను ప్రభుత్వం కల్పిస్తోంది. రైతులే నేరుగా ఆన్లైన్లో తమ భూములకు సంబంధించి 1బి, అడంగల్‌కు సొంతంగా డిజిటల్ లాక్ చేసుకునే అవకాశాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. దీంతో రైతుల అనుమతి లేకుండా ఏ అధికారి కూడా ఆ భూమిని మ్యుటేషన్ గానీ, రిజిస్ట్రేషన్ గానీ చేయడానికి వీల్లేదు. అలాగే 15 రకాల భద్రతా అంశాలతో రాజముద్రతో పకడ్బందీగా రూపొందించిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా రైతులకు ప్రభుత్వం అందిస్తోంది. గత ప్రభుత్వ హాయంలోభూ బకాసురులు.. రైతులు, భూ యజమానులు, పేదల భూములను అడ్డగోలుగా దోచుకున్నారని రెవెన్యూశాఖ మంత్రిత్వశాఖ ఆరోపించింది. ఇందుకోసం రెవెన్యూ వ్యవస్థను పూర్తి స్థాయిలో భ్రష్టు పట్టించారు. రీ సర్వే పేరుతో రైతులకు లేనిపోని సమస్యలు సృష్టించడంతో పాటు ఉన్న పొలం కంటే తక్కువ విస్తీర్ణం పట్టాదారుపుస్తకాల్లో చూపించింది.

## విశాఖలో 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం :ఎంపి భరత్

**విజయవాడ మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపీ భరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జీవీఎంసీ ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రూ.1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. మదురవాడ జోన్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ.117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

# గోవిందా.. ఏదీ నీ దర్శనమయ్యా!

### - 30గంటలపైగానే సర్వదర్శనం - క్యూలైన్లలోనికి రావద్దని టిటిడి ప్రచారం

**తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** అసలే వేసవిసెలవులు...ఆపై విద్యాసంస్థలు తెరచుకునేందుకు సమయం దగ్గరపడుతుండటంతో అనూహ్యంగా గురువారం ఉదయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. అలిపిరి టోల్ గేట్ నుంచే రద్దీ కనిపిస్తోంది. గతనెలరోజులుగా ప్రతిరోజు 80 వేల మందికి దర్శనం చేయిస్తున్నా ,పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. భక్తులకు కీలక సూచన గా గత రెండు రోజుల నుంచి దాదాపు డెబ్బయి వేల మంది భక్తులు కాలినడకన తిరుమలకు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ,క్యూ లైన్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ద్వారా సాధారణ భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్యూ లైన్లను నిర్వహిస్తున్నారు. సర్వదర్శనానికి 30 గంటల పైగానే సమయం పడుతోంది. భక్తులు పూర్తిగా సిబ్బందికి సహకరించాలని, సంయమనంతో దర్శనం చేసుకోవాలని ప్రచార హోరెత్తిస్తున్నారు. క్యూ లైన్ లలో ఉన్న వారికి శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, మజ్జిగ, మంచినీరు, పాలు అందిస్తున్నారు. గురువారం ఉదయానికి తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల క్యూ లైన్ గోగర్భం డ్యామ్ వరకూ విస్తరించింది. సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించే భక్తులకు శ్రీవారి దర్శనం ముప్పై గంటలపైగానే సమయం పడుతుంది. టైమ్ స్లాట్ సర్వదర్శనం భక్తులకుపది గంటల సమయం పడుతుంది. ఎస్ఇడి టిక్కెట్ భక్తులకు ఆరుగంటల సమయంపడుతుంది. బుధవారం రాత్రి వరకు శ్రీవారిని 86,315 మంది భక్తులు దర్శించుకున్నారు. 44,107 మంది భక్తులు తలనీలాలుసమర్పించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి 3.94 కోట్లు రూపాయలు ఆదాయం వచ్చింది. గురువారం సాయంత్రానికి 39వేలమంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల క్యూ లైన్లలోకి కూడా మరింత మంది భక్తులను అనుమతించడాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు.నేటి ఉదయం 10గంటల వరకు భక్తులను క్యూలైన్లలోనికి అనుమతించరు. వేసవి సెలవుల కారణంగా తిరుమలలో భక్తుల సంఖ్య భారీగా పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఏడుకొండలస్వామి జగద్విఖ్యాత దేవుడు

### - విదేశాల్లోనూ 'వెంకన్న' ఆలయాలు - దేశంలో అన్ని రాజధానుల్లో గోవిందుడు

**తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు జగద్విఖ్యాతిగాంచిన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని ,సేవలను ఖండాంతరాలకు వ్యాప్తిచేయడానికి తిరుమల తిరుపతిదేవస్థానం నిర్ణయించింది. విదేశాల్లోనూ వెంకన్న ఆలయాలు నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేసింది. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమల శ్రీవేంకటేశ్వరుడు అందరి దేవుడని, మహిమాన్వితగల స్వామిగా వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్నాడు. హిందువులు ఉన్న ప్రతి చోటా ఆలయాలు ఉండాలనే ధృడ సంకల్పం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సంకల్పం వ్యక్తం చేయడంతో టిటిడి పాలకమండలి, అధికారులు కార్యాచరణ అమలుచేసే దిశగా అడుగులేస్తున్నారు. దేశంలోనేగాక విదేశాల్లోనూ అత్యధికంగా హిందువులు ఉన్న ప్రతి చోటా శ్రీనివాసుడి ఆలయాలు నిర్మాణం చేసి,హిందూ సనాతన ధర్మవ్యాప్తికి మరింతగా కృషి చేయాలనే భావన వ్యక్తమవుతోంది. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాల రాజధానుల్లోనూ వెంకన్న ఆలయాల నిర్మాణం చేయాలని టిటిడి కృత నిశ్చయంతో ఉంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయా రాజధానుల్లో ఆలయాల నిర్మాణం కోసం భూమి కేటాయించాలని కోరుతూ లేఖలు కూడా రాశారు. మరికొన్ని రాష్ట్రాలకు లేఖలు రూపంలో విజ్ఞప్తి చేస్తోంది. సాక్షాత్తు శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా సాలగ్రామశిల ద్వారా స్వయంభువుగా ...అర్చనామూర్తిగా ఆవిర్భవించారనేది పురాణాలద్వారా తెలుస్తున్న విషయం. తిరుమల ఆలయంలో జరిగే తరహాలోనే అన్ని చోట్లా ఆలయాలు నిర్మించి నిత్యం శ్రీవారి కైంకర్యాలు, సేవలు, పూజలు జరిపించి అక్కడి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించాలనే అభిప్రాయంతో ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతోబాటు తమిళనాడు,కర్నాటక, ఒరిస్సా,మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, హర్యానా, కన్యాకుమారి,రామేశ్వరం వంటి నగరాల్లోనూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఇటీవల కాలంలో అమరావతి, విశాఖపట్నంలో శ్రీవారి ఆలయాలు నిర్మించిన టిటిడి అక్కడ తిరుమల ఆలయంలో జరిగేలాగే పూజలు,సేవలు నిర్వహిస్తున్నారు. దాదాపు 14రాష్ట్రాల్లో ఇప్పటికే వెంకన్న ఆలయాలు నిర్మించిన టిటిడి దైనందిన పూజా కార్యక్రమాలు చేపడుతోంది. అక్కడి స్థానిక ప్రజలకు, హిందు భక్తులకు స్వామివారి సేవలను చేరువచేసింది. సనాతనహిందూధర్మం ఆచరింపబడుతున్న భారతదేశంలో హిందువులు పవిత్రంగా, విశ్వాసంతో నమ్మికొలిచే శ్రీవేంకటేశ్వరస్వామిపట్ల భక్తిభావంతో ఉంటున్నారు. హిందు కుటుంబాల్లో ఏ చిన్న కష్టం వచ్చినా, ఆపద కలిగినా వెంటనే తిరుమల వేంకటేశ్వరస్వామిని మొక్కుకుని ముడుపు కట్టి మొక్కులు తీర్చుకోవడం జరుగుతుంది. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు.



## బిసి గురుకుల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్లు :బిసి సంక్షేమ మంత్రి సవిత

**విజయవాడ మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యతో పాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమని, దీన్ని దృష్టిలో పెట్టుకునే బీసి గురుకులాలు విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్ సూట్, షూస్ అందజేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు వాటిలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన ముగ్గురు క్రీడాకారులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి సవిత అభినిందించారు. గత నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ రాజస్థాన్ లోని ఉదయ్ పూరల్ ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో జాతీ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుంటూరుకు చెందిన టి.నాగజ్యోతి 76 కేజీల విభాగంగా జూనియర్ స్థాయిలో పోటీ పడింది. బాలిక 355 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలుచుకుంది. అదే జూనియర్ స్థాయి విభాగంలో పోటీపడిన కె.సత్యరామ్ రాజ్ 53 కేజీల విభాగంలో 110 కేజీలు ఎత్తి జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం గెలుచుకున్నాడు. సబ్ జూనియర్ స్థాయి విభాగంగా పోటీపడిన వినోద్ కుమార్ 110 కేజీలు ఎత్తి, జాతీయ స్థాయి రికార్డు సాధించి బంగారు పతకం సాధించాడు.

# రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల శ్రీవాణి భజన మందిరాలు నిర్మాణం

### చిత్తూరు జిల్లాలో 3.39 కోట్లతో 183 ఆలయాల్లో ధూప దీప నైవేద్య పథకం అమలు

### - రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**కాణిపాకం, మే 21 ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆలయాలు లేని ప్రతి గ్రామంలో ఆలయాల నిర్మాణమే లక్ష్యంగా 5 గ్రామాల్లో శ్రీ వాణి భజన మందిరాల నిర్మాణంకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. గురువారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో 14.74 కోట్ల రూపాయల తో నూతనంగా నిర్మించిన బ్లాక్ 1, బ్లాక్ 2 వసతి సముదాయాలను మంత్రి రామనారాయణ రెడ్డి పూతలపట్టు,చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురజాల జగన్మోహన్ లతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ కాణిపాకం ఆలయ దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం 14.74 కోట్ల రూపాయల వ్యయంతో వినాయక సదన్ లో 83 గదులు, 15 సూట్లు, రెండు కామన్ హాల్లో నిర్మించి నట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో దాతలు, ఆలయ పాలక మండలిల సహకారంతో మ్యాచింగ్ గ్రాంట్ల ద్వారా ఆలయాల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ధూప దీప నైవేద్యం పథకం కింద కనీస వసతులు లేని ఆలయాలకు అర్చకులను నియమించి ప్రతినెల వారికి పదివేల రూపాయల వంతెన వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లాలో 183 ఆలయాలకు 3.39 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 6,229 ఆలయాలకు 74.74 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని, భవిష్యత్తులో 10 ఆలయాలకు విస్తరించాలని ప్రభుత్వ సంకల్పమని మంత్రి రామనారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలో సిజిఎఫ్ నిధుల ద్వారా 30 ఆలయాల పునర్నిర్మాణానికి 64.33 కోట్ల రూపాయలను తెలిపారు. దేవాదాయ శాఖ ప్రక్షాళనలో భాగంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కామన్ గుడ్ ఫండ్ ద్వారా 691 ఆలయాలకు 812.67 కోట్లతో జీర్ణోదరణ పనులను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. 2027 జూన్ 26 నుంచి ప్రారంభమయ్యే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని గోదావరి పరివాహక ప్రాంతాల్లోని 43 ఆలయాలను 51.79 కోట్లతో పునర్నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా రాష్ట్రవ్యాప్తంగా 980 ఆలయాలకు ధర్మకర్తల మండల నియామకాన్ని పూర్తి చేశామని, మరో 438 ఆలయాలకు త్వరలో నియామకాలు చేపడతామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ అభ్యర్థన మేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ను టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవాదాయ, పర్యాటక, ఇతర శాఖలు కలిసి జూన్ 15 నాటికి ప్రణాళికలు సిద్ధం చేస్తాయని పేర్కొన్నారు. ఆయుర్వేద, నక్షత్ర వృక్షాలతో ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.



వినాయక సదన్ వసతి సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

# గుంటూరులో అగ్నికీలలు



**గుంటూరు మే 21 ప్రభాత వార్త ప్రతినిధి :** గుం టూరు లోని మహాత్మ గాంధీ ఇన్నర్ రింగు రోడ్డులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్నిప్రమాదానికి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. దట్టంగా పొగ అలుముకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులు దగ్ధమయ్యాయి. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. పైపులు తగలబడి మంటలు ఎగిసి పడటంతో స్థానికులు భయ భ్రాంతులకు గురై ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సకాలంలో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తి గా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో అక్కడ ఉన్న డ్రైనేజీ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి.



## సింహాచలం దేవస్థానం ధర్మకర్మల మండలి ప్రమాణస్వీకారం

**విశాఖపట్నం (సింహాచలం), 21 మే ప్రభాతవార్త** శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డ్) ప్రమాణస్వీకార మహోత్సవం గురువారం కొండపైన అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) జల్లేపల్లి వెంకట్రావు నూతన సభ్యులచే శాస్త్రోక్తంగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ నరసాపురం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆర్. కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ కార్యక్రమానికి వర్చువల్ (ఆన్‌లైన్) ద్వారా హాజరై, నూతన సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం బోర్డు సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రమాణస్వీకారం చేసిన ధర్మకర్మల మండలి సభ్యులు: మాకేన సీతారాం పాత్రుడు (నవీన్),కోసిరెడ్డి దామోదర్, చలమూరి భారతి, కరక దేవుడు, కనకాల మురళీమోహన్, వెంపడాపు అన్న పూర్ణ, బీతాల నీరజ లక్ష్మీ మ్మ కుమారి, మధుపద సన్యాసి రావు, డాక్టర్ ధరణి బండ్ల, నీతిపల్లి మహేష్, పెద్దిశెట్టి ఉష శ్రీ, లలిత జ్యోతి, గుత్తికొండ శ్రీలత, సునరపు గణపతి రావు, చల్లాంగి జ్ఞానేశ్వరి, పావులూరి శ్రీనివాస రావు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో 'జనతా వారధి'

### 'మీ సమస్య.. మా బాధ్యత' కు విశేష స్పందన.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్



**విశాఖపట్నం న్యూస్:** ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత చేరువగా ఉండే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "జనతా వారధి" కార్యక్రమాన్ని జనవరి 5,2026, సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ తెలిపారు.ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులు, సమస్యలు, అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి శుక్రవారం స్వీకరించిన సమస్యలను సోమవారం ఆయా జిల్లాలకు చెందిన అధికారులతో సమీక్షించి, వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం మరియు అధికార వ్యవస్థ మధ్య వారధిగా నిలవడమే "జనతా వారధి" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు."జనతా వారధి" కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,248 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, విద్య, ఉపాధి, తాగునీటి సమస్యలు, రోడ్లు మరియు రెవెన్యూ సంబంధిత అంశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఇప్పటి వరకు అందిన అర్జీలలో సుమారు 2,180 సమస్యలు పరిష్కారమయ్యాయని, మరో 760 సమస్యలు సంబంధిత శాఖల పరిధిలో పరిష్కార దశలో ఉన్నాయని వెల్లడించారు. జనతా వారధి ద్వారా 486 పెన్షన్ సమస్యలు ,312 రేషన్ కార్డు సమస్యలు,228 భూ మరియు రెవెన్యూ సమస్యలు పరిష్కార దశకు చేరుకున్నాయన్నారు.174 తాగునీరు మరియు మౌలిక వసతుల సమస్యలు, 142 విద్య మరియు ఉపాధి సంబంధిత సమస్యలు,96 ఆరోగ్య సేవలకు సంబంధించిన అర్జీలు పరిష్కరించబడ్డాయని తెలిపారుప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య సమన్వయ వారధిగా నిలవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. జనతా వారధి" కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన.

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
AMARAVATI, RayapudiVillage, Thullur Mandal - 522237, Email: recruitment@apcrda.org

**E PROCUREMENT TENDER NOTICE**

NIT No:MAU61-USI0HB/4/2026-HB, Dt: 21-05-2026.

**Name of Work:**" APCRDA – H&B Maintenance-Operation and Maintenance of Street Lighting in VIP Routes of Amaravati Capital Region and Seed Access Road for one year" Estimate Amount: Rs. 1,03,50,000/-
The bid can be downloaded on AP e-procurement portal from 22.05.2026 to 06.06.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid 06.06.2026 up to 15.00 Hrs, Technical bid opening 06.06.2026 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, **APCRDA,** Rayapudi

**AMARAVATI DEVELOPMENT CORPORATION LIMITED (ADCL)**
**RAYAPUDI, AMARAVATI**

No.07/CE/ADC/Engg/2026-27 Dated: 20.05.2026

**E-PROCUREMENT - SHORT TENDER NOTICE**

1. Shifting and erection of LT, 11 kV and 33kV Overhead Power lines in E14 road including dismantling of existing lines and poles obstructing road development works in Amaravati Capital City (2nd call)- Estimate Cost- **Rs.99.00 lakhs.**
2. Shifting and erection of LT, 11 kV and 33kV Overhead Power lines in E15 road extension to Old Nation Highway Mangalagiri including dismantling of existing lines and poles obstructing road development works in Amaravati Capital City (2nd call)- Estimate Cost- **Rs.99.60 lakhs.**
3. Shifting and erection of 33kV , 11 kV and LT Overhead lines in E3 Road (Phase-II) at Ch:16+150, Ch:16+200,Ch:16+560, Ch:16+860, Ch:17+120, Ch:17+600, Ch:17+860 including dismantling of existing lines and poles obstructing road development works in Amaravati Capital City – Estimate Cost – **Rs.94.00 Lakhs.**

The bids can be downloaded on "ap-eprocurement" portal @ **tender.apeprocurement.gov.in** **22.05.2026 to 29.05.2026** and last date for submission of Bids on **29.05.2026**, bid opening on **29.05.2026.** For any further clarifications, contact **Sri. G.Lakshmi Narayana, Executive Engineer (Electrical), ADCL, Rayapudi, Amaravati, Ph.No: 8977750158**

**Sd/- CHAIRPERSON & MANAGING DIRECTOR**
**ADCL, AMARAVATI**

22-5Pg7exHMNWJQE.qxd:22-5Pg7exHMNWJQE.qxd 1/1/02 6:24 AM Page 1





## ప్రతిభకు పట్టం - ఢిల్లీకి 39 మంది గుంటూరు విద్యార్థులు

### ఎమ్మెల్యే మాధవి చొరవకు పెమ్మసాని ప్రశంస

**గుంటూరు మే 21 ప్రభాత వార్త ప్రతినిధి :** గుంటూరు నుంచి ఢిల్లీ పర్యటనకు వెళ్లిన గుంటూరు వెస్ట్ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీలోని ఇండియా పోస్ట్ డాక్ భవన్‌లో ఆత్మీయంగా గురువారం కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే మాధవి తీసుకున్న చొరవతో దేశ రాజధాని ఢిల్లీని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పిస్తూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించే ఈ కార్యక్రమాన్ని చేపట్టడాన్ని పెమ్మసాని అభినందించారు. ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యేను పెమ్మసాని ప్రశంసించారు.

# రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గన్‌మెన్ల తొలగింపు

- ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతంలో గన్‌మెన్ల తొలగింపు ఎంత వరకు సమంజసం అంటున్న వైసిపి నాయకులు
- పోలీసు ఉన్నతాధికారులను కలిసే ఆలోచనలో వైసిపి జిల్లా నేతలు

**అనంతపురం, మే 21 ప్రభాతవార్త బ్యూరో** వైసిపి నేత రాప్తాడు మాజీ శాసనసభ్యులు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఉన్న 1+1 గన్‌మెన్లను తొలగిస్తూ పోలీసు అధికారులు ఆదేశాలు జారీ చేసి గన్‌మెన్లను వెనక్కి రావాలని పిలవడంతో వైసిపి వర్గీయుల్లో ఆందోళనలు నెలకొంది. ఎవరి ఆదేశాలతో మాజీ ఎమ్మెల్యేకి గన్‌మెన్లను తొలగించారు.. దీని వెనుక ఉన్న కారణాలు ఏంటన్నది చర్చ నడుస్తోంది. రాప్తాడు నియోజకవర్గంలో రామగిరి, కనగానపల్లి, సికెపల్లి, రాప్తాడు, ఆత్మకూరు మండలాల్లో పలు ఫ్యాక్షన్ గ్రామాలు ఉన్నాయి. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో టిడిపి, వైసిపి వర్గీయుల మధ్య గ్రామ కక్షలు ఉన్నాయి. గతంలో మాదిరి పెద్ద ఎత్తున ఫ్యాక్షన్ గొడవలు లేనప్పటికీ రాజకీయాల పరంగా ముఠా కక్షలు, వర్గ విబేదాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీలో సీఎంగా ఉన్నప్పటి నుంచి రాప్తాడు నియోజకవర్గంలో తనదైన శైలిలో కాంగ్రెస్ మద్దతు దారులకు అండగా ప్రకాష్‌రెడ్డి పోరాడుతూనే వస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వర్గాల మధ్య ఆదిపత్యపోరు ఎన్నో ఏళ్లుగా నడుస్తోంది. రెండు పార్టీల నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూనే ఉంటారు. గత వైసిపి ప్రభుత్వంలో రాప్తాడు ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఉన్నప్పుడు 2+2 గన్‌మెన్లతోపాటు పెట్రోలింగ్ వెహికల్ కూడా ఉండేది. రాప్తాడు నియోజకవర్గంలో నెలకొన్న పాత కక్షల నేపథ్యంలో గన్‌మెన్ల సంఖ్య కొనసాగుతూ వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకాష్‌రెడ్డి గన్‌మెన్ల సంఖ్యను 2+2 నుంచి 1+1కు తగ్గించారు. ఆ తర్వాత పెట్రోలింగ్ వెహికల్‌ను కూడా తీసేశారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి 1+1 గన్‌మెన్లను కూడా తొలగించడంతో రాప్తాడు నియోజకవర్గ ద్వితీయ శ్రేణి వైసిపి నాయకులు, కార్యకర్తల్లో ఆందోళన నెలకొంది. రాప్తాడు నియోజకవర్గంలో వివిధ మండలాల్లో పార్టీ సమావేశాలు, గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు వైసిపి తరుపున మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పుడు గన్‌మెన్లను తొలగించడం ద్వారా ఎక్కడైనా గ్రామాల్లో రెండు వర్గాల మధ్య గొడవలు జరిగినప్పుడు ఆ ప్రభావంతో కార్యకర్తలను కలుసుకునేందుకు ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ సమన్వయ కర్త హోదాలో వెళ్లాలనుకుంటే సమస్యలు ఉత్పన్నమైతే బాధ్యులు ఎవన్నది కూడా చర్చ జరుగుతోంది. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు పునరాలోచించాలని వైసిపి నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా సత్యసాయి జిల్లాకు చెందిన వైసిపి జిల్లా నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, పోలీసు ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించాలని ఆలోచనలో ఉన్నారు.



## రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి బాధ్యతలు స్వీకారం

**హైదరాబాద్ (బేగంపేట) మే 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ, సిబ్బంది చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మికి వేదపండితుల మంత్రోచ్చారణ, ఆశీర్వచనాలతో స్వాగతం పలికారు. ముందుగా తండ్రి కె.కేశవరావు ఆశీర్వాదం తీసుకుని చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తూ ఫైలుపై సంతకం చేసారు. చైర్ పర్సన్‌తో పాటు సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవరెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయ్, ఉజ్మా ఆషయ్ షాకీర్ పదవీ బాధ్య తలను స్వీకరించాక ప్రమాణ స్వీకారం చేసారు. ముఖ్యఅతిధులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, డా.జి.వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి, భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్‌యాదవ్, మహబూబాబాద్ ఎంపి పి.బలరామ్‌నాయక్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీమంత్రి గీతారెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, బీసీ ఆర్థిక సంస్థ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, స్త్రీ శిశు సంక్షేమం దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరక్టర్ శృతి ఓజా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నూతన చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేసారు. రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కరించడంలో మహిళా కమీషన్ ముం దుంటుందని ఆశిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్షణతోపాటు వారికి ప్రతి విషయంలో మహిళా కమిషన్ అండగా ఉంటుందన్నారు.

## బాధితురాలిని నిందించడం కాదు.. నిందితుల పెంపకాన్ని ప్రశ్నించండి

### కుల పితృస్వామ్య వ్యవస్థ వల్లే మహిళల అణచివేత

### కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్

**హైదారబాద్, మే 21, ప్రభాతవార్త:** భగీరథ్ బాధితురాలిని నిందించడం కాదనీ నేరస్తుల పెంపకాన్ని ప్రశ్నించాలని కాంగ్రెస్ తెలంగాణ వ్యవ హారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ అన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసుపై కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ గాంధీభవన్‌లో గురువారం స్పందిస్తూ తెలంగాణలో పోక్సో కేసు తీవ్ర ఆందోళన కలిగించడమే కాకుండా, రాజ్యాంగ బద్ధ సమానత్వానికి సమాజం ఇంకా చాలా దూరంలో ఉందని, బాధిత బాలికపై వస్తున్న వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిర్భయ ఘటన నుంచి ఇప్పటి వరకు బాధితురాలినే నిందించే ధోరణి మారలేదని మీనాక్షి నటరాజన్ విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై ఫిర్యాదు నమోదవడంతో పలు ప్రశ్నలు ఎదురవుతున్నాయని తెలిపారు. కులాల ప్రకారం మహిళలపై లైంగిక దోపిడి పెరుగుతోన్నదని అన్నారు. పితృస్వామ్య వ్యవస్థ కారణంగా మహిళలు అణిచివేతకు గురవుతున్నారని పితృస్వామ్య సమాజంలో అబ్బాయిల హింసాత్మక ప్రవర్తనను సాధారణంగా చూస్తున్నారని అన్నారు. కుల సమూహంలో నష్టపోయేది మహిళలేనని పెరియార్ వ్యాఖ్యలను గుర్తు చేశారు. బాలికల దుస్తులు, పెంపకంపై విమర్శలు చేయడం దారుణమని అభిప్రాయపడ్డారు .రాజకీయ పార్టీలలో కూడా మహిళా సురక్షిత అనుకూల పరిస్థితులతోపాటు, సోషల్ జెండర్ జస్టిస్ సెన్సిటైజేషన్ కమిటీలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆమె చెప్పారు. కాంగ్రెస్‌లో తిరోగమన ఆలోచనలకు స్థానం లేదని మీనాక్షినటరాజన్ స్పష్టం చేశారు. ధర్మం, నీతి సూత్రాలు మాట్లాడేవారు మహిళల పట్ల సంకుచితంగా వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. వ్యక్తులపై నిందలు కాదని, పితృస్వామ్యంపై పోరాటమే అవసరమని వ్యా ఖ్యానించారు. సామాజిక న్యాయం కోసమే కాకుండా లింగ వివక్షపై కూడా పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆమె పిలుపునిచ్చారు.




## రూ.7.90 కోట్ల భారీ మోసం బట్టబయలు

**కొత్తూరు, మే 21, ప్రభాతవార్త:** కొత్తూరు మండల పరిధిలోని సి.ఎం.టి.ఎల్ సమీపంలోని తీగాపూర్‌లో ఉన్న ఆర్‌ఎం కన్వర్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో భారీ ఆర్థిక మోసం వెలుగులోకి వచ్చింది. సంస్థలో ఫైనాన్స్, అకౌంట్ హెడ్‌గా పనిచేస్తున్న హన్మండ్ల లక్ష్మణ్‌ను కొత్తూరు పోలీస్లు గురువారం అదుపులోకి తీసుకున్నారు. డిసిపి శిరీష రాఘవేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు సంస్థకు చెందిన రూ.7,90,27,915 (ఏడు కోట్లు తొంభై లక్షల ఇరవై ఏడు వేల తొమ్మిది వందల పదిహేను రూపాయలు) నిధులను అక్రమంగా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాకు మళ్లించినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం ఆ మొత్తాన్ని షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల రూపంలో వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. సంస్థ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కొత్తూరు పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంక్ లావాదేవీలను పరిశీలించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితుడిని గురువారం న్యాయస్థానం ఎదుట హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసిపి, ఇన్‌స్పెక్టర్ నరసయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బండి భగీరథ్ కేసుపై కెసిఆర్ మౌనమేల?

**పోక్సో కేసులో పోలీసులే అరెస్ట్ చేశారు**

**ఎన్నికలవగానే రోజుకోసారి పెట్రో, డీజిల్ ధరలు పెంచుతున్నారు**

**రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు 80శాతం పూర్తయింది**

**కులగణన విషయంలో సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

**సచివాలయంలో మీడియాతో మాట్లాడిన సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 21:** పోక్సో కేసులో నింది తుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీసులు చట్టప్రకారమే అరెస్ట్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అప్పా జంక్షన్ వద్ద అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తనకు పోలీసులు ఇచ్చిన సమాచారం ఇదేనని.. వారి మాటలనే తాను నమ్ముతానని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు ప్రశ్నలపై స్పందించారు. బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించారనే ప్రచారాన్ని ముఖ్యమంత్రి ఖండించారు. ఒకవేళ ఆయనే అప్పగించాలనుకుంటే పోలీసు లను ఇంటికి పిలిచి అప్పగించాల్సి ఉందని అభిప్రాయ పడ్డారు. రోడ్డు మధ్యలో ఉన్న అప్పా జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుంటే అది సరెండర్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. అప్పా జంక్షన్ ఏమైనా బండి సంజయ్ ఇల్లా? అని ప్రశ్నించారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రభుత్వం పద్ధతి ప్రకారం చర్యలు తీసుకుందని రేవంత్ రెడ్డి వివరించారు. ఈ సున్నితమైన కేసులో బీఆర్‌ఎస్ నాయకులు సిగ్గు తప్పి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వారే విచారణ జరిపి, వాళ్లే తీర్పులు ఇచ్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. పోక్సో కేసులో మైనర్ బాలిక వివరాలు వెల్లడిస్తే ఆ కుటుంబానికి ఎంతో ఇబ్బంది కలుగుతుందని, కేటీఆర్ రాజకీయాల కోసం ఒక బాలికను అడ్డుపెట్టుకోవడం సరికాదన్నారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆరెస్ నేతలు శాడిస్టులా వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతే కాని దిగజారి ప్రవర్తించొద్దు కేటీఆర్ బావమరిది ఫామ్ హౌస్ లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం, బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం,పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుం టున్నాని దుయ్యబట్టారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులైంది పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్.. రాష్ట్రంలో ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదు? అని ప్రశ్నించారు. కులగణన విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం తెలంగాణ నిర్ణయాన్ని సుప్రీం కోర్టు కూడా సమర్ధించడం మాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచాం జనగణనలో కులగణన విషయంలో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచింది మోదీ ప్రభుత్వం తక్షణమే జనగణనలో కులగణన చేర్చి బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని చెప్పారు.ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బిజెపి,మోడీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తుందనిఅందుకే ఎన్నికలు అవగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది.. ఇంకా 20 శాతం మిగిలి ఉంది ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. హామీలీలు దొరకక ధాన్యం కొనుగోలు ఆలస్యమైంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ఉండటంతో వారంగా ఓట్లేసేందుకు వెళ్లారు. ఇప్పుడిప్పుడే తిరిగి వస్తున్నారని చెప్పారు. బీఆరెస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు రైతుల విషయంలో బీఆర్‌ఎస్ శవ రాజకీయాలు చేయాలని చూస్తోందన్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని చెప్పారు.




# నిప్పుల కుంపటిలా మండిపోతున్న తెలంగాణ

### 20 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు

### రాష్ట్రవ్యాప్తంగా 45 డిగ్రీలను దాటిన ఎండలు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** తెలంగాణపై భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఉదయం తొమ్మిది దాటిం దంటే చాలు బయటకు రావాలంటేనే జనం వణికి పోతున్నారు. మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ కర్ఫ్యూను తలపిస్తూ నిర్జనంగా మారుతున్నాయి. రాష్ట్రంలో ఎం డలు, వడగాల్పుల తీవ్రత మునుపెన్నడూ లేని విధంగా పెరిగిపోతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో 46.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. మొత్తంగా గురువారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల ను దాటడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కామారెడ్డి, జనగామ, మెదక్ జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నెల 26వ తేదీ వరకు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాబోయే అయిదు రోజులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, హనుమకొండ జిల్లాలకు వాతావరణశాఖ రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండ తీవ్రత అత్యధికంగా ఉంటోందని, ఆ సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వాతావరణశాఖ అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండల తీవ్రత వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు త్వరగా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే రోజంతా తగినన్ని నీళ్ల తాగాలని సూచిస్తున్నారు. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా వెంట గొడుగు, నీళ్ల బాటిల్, గ్లూకోజ్ నీరు, కొబ్బరి బొండాల నీరు లేదా నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలను ఉంచుకోవాలని గుర్తు చేస్తున్నారు.

# బిజెపి, బిఆర్‌ఎస్ అవగాహనతోనే రేవంత్‌పై విమర్శలు

### బండి భగీరథ్‌పై ఎఫ్‌ఐఆర్ నమోదు తరువాత బిఆర్‌ఎస్ గొంతు ఎత్తింది: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదారబాద్, మే 21, ప్రభాతవార్త:** బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల మధ్య అండర్ స్టాండింగ్‌తోనే బండి భగీరథ్ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఐపిఎస్ ఆఫీసర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం విమర్శించారు. సిఎల్‌పిలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బండి భగీరథ్ కేసు తామే వెలికి తీశామన్నట్లుగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతున్నాడనీ పోక్సో కేసులో ఎక్కడైనా స్టేషన్ బెయిల్ ఇస్తారా..? అని విమర్శించారు. కెసిఆర్ కెటిఆర్ భరతం పడతా, దొర గడీలు బద్దలు కొట్టి ఏనుగును తీసుకు పోతానని గతంలో ఆర్‌ఎస్ ప్రవీణ్ చెప్పారనీ ఇప్పుడు. దొర గడీల్లో ఏనుగును తాకట్టుపెట్టి బానిసలా మారాడని ఎద్దేవా చేశారు. దొర గడీలు బద్దలు కొట్టింది మా రేవంతైతే ఏనుగును దొరగడిలో తాకుట్ట పెట్టింది ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేశారని గతంలో ఫిర్యాదు చేసిన ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ దొర గడీకి పోయిన ప్రభాకర్ రావు చాలా మంచోడని ఎంతో దిగజారిపోయి స్టేట్ మెంట్ ఇచ్చాడనీ అన్నారు. ఫామ్‌హౌస్‌కు సెక్యూరిటీ ఇచ్చే పోలీస్‌గా, కెసిఆర్ దుర్మా ర్గాలను ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ కాపాడటానికి మారాడనీ తెలిపారు. దేశంలోనే తెలంగాణ పోలీస్ రోల్ మోడల్ అనీ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ పోలీసులు మార్చారనీ చెప్పారు..తెలంగాణ పోలీసుల మనోభావాలను దెబ్బతీస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఎలా పోలీస్ అయ్యాడనీ ప్రశ్నించారు. భగీరథ్ ను అరెస్ట్ చేసి పోలీసులు తీసుకువచ్చిన వీడియోలు ఉన్నాయనీ పోలీసులు చెప్పేది నమ్మకుండా రాజకీయ నాయకులు చెప్పే విషయాలను నమ్మే దీన స్థితిలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఉన్నాడనీ విమర్శించారు. ఆర్‌ఎస్ ప్రవీణ్ బిజెపి పైన మాట్లాడకుండా రేవంత్ రెడ్డి పైన విమర్శలు చేస్తున్నాడనీ ఆయన ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదనీ హితవు చెప్పారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇంటిని మా పోలీసులు సోదా చేశారనీ చెప్పారు. బండి సంజయ్ బంధువుల ఇళ్లలో కూడా సోదాలు చేశారనీ తెలిపారు. పారదర్శకంగా మా సిఎం పనిచేస్తుంటే విమర్శలు చేస్తున్నారనీ తెలిపారు. ఎఫ్ ఐ ఆర్ అయిన తర్వాత కూడా సెక్షన్లు మార్చి కేసును మరింత బలోపేతం చేశారనీ వివరించారు. ఉడత ఊపులకు తాటి చెట్టు కదలదనీ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు పెట్టుకో తెలంగాణ సమాజానికి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నాడనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహారణకు అనుమతించిన హైకోర్టు

**హైదారబాద్, మే 21, ప్రభాతవార్త:** బండి భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహారణకు హైకోర్టు అనుమతించింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8న బాలిక తల్లి మైనర్ కూతురుపై పలుమార్లు మద్యం బలవంతంగా తాగించి అత్యాచారం చేశారని భగీరథ్‌పై చేసిన ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. భగీరథ్ మాత్రం ఆమె మేజర్ అని తనపై హనిట్రాప్ జరుగుతోందని కరీంనగర్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టడమే కాకుండా ఈ పోక్సో కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం మే 15న వాదనలు విన్న హైకోర్టు బాలికకు మైనార్టీ తీరలేదని నిర్ధారణ చేయడంతోపాటు ముందుస్తు బెయిల్ తీర్పు రిజర్వ్ చేసింది. శనివారంరాత్రి పోలీసులు బండి భగీరథ్‌ను తెలంగాణ పోలీసు అకాడమి సమీపంలో అరెస్ట్ చేశారు. అరెస్ట్‌తో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహారణకు భగీరథ్ తరఫు న్యాయవాది అనుమతి కోరగా, న్యాయవాది విజ్ఞప్తితో భగీరథ్ ముందస్తు బెయిల్ పిటిషన్ హైకోర్టు కొట్టివేసింది. రెగ్యులర్ బెయిల్ పిటిషన్ వేసుకోవడానికి అనుమతించింది.

## సరస్వతి పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### సంస్థ ఎండి వై.నాగిరెడ్డి

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ప్రారంభమైన సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1వ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పవిత్ర పుష్కర స్నానాలు ఆచరించేందుకు కాళేశ్వరానికి వెళ్లే భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా, వారి ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా సాగేలా అధునాతన బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద ఈ ప్రత్యేక రవాణా సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నట్లు ఎండీ తెలిపారు.భక్తుల రద్దీ, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల నుండి కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు నడపబడు తున్నాయని ఎండీ స్పష్టం చేశారు. అందులో భాగంగా హైదరాబాద్, నర్సంపేట, తొర్రురు, భూపాలపల్లి, మణుగూరు, కరీంనగర్, మంథని, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, పరకాల, నిజామాబాద్, గోదావరిఖని, మరియు మంచిర్యాల నుండి నేరుగా కాళేశ్వరానికి బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాలకు సంబంధించిన ప్రత్యేక సంప్రదింపు నంబర్లను కూడా సంస్థ విడుదల చేసిందన్నారు. హైదరాబాద్ భక్తులు సమాచారం కోసం 9959226245 నంబరులో, నర్సంపేట (9959226293), తొర్రూర్ (9959226053), భూపాలపల్లి (9959226707), మణుగూరు (9959225963), కరీంనగర్ (9959225920), మంథని (9959225923), హన్మకొండ (9959226049), మహబూబాబాద్ (9959226054), జనగాం (9959226050), పరకాల (9959226051), నిజామాబాద్ (9959226016), గోదావరిఖని (9959225922), మంచిర్యాల (9959226004) నంబర్లలో సంప్రదించి బస్సుల వేళలు, ఇతర వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ల కొరకు టీజీఎస్‌ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్.

# ఎన్పీడిసిఎల్‌లో సహకార విద్యుత్ సరఫరా సంఘం

### ఏప్రిల్ నుండి అమల్లో ఉండేలా ఇఆర్సీ ఉత్తర్వులు

**హైదరాబాద్, మే 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఏకైక సిరిసిల్లలోని సహకార విద్యుత్ పంపిణీ సంఘం ఇప్పుడు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోకి వచ్చింది. ఈ మేరకు, తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే దీనికి సంబంధించి లైసెన్సును సవరిస్తూ ఓపీ (ఆపరేషన్) నంబర్ 8 ఆఫ్ 2026ను జారీ చేసింది. ఈ సహకార విద్యుత్ పంపిణీ సంఘం నిర్వహణ మొత్తం ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధీనంలో గత నెల ఏప్రిల్ 1 వ తేదీ నుండి అమల్లోకి వచ్చేలా సవరించబడిందని ఈ ఉత్తర్వులలో పేర్కొంది. 1970లో జాతీయ గ్రామీణ విద్యుదీకరణ సంస్థ దేశవ్యాప్తంగా పైలట్ ప్రాతిపదికన ప్రారంభించిన కొన్ని విద్యుత్ సరఫరా సొసైటీలలో సిరిసిల్లా సహకార విద్యుత్ సరఫరా సంఘం ఒకటి. ఇది పూర్వపు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మొదటి సొసైటీ. సిరిసిల్ల పట్టణం నుండి పనిచేస్తూ దాని పరిధిలోని గృహాలు, పరిశ్రమలు, వ్యవసాయం మరియు ఇతర రంగాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. తొలుత 420 మంది వినియోగదారులతో ప్రారంభమైన ఇది ఇప్పుడు 3.46 లక్షల మంది సభ్యులను సంపాదించగలిగింది. ప్రస్తుతం ఈ సొసైటీలో 355 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కాగా అవినీతి, పెండింగ్ బిల్లులు, నాసిరకం నిర్వహణ, పాలకవర్గం ఎన్నికలలో అవకతవకల నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003లోని సెక్షన్ 86 (2) కింద సహకార విద్యుత్ సంఘాన్ని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో విలీనం చేయాలని నిర్ణయించింది.

# 2027 వార్షిక క్యాలెండర్‌ను ప్రకటించిన యుపిఎస్‌సి

### మే 23న సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష.. ఆగస్టు 20 నుంచి మెయిన్స్

**హైదారబాద్, మే 21, ప్రభాతవార్త:** యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) 2027 వార్షిక పరీక్షల క్యాలెండర్‌ను విడుదల చేసింది. అందులో భాగంగా 2027లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షల లేదితోపాటు మెయిన్స్ తేదీలను ప్రకటించింది. వాటితోపాటు ముఖ్యమైన పరీక్షల తేదీలను విడుదల చేసింది. జనవరి 10న కంబైన్డ్ జియో సైంటిస్ట్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్నారు. జనవరి 31న ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. సీబీఐ (డిఎస్‌పి)ఎల్‌డిసిఈ పరీక్షను ఫిబ్రవరి 27 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తా రు. సీఐఎస ఎస్ (ఈఎక్స్ ఈ) ఎల్‌డీసీఈ-2027 పరీ క్షను మార్చి 14న నిర్వహిస్తారు. ఎన్‌డిఏ, ఎన్ఏ పరీక్ష(1)ని సీడీఎస్ పరీక్ష(1)ని ఏప్రిల్ 11న నిర్వహించ నున్నట్లు యుపిఎస్‌సి ప్రకటించింది. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2027ను, ఇండియన్ పారెస్ట్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను మే 23న నిర్వహించనున్నారు.

ఇంజనీరింగ్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలను జూన్ 18న నిర్వహిసానతరు. ఐఈఎస్, ఐఎస్ఎస్ పరీక్షలను జూన్ 18 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. కంబైన్డ్ జీవో సైంటిస్టు మెయిన్ పరీక్షలను జూన్ 19 నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తారు. సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్సెస్(ఏసీఎస్) పరీక్షను జులై 4న నిర్వహిసానతరు. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షను జులై 18న నిర్వహిస్తారు. సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలను ఆగస్టు 20 నుంచి 5 రోజులపాటు నిర్వహించనున్నారు. ఎన్‌డిఏ అండ్ ఎన్ఏ పరీక్షలను, సీడీఎస్ పరీక్ష(2)ను సెప్టెంబర్ 19న నిర్వహించనున్నారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ మెయిన్ పరీక్షలను నవంబర్ 21 నుంచి 7 రోజులపాటు నిర్వహించనున్నారు. ఎస్‌వో, స్టెనో(జీడీ-బి, జీడీ-1) ఎల్‌డిసీఈ పరీక్షలను డిసెంబర్ 18 నుంచఇ రెండు రోజులపాటు నిర్వహించనున్నట్టు యుపిఎస్‌సి 2027 వార్షిక పరీక్షల క్యాలెండర్‌లో ప్రకటించింది.

22-5Pg5exH.qxd:22-5Pg5exH.qxd 1/1/02 6:00 AM Page 1



# 23 మందితో సీఎం విజయ్ కేబినెట్




## కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం

**చెన్నై,మే 21:** తమిళనాడులో సిఎం విజయ్ తన టివికె కూటమి ఆధ్వర్యంలో 23 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 21 మంది టివికె ఎమ్మెల్యేలు కాగా ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. చెన్నైలోని లోక్‌భవన్‌లో గురువారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథన్ ఆర్లేకర్ నూతన మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త మంత్రివర్గంలో కూటమిలోని కాంగ్రెస్‌కు మాత్రమే చోటు దక్కింది. కూటమిలో ఉన్న విసికె, ఐయుఎంఎల్ పార్టీలకు ఎలాంటి పదవులూ కేటాయించలేదు. కాంగ్రెస్ నుంచి రాజేష్ కుమార్, విశ్వనాథన్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. తమిళనాడులో 59 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో భాగస్వామ్యం కలిగి ఉంది. గతంలో అధికార డిఎంకెతో కూటమిలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు మంత్రి పదవులు మాత్రం దక్కలేదు. సిఎన్ అన్నాదురై 1967లో డిఎంకే పార్టీని స్థాపించి, అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీపై ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత నుంచి ఎప్పుడూ అక్కడ కాంగ్రెస్ గెలవలేదు. ఇతర పార్టీలతో కలిసి పోటీ చేసి, కొన్ని స్థానాలు సాధించినా మంత్రి పదవులు మాత్రం దక్కలేదు. తాజాగా ఎంపికైన 23 మంది మంత్రులకు శాఖలను కూడా కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

23 మంది మంత్రుల జాబితాలో ఎ. శ్రీనాథ్, కమాలి ఎం.సి విజయ లక్ష్మి, ఆర్‌వి. రంజిత్ కుమార్, ఆర్ వినోద్, రాజీవ్, బి.రాజ్ కుమార్, వి.గంధిరాజ్, మదన్ రాజా, జగదేశ్వరి, విజయ్ బాలాజీ, లోగేష్ తమిళ్ సెల్వన్, విజయ్ తమిళన్ పార్తీబన్, రమేష్, ఆర్ కుమార్, కే తెన్నారసు, వి సంపత్ కుమార్, మొహమ్మద్ ఫర్వాస్, డి శరత్ కుమార్, ఎన్ మారీ విల్సన్, కే విగ్నేష్ టీవీకే నుంచి మంత్రి పదవులు పొందగా, రాజేష్ కుమార్, విశ్వనాథన్ కాంగ్రెస్ నుంచి మంత్రులుగా ప్రమాణం చేశారు.

**సమయపాలన,క్రమశిక్షణకు కట్టుబడిన సిఎం**

తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సచివాలయంలో పని సంస్కృతి పూర్తిగా మారుతోంది. ఆయన సమయపాలనను కచ్చితంగా పాటించడం ప్రభుత్వ శాఖలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో పలు విభాగాల్లో ఉద్యోగుల హాజరుపై కఠిన నిబంధనలు అమల్లోకి వస్తున్నాయి. కార్యాలయాల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి విజయ్ పదవి చేపట్టినప్పటి నుంచి ప్రతిరోజూ ఉదయం 9:45 నుంచి 10 గంటలమధ్య సచివాలయానికి చేరుకుంటున్నారు. అధికారిక కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 4:30 లేదా 5గంటల వరకు కార్యాలయంలోనే ఉంటున్నారు. సిఎం అనుసరిస్తున్న ఈ విధానం ఇతర శాఖల అధికారులను, సిబ్బందిని సైతం అప్రమత్తం చేస్తోంది. పని వేళలు ప్రారంభం కాకముందే ఉద్యోగులందరూ విధుల్లో ఉండేలా పరిపాలన విభాగాలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ క్రమంలో ఆహార, పౌరసరఫరాల శాఖ మొట్టమొదటగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు ప్రధాన కార్యదర్శి పి.బి. శరవణకుమార్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఉద్యోగులందరూ ఉదయం 9:50 గంటల కల్లా విధులకు హాజరు కావాలి. ఆఫీస్ అసిస్టెంట్లు ఉదయం 9:30 గంటలకే రావాలని స్పష్టం చేశారు. అండర్ సెక్రటరీలు ఉదయం 10 గంటలలోపు హాజరు రిజిస్టర్లను మూసివేసి, నివేదికను అదనపు ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి పంపాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నిబంధనలు పాటించని వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదే తరహా ఆదేశాలు ఇతర శాఖల్లోనూ జారీ అవుతున్నాయని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. పాలనా సామర్థ్యాన్ని, క్రమశిక్షణను మెరుగుపరిచేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన ఈ కొత్త నిబంధనలపై కొంతమంది ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కామరాజర్ సాలై, మెరీనా రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. సిఎం కాన్వాయ్ వెళ్లే సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తుండటంతో కార్యాలయాలకు సమయానికి చేరుకోవడం కష్టంగా ఉందని వారు వాపోతున్నారు.

గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎం. కరుణానిధి, జె. జయలలిత, ఎం.కె. స్టాలిన్ వంటి వారు కాస్త ఆలస్యంగా కార్యాలయానికి వచ్చేవారని, అప్పుడు ప్రయాణం సులువుగా ఉండేదని గుర్తుచేస్తున్నారు. మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కొత్త క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్లు స్పష్టమవుతోంది.



## ఇటలీ ప్రధానికి మోడీ విలువైన కానుకలు

**రోమ్, మే 21:** ప్రధాని నరేంద్ర మోడీ తన ఇటలీ పర్యటనలో భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని, కళా నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాకు ఆయన అందించిన ప్రత్యేక కానుకలు ఇరు దేశాల మధ్య సాంస్కృతిక బంధాన్ని ప్రతిబింబించాయి. ఈ పర్యటనలో భాగంగా భారత్, ఇటలీ తమ ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచుకున్నాయి. ప్రధాని మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అస్సాంకు చెందిన ప్రఖ్యాత ముగా సిల్క్ శాలువా, మణిపూర్‌కు చెందిన శిరుయి లిల్లీ సిల్క్ శాలువాను బహుమతిగా అందించారు. అస్సాంలోని బ్రహ్మపుత్ర లోయలో మాత్రమే లభించే ముగా సిల్క్‌ను బంగారు పట్టుగా పిలుస్తారు. ఎలాంటి కృత్రిమ రంగులు లేకుండా సహజసిద్ధమైన బంగారు వర్ణంలో మెరిసిపోయే ఈ పట్టుకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. మణిపూర్‌లోని శిరుయి పర్వతాల్లో మాత్రమే పూసే అరుదైన శిరుయి లిల్లీ పువ్వు స్ఫూర్తితో రూపొందించిన శాలువాను కూడా మోడీ అందించారు. ఆసక్తికరంగా ఇటలీ సంస్కృతిలో కూడా లిల్లీ పువ్వుకు పవిత్రత, సౌందర్యానికి ప్రతీకగా ప్రత్యేక స్థానం ఉంది. అధ్యక్షుడికి కళా, సంగీత కానుకలు ఇటలీ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాకు ఆగ్రా కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టే మార్బుల్ ఇన్లే వర్క్ బాక్స్‌ను మోడీ బహూకరించారు. పియత్రా దురా లేదా పచ్చికారిగా పిలిచే ఈ అద్భుతమైన కళ వాస్తవానికి ఇటలీలోని ఫ్లోరెన్స్‌లో పుట్టి, మొఘలుల కాలంలో భారత్‌లో ప్రాచుర్యం పొందింది. ఈ కళాఖండం ఇరు దేశాల కళాత్మక బంధానికి నిదర్శనంగా నిలిచింది.

ఈ బాక్స్‌లో సంగీత ప్రపంచంలో శిఖర సమానులైన భారతరత్న పండిట్ భీమ్‌సేన్ జోషి, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి ఆలపించిన గీతాల సిడిలను ఉంచి అందించారు. బలపడిన ద్వైపాక్షిక సంబంధాలు ఈ పర్యటనలో ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. 2029 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ యూరోలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. వ్యవసాయం, ఆర్థిక నేరాల నివారణ, భారత ఆరోగ్య నిపుణుల ఇటలీ వలస వంటి అంశాలపై ఒప్పందాలు జరిగాయి. యుఎఇ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీలో ఐదు దేశాల పర్యటనను విజయవంతంగా ముగించుకుని ప్రధాని మోడీ తిరిగి స్వదేశానికి చేరుకున్నారు.




## పాకిస్థాన్ నరమేధ చర్యలను ఎండగట్టిన భారత్

**న్యూయార్క్, మే 21:** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌పై నిందలు మోపేందుకు పాక్ ప్రయత్నించింది. అయితే, భారత్ వీటిని గట్టిగా తిప్పికొట్టింది. అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సాయుధ ఘర్షణల్లో పౌరులకు రక్షణ కల్పించే అంశంపై ఐరాసలో బహిరంగ చర్చ జరిగింది. ఈ సందర్భంగా పాక్ ప్రతనిధి జమ్మూకాశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని ఐరాసలోని భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ గట్టిగా తిప్పికొట్టారు. నరమేధ చర్యలకు పాల్పడే దేశం.. భారత అంతర్గత విషయాల గురించి ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ యేడాది ఆరంభంలో అఫ్ఘానిస్థాన్‌పై పాక్ జరిపిన దాడుల గురించి హరీశ్ ప్రస్తావించారు. పవిత్ర రంజాన్ మాసంలో కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై జరిగిన దాడిని ప్రపంచం ఇంకా మరిచిపోలేదన్నారు. చీకట్లో అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుంటూ.. అంతర్జాతీయ చట్టాల గురించి మాట్లాడటం పాక్ కపటత్వానికి నిదర్శనం' అని విమర్శించారు.

## పెట్రో, డీజిల్ ధరల మరింత పెంపు తప్పదు

### ఐఎంఎఫ్ మాజీ డిప్యూటీ ఎండి గీతాగోపీనాథ్

**న్యూఢిల్లీ, మే 21:** ముడిచమురు, గ్యాస్ దిగుమతులపైనే ఆధారపడిన దేశాల్లో పెట్రోధరలు పెంపు మరింత ఉంటుందని ఐఎంఎఫ్ మాజీ డిప్యూటీ ఎండి గీతాగోపీనాథ్ హెచ్చరించారు. పశ్చిమాసియా యుద్ధం, ఇరాన్ అమెరికా ఇజ్రాయెల్ దాడులకారణంగా ముడిచమురు సరఫరాలో స్తంభన ఏర్పడిందని అన్నారు. రానున్న కాలంలో ముడిచమురు బ్యారెల్‌కు 140 డాలర్లకు పెరిగినా విస్తుపోవాల్సిన పనిలేదని ఆమె పేర్కొన్నారు. ఇందుకోసం ముందు నుంచే వినియోగంలో కుదింపులు అవసరం అవుతాయని, ఇటు కుటుంబీకులు, అటు ప్రభుత్వం రెండూ కూడా ఈ భారం మోయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## విజయ్ సర్కారును బర్తరఫ్‌చేసి రాష్ట్రపతి పాలన విధించాలని సుప్రీంకోర్టులో పిల్

**న్యూఢిల్లీ,మే 21:** తమిళనాడులో టివికె విజయ్ విశ్వాస పరీక్ష సందర్భంగా భారీ ఎత్తున ఎమ్మెల్యేల కొనుగోళ్లుజరిగాయని, వెంటనే వాటిపై దర్యాప్తుజరిపించి తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించేవిధంగా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలయింది. ఈనెల 13వ తేదీ విశ్వాస పరీక్ష సందర్భంగా టివికె జోసెఫ్ విజయ్‌పార్టీ భారీ ఎత్తున ఎమ్మెల్యేలను మభ్యపెట్టిందని పిటిషనర్ మదురై నివాసి కెకె రమేష్ ఆరోపించారు. అనైతిక విధానాల్లో విజయ్ ప్రభుత్వం విశ్వాసపరీక్షలో నెగ్గిందని, అప్రజాస్వామ్య సూత్రాలు అనుసరించిందని ఆరోపించారు. ఇతర పార్టీలనుంచి కొందరు ఎమ్మెల్యేలు అనైతికంగా ఈ విశ్వాసపరీక్షలో భాగం అయ్యారని, వారికి భారీ మొత్తంలో సొమ్ములు అందించినట్లు ఆరోపణలున్నాయన్నారు.

## దాడుల్లో పాల్గొన్న హమాస్ మిలిటెంట్ల ఏరివేత

### డిజిటల్ ఆధారాలతో మిలిటెంట్ల జాడపై ఇజ్రాయెల్ నిఘా



**జెరూసలెం, మే 21:** హమాస్ 2023 అక్టోబర్ 7న జరిపిన దాడుల తర్వాత, ఇజ్రాయెల్ తన చరిత్రలోనే అత్యంత భారీ, రహస్యమైన వేటను ప్రారంభించింది. ఈ దాడిలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి, ట్రాక్ చేసి, హతమార్చడం లేదా పట్టుకోవడమే లక్ష్యంగా ఈ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇజ్రాయెల్ నిఘా సంస్థలు ఇందుకోసం ఎఫ్ఎం అనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాయి. హీబ్రూలో ది ఎటర్నల్ వన్ ఆఫ్ ఇజ్రాయెల్ డజంట్ లై అనే అర్థం వచ్చేలా ఈ పేరు పెట్టారు. ఈ ఆపరేషన్ పూర్తిగా సర్వైలెన్స్ టెక్నాలజీ, నిఘా వర్గాల సమాచారం, మిలిటెంట్లు వదిలివెళ్లిన డిజిటల్ ఆధారాలపైనే నడుస్తోంది. దాడుల సమయంలో మిలిటెంట్లు తమ ఫోన్లు, గోప్రోలతో చిత్రీకరించిన వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు, ఇంటర్‌సెప్ట్ చేసిన ఫోన్ కాల్స్, సెల్ టవర్ డేటా, మరియు అదుపులోకి తీసుకున్న వారి నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తున్నారు.

దాడుల ఫుటేజ్‌లనుంచి అనుమానితులను గుర్తించడానికి ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌లను వాడుతున్నారు. ఎవరినైనా లక్ష్యంగా చేసుకోవడానికి ముందు కనీసం రెండు బలమైన ఆధారాలను నిర్ధారించుకుంటున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ పరిధి ఎంత విస్తృతంగా ఉందంటే, దాడి సమయంలో సరిహద్దు కంచెను ట్రాక్టర్‌తో కూల్చిన వ్యక్తిని కూడా వదలకుండా, సుదీర్ఘకాలం తర్వాత వైమానిక దాడిలో హతమార్చారు. ఈ రహస్య ఆపరేషన్లు కేవలం గాజాకే పరిమితం కాలేదు. లెబనాన్, ఇరాన్ వంటి దేశాల్లోని హమాస్ సీనియర్ నాయకులను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. 2024 జనవరిలో బీరూట్‌లో హమాస్ నేత సలేహ్ అల్‌అరౌరీ, ఆ తర్వాత కొద్ది నెలలకు టెహ్రాన్‌లో హమాస్ రాజకీయ అధినేత ఇస్మాయిల్ హనియే, అక్టోబర్ 7 దాడితో సంబంధం ఉన్న సీనియర్ కమాండర్ ఎజెద్దీన్ అల్‌హద్దాద్‌లను హతమార్చడం ఈ ఆపరేషన్‌లోని కీలక ఘట్టాలు. దాడికి బాధ్యులైన వారిని దాదాపుగా మట్టుబెట్టామని, గాజా మళ్లీ తమకు ముప్పుగా పరిణమించకుండా చూస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవల ప్రకటించినట్లు లే మాండే పత్రిక పేర్కొంది. ఈ ఆపరేషన్‌ను చాలా మంది 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో 11 మంది ఇజ్రాయెల్ అథ్లెట్లను చంపిన మిలిటెంట్లపై మొసాద్ జరిపిన దశాబ్దాల వేటతో పోలుస్తున్నారు. మొసాద్ చీఫ్ డేవిడ్ బర్నియా కూడా "మ్యూనిచ్ ఘటన అనంతర ఆపరేషన్ లాగే దీనికీ సమయం పడుతుంది. కానీ వారు ఎక్కడున్నా మా చేతులు వారిని చేరుకుంటాయని వ్యాఖ్యానించడం గమనార్హం.

మరోవైపు, ఈ లక్షిత హత్యలపై అంతర్జాతీయంగా చట్టపరమైన, నైతిక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇవి చట్టవిరుద్ధమైన హత్యలని, అమాయక పౌరుల మరణాలకు కారణమవుతున్నాయని విమర్శకులు ఆరోపిస్తున్నారు. యుద్ధ సమయంలో శత్రు పోరాటయోధులను లక్ష్యంగా చేసుకోవడం చట్టబద్ధమేనని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఇజ్రాయెల్ దృష్టిలో ఈ వేట కేవలం భద్రతకు సంబంధించింది మాత్రమే కాదు, మానసిక సాంత్వనకు కూడా సంబంధించినది. ఈ ప్రతీకార చర్యల వల్ల హమాస్‌లో చేరే వారి సంఖ్య పెరుగుతోందని, ఇది మరింత హింసకు దారితీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ తన వేటను ఆపేలా కనిపించడం లేదు.

## జిన్‌పింగ్ మధ్యవర్తిత్వంతో ట్రంప్-కిమ్ మధ్య మళ్లీ చర్చలు?

**ప్యాంగ్యాంగ్, మే 21:** అమెరికా-ఉత్తరకొరియా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. అగ్రరాజ్యంపై దాడికి వీలుగా కిమ్ ప్రభుత్వం క్షిపణి ఇంజిన్లు, అణు ఆయుధాలను పరీక్షించడంతో అవి మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య చైనా అధ్యక్షుడు షీజిన్‌పింగ్ మధ్యవర్తిత్వం వహించే అవకాశం ఉందని దక్షిణ కొరియా మీడియాలో వార్తలు వచ్చాయి. వచ్చే వారంలో జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటనకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అందుకోసం సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే చైనా సెక్యూరిటీ, ప్రొటోకాల్ బృందాలు ఆ దేశంలో పర్యటించాయి. ఇరు దేశాల సంబంధాలు బలోపేతం చేసుకునే దిశగా ఈ పర్యటన జరగనుందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరకొరియా ప్రస్తుతం అణునిరాయుధీకరణ చర్చలకు ఆసక్తి చూపడం లేదు. ఒకవేళ ఏదైనా దాడుల్లో కిమ్ మరణిస్తే.. తక్షణమే అణుదాడులు చేసేలా ఉత్తరకొరియా తన విధానాలను సవరించినట్లు తెలుస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ తొలిరోజు జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ సహా అనేకమంది సీనియర్ నాయకులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తరకొరియా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానాలపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలోనే జిన్‌పింగ్ పర్యటన జరుగుతోంది. ఆంక్షలతో సతమతమవుతోన్న కిమ్ రాజ్యానికి చైనా నుంచి ఆర్థిక సహాయం అందుతోంది. తమ మధ్య సంబంధాలు బలోపేతం చేసుకునేందుకు రెండూ చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రాంతీయ అస్థిరతలకు చెక్ పట్టే దిశగా.. ట్రంప్, కిమ్‌ల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు జిన్‌పింగ్ ప్రయత్నించవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. గతంలో ట్రంప్ అధికారంలో ఉన్న సమయంలో ఉత్తరకొరియా విషయంలో పట్టువిడుపులతో వ్యవహరించారు.

2019లో వియత్నాంలో ట్రంప్-కిమ్‌జోంగ్ ఉన్ భేటీ అయ్యారు. కానీ, అణ్వాయుధాలు వదిలేసే విషయంలో ఉత్తర కొరియా వెనక్కి తగ్గకపోవడంతో ఆ చర్చలు విఫలమైన సంగతి తెలిసిందే.

## మదర్సాల్లో వందేమాతరం తప్పనిసరి




**కోల్‌కత్తా, మే 21:** పశ్చిమ బెంగాల్ లోని బిజెపి ప్రభుత్వం అన్ని మదర్సాలలో వందేమాతరం తప్పనిసరిచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తూ రాష్ట్రంలోని అన్ని మదర్సాలలో వందేమాతరం గీతాన్ని ఆలపించాలని సువేందు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మదర్సా విద్యా డైరెక్టరేట్ విడుదల చేసిన ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందే, అలాగే గుర్తింపు పొందిన అన్ని రకాల మదర్సాలు, ఎంఎస్‌కే, ఎస్ఎస్‌కే సంస్థలలో రోజువారీ తరగతులు ప్రారంభమయ్యే ముందు నిర్వహించే ప్రార్థనా సమావేశాల్లో ఈ జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాల్సి ఉంటుంది. గతంలో అమలులో ఉన్న అన్ని పాత పద్ధతులను, ఉత్తర్వులను రద్దు చేస్తూ ఈ ఏకరీతి విధానాన్ని తక్షణమే అమలులోకి తీసుకువచ్చారు. రాష్ట్ర మైనారిటీ వ్యవహారాలు, మదర్సా విద్యాశాఖ మంత్రి ఖుదీరామ్ టుడు ఈ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించారు.

ఇప్పటికే రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో సంతాలి భాషలో బోధన జరుగుతోందని, అక్కడ కూడా వందేమాతరం గీతాన్ని విజయవంతంగా ఆలపిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. కాబట్టి మదర్సాలలో దీనిని అమలు చేయడం వల్ల ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదని, ఇది కేవలం జాతీయవాదం, విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు ఉద్దేశించిన అంశమని స్పష్టం చేశారు.

## ఇరాన్ యుద్ధంపై ట్రంప్ నెతన్యాహుల మధ్య వాగ్యుద్ధం

**వాషింగ్టన్, మే 21:** ఇరాన్ యుద్ధాన్ని ముగించే వ్యూహంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య విభేదాలు భగ్గుమన్నట్లు వైట్‌హౌస్ వర్గాల సమాచారం. ఇద్దరు నేతల మధ్య దాదాపు గంట పాటు ఫోన్లో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఇరాన్‌పై వెంటనే వైమానిక దాడులు ప్రారంభించాలని నెతన్యాహు ఒత్తిడి చేయగా, దౌత్య చర్చలకు మరో అవకాశం ఇవ్వాలని ట్రంప్ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ కాల్ తర్వాత నెతన్యాహు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలపై నెతన్యాహు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దాడులను ఆలస్యం చేయడం పెద్ద పొరపాటని, ఇరాన్ సైనిక సామర్థ్యాలను దెబ్బతీసేందుకు ప్లాన్ ప్రకారం యుద్ధాన్ని కొనసాగించాల్సిందేనని ఆయన ట్రంప్‌తో వాదించినట్లు తెలుస్తోంది. యుద్ధానికి స్వస్తి పలికేలా అమెరికా ఇరాన్ మధ్య సంతకాలకు ఖతార్, పాకిస్థాన్ దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు ట్రంప్ వివరించినట్లు తెలుస్తోంది. అణు కార్యక్రమం, హార్మూజ్ జలసంధి తెరిచే అంశాలపై 30 రోజులపాటు చర్చలుజరపాలని ట్రంప్ భావిస్తున్నారు. ఒకవేళ అవి విఫలమైతే మళ్లీ యుద్ధం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. నెతన్యాహుతో తీవ్రమైన విభేదాలు వచ్చినా ట్రంప్ మాత్రం బయటకు ఏమీ తెలియనట్లే వ్యవహరిస్తున్నారు. ఇరాన్ విషయంలో తాను ఏం చెబితే నెతన్యాహు అదే వింటారని ట్రంప్ మీడియాకు తెలిపారు. ఖతార్, సౌదీఅరేబియా, యుఎఇవంటి అరబ్‌దేశాల అభ్యర్థన మేరకే ఇరాన్‌పై దాడుల ప్రణాళికను తాత్కాలికంగా ఆపినట్లు ట్రంప్ గతంలోనే ప్రకటించారు.

## పుల్వామా ఉగ్రదాడి మాస్టర్‌మైండ్ హాతం

### పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో అదృశ్యశక్తుల హాత్య



**శ్రీనగర్, మే 21:** పుల్వామా ఉగ్రదాడి మాస్టర్ మైండ్స్‌లో ఒకడైన హంజా బుర్హాన్ అలియాస్ డాక్టర్ హతమయ్యాడు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ రాజధాని ముజఫరాబాద్‌లో గుర్తుతెలియని సాయుధులు జరిపిన కాల్పుల్లో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హంజా బుర్హాన్ అసలు పేరు అర్జుమంద్ గుల్జార్ దార్. పుల్వామా జిల్లా రత్నిపోరా ప్రాంతానికి చెందిన అతడు 2017లో ఉన్నత చదువుల కోసమంటూ పాకిస్థాన్ వెళ్లాడు. అక్కడ నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్ బదర్‌లోచేరి కమాండర్‌గాఎదిగాడు. తర్వాత కశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించ డానికి, వారిని తీవ్రవాదులుగా మార్చడానికి దక్షిణ కశ్మీర్‌లో పెద్ద నెట్‌వర్క్ నడిపినట్లు రికార్డులు చెబుతున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడిలో 40మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. ఈ దాడికి పాల్పడిన జైషే మహ్మద్ ఉగ్రవాదులకు హంజా బుర్హానే పేలుడు పదార్థాలు, గ్రెనేడ్లు సరఫరా చేసినట్లు భారత భద్రతా సంస్థలు గుర్తించాయి. దీనితో పాటు 2020లో జరిగిన మరో గ్రెనేడ్ దాడిలోనూ ఇతడి ప్రమేయంఉంది. దీనిపై భారత హోం మంత్రిత్వ శాఖ 2022లోనే ఇతడిని ఉగ్రవాదిగా ప్రకటించింది. గత రెండేళ్లుగా పాకిస్థాన్, పీఓకే పరిధిలో భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు వరుసగా హతమవుతున్నారు. లష్కరే తోయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల టాప్ కమాండర్లను అజ్ఞాత వ్యక్తులు టార్గెట్ చేస్తూ వస్తున్నారు.

## కర్ణాటకలో మరోసారి వేడెక్కిన కాంగ్రెస్ రాజకీయాలు



### కేరళ తరహాలోనే పరిష్కరించాలని డికెవర్గం మంకుపట్టు

### ఐదేళ్లు కొనసాగించాలంటున్న సిద్దూ వర్గం

**బెంగళూరు, మే 21:** కేరళం ఎన్నికల ఫలితాలు వెలువడిన 10 రోజుల తర్వాత ముఖ్యమంత్రి పంచాయితీని పరిష్కరించిన కాంగ్రెస్ హైకమాండ్ కర్ణాటకను మాత్రం సరిదిద్దలేకపోతోంది. ముఖ్యమంత్రి పీఠంపై డికె శివకుమార్ ఎప్పటి నుంచో ఆశలు పెట్టుకున్నారు. కానీ సిద్ధరామయ్య మాత్రం ఆ పీఠాన్ని వదులుకునేందుకు మాత్రం సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదు. దీంతో డికె.శివకుమార్ వర్గంలో నిరాశ వ్యక్తం అవుతోంది. ఈసారి తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లుఇద్దరి ధోరణులు చెపుతున్నాయి.

కర్ణాటకకు సంబంధించిన అన్ని విషయాలను పరిష్కరించడానికి కాంగ్రెస్ హైకమాండ్ మే నెలాఖరులోగా ఒక కీలక సమావేశం నిర్వహించే అవకాశం ఉందని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. భవిష్యత్ వ్యూహంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌లను ఢిల్లీకి పిలిపించవచ్చని సమాచారం. సిద్ధరామయ్య దాదాపు ఆరు నెలలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు పార్టీ నాయకత్వం అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. సిద్ధరామయ్య ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో మరోసారి సిఎం పంచాయితీ తెరపైకి వచ్చింది. ఇక ముఖ్యమంత్రి పదవిపై డికె శివకుమార్, కొత్తగా హోం మంత్రి జి. పరమేశ్వర ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య పోటీ నెలకొన్నట్లుగా తెలుస్తోంది. గత నవంబర్‌లో సిద్ధరామయ్య ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయినప్పుడు డికె శివకుమార్ 'రెండున్నర సంవత్సరాల ఫార్ములా ఆధారంగా ముఖ్యమంత్రి పదవి కోసం ఒత్తిడి చేయడం ప్రారంభించారు.

కాంగ్రెస్ నాయకత్వం జోక్యం చేసుకుని వర్గపోరాటాన్ని అణచివేసింది. ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడంతో డీకే శివకుమార్ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణను కూడా అడ్డుకున్నారు. కేరళం, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కర్ణాటక విషయంపై నిర్ణయం తీసుకుంటారని అప్పట్లో వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ఆ సమయం రానే వచ్చింది. ఒకవైపు ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తయింది. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానంతో సహా కర్ణాటక నుంచి మూడు రాజ్యసభ స్థానాలు జూన్‌లో ఖాళీ కానున్నాయి. రాబోయే రెండు నెలల్లో కర్ణాటక శాసన మండలిలోని సుమారు తొమ్మిది స్థానాలు కూడా కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లే అవకాశం ఉంది. అన్ని నిర్ణయాలు ఢిల్లీ నుంచే తీసుకోవాల్సిన అవసరం ఉంది. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కాంగ్రెస్ చర్చిస్తుందా లేదా అన్నదే అతిపెద్ద ప్రశ్న. ప్రస్తుతం 79 ఏళ్ల వయసులో ఉన్న సిద్ధరామయ్యకు వయసు పైబడుతుండటంతో ఆయన నాయకత్వంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ సుముఖంగా లేదని ఆ వర్గాలు అంటున్నాయి.

2023 మేలో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు రెండున్నరేళ్ల రొటేషన్ పద్ధతిలో అంటే సగం పదవీకాలానికి ముఖ్యమంత్రి పదవి ఇస్తామని తనకు హామీ ఇచ్చారని డీకే శివకుమార్ చెబుతున్నారు. మరోవైపు దళిత వర్గానికి చెందిన హోం మంత్రి పరమేశ్వరను ముఖ్యమంత్రిగా నియమించాలని ఆయన మద్దతుదారులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. కర్ణాటకకు ఇప్పటివరకు దళిత ముఖ్యమంత్రి ఎవరూ లేరు. ముఖ్యమంత్రి పదవి సమస్య కారణంగా ఆరు నెలలుగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నిలిచిపోయింది. సిద్ధరామయ్య ప్రభుత్వంలోని సగానికి పైగా మంత్రులను మార్చనున్నారని వర్గాలు చెబుతున్నాయి. కొన్ని వారాల క్రితం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ కోరుతూ కర్ణాటకకు చెందిన సుమారు డజను మంది ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాం వేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా మొదట సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో సమావేశమవుతారు. తుది నిర్ణయం రాహుల్ గాంధీ చేతిలోకి వెళ్లింది.

## ఎయిరిండియాకు తృటిలో తప్పిన ప్రమాదం

### లాండింగ్‌లో నేలను బలంగా తాకిన తోక

**న్యూఢిల్లీ, మే 21:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి బెంగళూరుకు వచ్చిన ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ సమయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై దిగుతున్న తరుణంలో దాని తోక భాగం భూమిని బలంగా తాకింది. అయితే పైలట్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ఢిల్లీ నుంచి బెంగళూరుకు 179 మంది ప్రయాణికులతో వచ్చిన ఎఐ 2651 ఎయిర్‌బస్ విమానం ల్యాండింగ్ కావడానికి సిద్ధమైంది. సరిగ్గా అదే సమయంలో రన్‌వేపై నుంచి మరో పెద్ద విమానం టేకాఫ్ కావడంతో గాల్లో తీవ్రమైన గాలిఉద్ధృతి ఏర్పడింది. దాంతో విమానం బ్యాలెన్స్ తప్పింది. పైలట్లు ల్యాండింగ్ నిర్ణయాన్ని మార్చుకుని మళ్లీ విమానాన్ని పైకి లేపేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే విమానం తోకభాగం రన్‌వేనుగీసుకుంటూ వెళ్లింది. ఎయిరిండియా సంస్థ ఈ ఎయిర్‌బస్ ఏ321 విమానాన్ని తదుపరి తనిఖీల కోసం ఎయిర్‌పోర్టులోనే నిలిపివేసింది. దీనివల్ల బెంగళూరు నుంచి తిరిగి ఢిల్లీ వెళ్లాల్సిన ఎఐ2652 ఫ్లైట్‌ను క్యాన్సిల్ చేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రమాదంపై విమానయాన నియంత్రణ సంస్థ డిజిసిఎ దర్యాప్తు ప్రారంభించింది.

# నీట్‌తో తిరుపతి ఐఐటి ఒప్పందం



**శ్రీకాళహస్తి,మే 21 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తిరుపతి ఐఐటి ధశల వారిగా ఒక్కొక్క ఒప్పందంతో ఒక్కక్క అడుగు ముందుకు వేస్తుంది.గురువారం తిరుపతి ఐఐటి నీట్‌తో ఒప్పందం చేసుకున్నారు.తిరుపతి ఐఐటి నేషనల్ ఇన్సి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆప్ ఆంధ్ర ప్రదేశ్‌తో ఓ ఒప్పందంపై సంతకాలు చేసారు.ఉన్నత విద్య మరియు పరిశోధన రంగాలలో విద్యా సహ కారాన్ని బలోపేతం చేయడానికి, ఉమ్మడి కార్యక్రమాలను ప్రోత్స హించడానికి, ఆంధ్రప్రదేశ్ జాతీయ సాంకేతిక సంస్థ మరియు తిరుపతి భారతీయ సాంకేతిక సంస్థ మధ్య ఐఐటి ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమానికి ఐఐటి తిరుపతి డైరెక్టర్, డీన్‌లు, సలహాదారులు, విభాగాధిపతులు, అలాగే ఐఐటి తిరుపతి అధ్యాపక సభ్యులు హాజరయ్యారు. ఎన్ఐటి ఆంధ్రప్రదేశ్ నుండి, డైరెక్టర్ మరియు అకడమిక్ వ్యవహారాల డీన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రెండు ప్రముఖ సంస్థల మధ్య విద్యాపరమైన పరస్పర సహకారం, ఉమ్మడి పరిశోధన కార్యకలాపాలు విద్యార్థుల రాకపోకలను పెంపొందించడమే ఈ అవగాహన ఒప్పందం యొక్క లక్ష్యమని డైరెక్టర్ డాక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ వివరించారు.. ఈ భాగస్వామ్యం ద్వారా రెండు సంస్థల విద్యార్థులు మరియు అధ్యాపక సభ్యులకు ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, నైపు ణ్యాల మార్పిడి మరియు మెరుగైన విద్యా పరమైన భాగస్వామ్యం కోసం అవకాశాలు లభిన్తాయని భావిస్తున్నారు. పీహెచ్‌డీ కార్యక్రమాల కోసం చిన్న వయసులోనే వారిని గుర్తించడం అనే దార్శనికతతో యువ పరిశోధనా ప్రతిభను ప్రోత్స హించడం ఈ సహకారంలోని ఒక ముఖ్యమైన అంశం అన్నారు. బీటెక్ మూడవ సంవత్స రం తర్వాత ఇంటర్న్‌షిప్ అవకాశాలతో పాటు, భవిష్యత్ శాస్త్రవేత్తలు, పరిశోధకులు కావాలని ఆకాంక్షించే విద్యార్థులకు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తిరుపతిలో తమ నాలుగవ సంవత్స రాన్ని కొనసాగించి, డైరెక్ట్ పీహెచ్‌డీ కార్యక్రమాన్ని చేపట్టే అవకాశం కూడా లభిస్తుంది. ఈ అవగాహన ఒప్పందంపై ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. ఎన్. సత్యనారాయణ, ఎన్ఐటీ ఏపీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. వి. రమణారావు లాంఛనంగా సంతకాలు చేశారు. ఇరు సంస్థల అకడమిక్ వ్యవహారాల డీన్‌లు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సహకారం ఇరు సంస్థల విద్యార్థులు అధ్యా పకులకు విద్యా నైపుణ్యం, అంతర్విభాగ పరిశ ోధన, ఆవిష్కరణ మరియు పరిశోధనఆధారిత అభ్యాస అవకాశాలను బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగులని డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు.

## డాక్టర్ సుధాకర్‌కు మంత్రి లోకేష్ నివాళి

**విజయవాడ,మే21, ప్రభాతవార్తప్రతినిధి:** దళిత డాక్టర్ సుధాకర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళిని ఆర్పిస్తూ మంత్రి నారా లోకేశ్ ఓ వీడియో విడుదల చేశారు. కష్టపడి చదువుకుని, దశాబ్దాల పాటు డాక్టర్ గా సుధాకర్ ప్రజలకు సేవలందించారని కొనియాడారు. చివరికి దయనీయ స్థితిలో గొడ్డలి పార్టీ చేతిలో పిచ్చివాడని ముద్ర వేయబడి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ సుధాకర్ గురించి వారి కుటుంబ సభ్యుల మాటల్లో అంటూ వీడియోను ఎక్స్ లో పోస్ట్ చేశారు.

## గుర్తు తెలియని మృతుని ఆచూకీ చెప్పండి

**తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో కళ్యాణ కట్ట వెనుక వైపు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఏమీ లేక పోవ డంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సుమారు (45). వయస్సు ఉంటుందని, గుండు చేయించుకుని ఉన్నాడు, కుడిచేతిపై సి ఎం, సి.మంజుల అని ఇంగ్లీష్‌లో పచ్చబొట్టు ఉంది. మృతుడిని ఎవరైనా గుర్తించినట్లయితే వెంటనే వారి సంబంధికులకు,తిరుమల వన్ టౌన్ పోలీసులకు 9440796771, 9440 796772 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

## దేవాదాయ శాఖ ఉద్యోగిని శాంతికి మధ్యంతర బెయిల్

**విజయవాడ మే 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీకి పట్టుబడి విజయవాడ జిల్లా జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న దేవాదాయ శాఖ సస్పెండెడ్ అసిస్టెంట్ కమిషనర్ శాంతికి న్యాయస్థానం నుంచి స్వల్ప ఊరట లభించింది. ఈ నెల 23వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ఆమెకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే గతంలో ఆమె దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం రెండుసార్లు తిరస్కరించినప్పటికీ, ఈసారి ప్రత్యేక కారణంతో బెయిల్ లభించింది. తన కుమార్తె స్కూల్ అడ్మిషన్ కోసం తమిళనాడులోని ఊటీకి వెళ్లాల్సి ఉందంటూ శాంతి తరపు న్యాయవాది కోర్టులో మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. తల్లిగా కూతురి విద్యా విషయాల కోసం వెళ్లాల్సిన అవసరాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, షరతులతో కూడిన ఐదు రోజుల బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ గడువు ముగిసిన వెంటనే శాంతి తిరిగి విజయవాడ జైలు అధికారుల ఎదుట హాజరుకావాలని కోర్టు తెలిపింది. కాగా తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేవలం కూతురి చదువు నిమిత్తం లభించిన 5 రోజుల విరామం ఆమెకు తాత్కాలిక ఉపశమనాన్ని కోర్టు కల్పించింది.

## యువతకు భారతరత్న రాజీవ్ గాంధీ స్ఫూర్తి ప్రదాత: గౌడపేరు చిట్టిబాబు



**తిరుపతి,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ప్రధానిగా అత్యుత్తమ సేవలందించి, ఐటీ రంగానికి పునాదులు వేసి, నూతన సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచిన వ్యక్తి దివంగత రాజీవ్ గాంధీ అని తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు పేర్కొన్నారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి పాత మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి రాజీవ్ గాంధీ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ప్రధానిగా దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని వివరించారు. నేటి యువతకు రాజీవ్ గాంధీ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఆధునిక భారతావని నిర్మాణానికి ఆయన కలలు కన్నారని వాటిని అమలు చేయడానికి పరితపించారని వివరించారు. రాజీవ్ గాంధీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా ఎదిగేదని తెలిపారు. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 రిజర్వేషన్లు , యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకువచ్చారని వివరించారు. పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిత్తూరు శివశంకర్ ,ఎన్ఎస్ యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయన నరేంద్రబాబు, జ్యోతీశ్వర్ నాయక్, ఆమూరి కృష్ణమూర్తి, గొడుగుచింత గోపి, పార్థసారధి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తీవ్రరూపంగా వర్షాభావ పరిస్థితులు

### - కొండపై జలాశయాల్లో 90రోజులకు సరిపడే తాగునీరు

**తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** ఓ వైపు మండుతున్న ఎండలు.. తీవ్రవర్షాభావ పరిస్థితు లతో తిరుమలలో జలాశయాల్లో నీరు తగ్గిపోతోంది. ఇప్పటికే ఐదు ప్రధాన జలాశ యాల్లో ఉన్న నీరు మరో 90రోజుల వరకు సరిపడుతుందని టిటిడి అధికారుల అంచనా. ఇప్పటికే కురవని వానలతో తిరుమలలో అధికారులు తాగునీటిపై సతమతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుణదేవుడు దయతో సకాలంలో ఏదో ఒకరూపంలో నైరుతి రుతుపవనాలు, అల్పపీడనాలతో రానున్న జూన్, జులై మాసాల్లో వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేయాల్సిన అవసరం వస్తోంది. వేసవిసెలవుల్లోగాక సాధారణరోజుల్లోనూ తిరు మలకు లక్షమందివరకు భక్తులు చేరు కుంటున్నారు. సహజంగా ప్రతి ఏటా వాతా వరణం అనుకూలించి, రుతుపవనాలు సకాలంలో వర్షిస్తే వరదలు సంభవించిన సమయాల్లో తిరుమలకొండల్లో ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్‌డ్యామ్, ఆకాశగంగ, పాపవినాశనం, కుమారధార, పసుపుధార తీర్థాలు నిండుకుంటాయి. ఐదు జలాశయాల్లో నీరు చేరితే ఏడాదివరకు తాగునీటికి ఇబ్బందులు తలెత్తవు. అలా లేకుంటే పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటాయి. తిరుమలలో మొత్తం 14, 304లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యంతో గోగర్భం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్ద జలాశయాలు కుమారధార, పసుపు ధార తీర్థాలు. ఈ రెండు జలాశ యాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం, కుమారధార తీర్థం 4,258లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం కలిగివున్నాయి. ఇవన్నీ పూర్తిస్థాయిలో నిండితే ఏడాదిన్నరపాటు నీటికొరత తలెత్తదు. అయితే గత రెండు నెల లుగా చిరుజల్లులతో వాన తప్ప జలాశయాలకు నీరుచేరే అవకాశం లేకపోయింది. వర్షాభావ పరిస్థితులు ఎదురైతే జలాశయాల్లో నీరు తగ్గిపోతే నీటికొరత తలెత్తే పరిస్థితి కనిపి స్తోంది. భక్తుల తాగునీటి అవసరాలకు వర్షా భావ పరిస్థితుల్లోనూ నీటిసమస్య తలెత్త కుండా శాశ్వత సమస్య పరిష్కారానికి బాలాజీ రిజర్వాయర్‌నుచేపట్టాలని గతంలోనే నిర్ణయిం చారు. అయితే ఆచరణలో మాత్రం విఫల మయ్యారు. తిరుపతి కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను3.082 టిఎంసిల నీటిసామర్థ్యం తో నిర్మిస్తే 1 టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే అవకాశం ఉంటుందని 2018లోనే భావించారు. తిరుమలకు వచ్చే భక్తులకు, స్థాని కులు నివాసముంటున్న బాలాజీనగర్ వాసులకు, హోటళ్ళకు, వ్యాపారకేంద్రాలకు నీటి ప్రాధాన్యత ఉంది. ఐదు ప్రధాన జలాశయాలతో బాటు కల్యాణిడ్యామ్.తెలుగుగంగ నీటిని తిరుమలకు సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం తిరుమలలో ప్రధాన రిజర్వాయర్లలోని నీరు 90రోజుల వరకు మాత్రమే సరిపోయినా జలాశయాల్లో క్రమేణా తగ్గిపోతోంది.



తిరుమలలోని గోగర్భమ్ డ్యామ్ తాజా పరిస్థితి

## పబ్లిక్‌హెల్త్‌శాఖ సిఇగా మోహన్



**తిరుపతి,మే 21ప్రభాత వార్తప్రతి నిధి:** ఇంజనీరింగ్ విభాగం లో పలు హోదాల్లో సమర్థవంతంగా బా ధ్యతలు నిర్వహించి నెల్లూరు జిల్లాలో పి హెచ్,ఎంఇ శాఖలో ఎస్ఇగా పనిచేస్తున్న టి.మోహన్ పబ్లిక్ హెల్త్‌శాఖ సిఇగా పదోన్నతిపొందారు. ఆయన 2024లోనే సిఇగా పదోన్నతిపొందినా తాజాగా ఆయనను గుంటూరు జిల్లా అమరావతిలోని పబ్లిక్‌హెల్త్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీరింగ్‌గా పోస్టింగ్ కల్పించింది. ఈయ మేరకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన తిరుపతి మున్సిపల్ కార్యాలయంలో ఎంఇగా, నగరపాలకసంస్థలో ఎస్ఇగా కూడా సమర్దవంతంగా అంకితభావ సేవలందించారు.

## తాకట్టులో 'వెంకన్న' కిరీటం

**విజయవాడ,మే 21,ప్రభాతవార్తప్రతినిధి:** గుడివాడ లోని ప్రసిద్ధ శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కోటి రూపాయల విలువైన బంగారు కిరీటం మాయంపై దేవాదాయ శాఖ విచారణ చేపట్టింది. ఈ కిరీటాన్ని ట్రస్టు సభ్యులే తాకట్టుపెట్టుకున్నట్లు ఆరోపణలు వెల్లువెతున్నాయి.ఈ క్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత హుటా హుటిన ఆలయానికి చేరుకుని అర్చకుల నుంచి వివరాలు సేకరించారు. దేవస్థానం నిర్వ హణ ట్రస్ట్ కార్యాలయానికి తాళాలు తెరిపించి రికార్డులు ఇవ్వాలని అడిగినట్లు సమాచారం. ట్రస్ట్ బోర్డులోని 31 మంది సభ్యులు ఎవరూ అందుబాటులో లేమంటూ ఫోన్లో సమాధానం చెప్పడంతో ఏసీ లలిత విస్మయం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చినా అందుబాటులో లేకపోవడం ఏంటని ట్రస్ట్ సభ్యులపై లలిత ఆగ్రహం వ్యక్తం చేశారు.దాత కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఏసీ లలిత.. పూర్తి వివరాలు సేకరించారు. దేవాదాయ శాఖ కమిటీ పరిధిలో ట్రస్ట్ లేకపోవడంతో చర్యలు తీసుకోలేక పోతున్నామని స్పష్టం చేశారు. రికార్డులు పరిశీలించిన తర్వాతే ఏ విషయమైనా చెప్పగలమని వెల్లడించారు. బంగారు కిరీటం తాకట్టు వ్యవహారంలో ట్రస్ట్ కమిటీ సభ్యుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విచారణ ముమ్మరం చేశారు. మధ్యా హ్నంలోపు విచారణ నివేదిక అందించాల్సి ఉండటంతో ఏసీ లలిత ఆలయంలోనే వేచి ఉన్నారు. ఈ వ్యవహారంలో తాకట్టు కొట్టు వ్యాపారి పరారీలో ఉన్నాడు. తన ఖాతాకు తాకట్టు డబ్బులు జమ చేస్తేనే ఊరికి వస్తానని ట్రస్ట్ బోర్డుకు తాకట్టు వ్యాపారి సమాచారం పంపినట్లు తెలుస్తోంది. విచారణ జరుగుతున్న సమయంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ఆలయానికి చేరుకున్నారు. దేవస్థాన ట్రస్ట్ బోర్డు చేసిన తప్పిదంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వల్ల గుడివాడకు చెడ్డపేరు వస్తోందని కమిటీ సభ్యులకు ఫోన్ చేసి చెప్పానని తెలిపారు. కిరీటాన్ని స్వామి వారికి అలంకరించాలని భక్తుల తరఫున డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు స్పందించక పోవడంతో కిరీటం అలంకరించే వరకు ఆలయంలోనే కూర్చుంటానని యలవర్తి స్పష్టం చేశారు. కిరీటం తాకట్టు పెట్టుకున్న బంగారు వ్యాపారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవుడి విషయంలో జరిగిన అపచారం భక్తులను కలచివేసిందని,

దీనిపై ఉన్నత స్థాయికి వెళ్తానని హెచ్చరించారు. సాయంత్రంలోపు కిరీటం అలంకరించకపోతే భక్తులతో కలిసి యాక్షన్ ప్లాన్‌లో దిగుతామని స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలతో చెలగాటమాడితే సహించేది లేదని యలవర్తి శ్రీనివాసరావు హెచ్చరిక జారీ చేశారు.

# భక్తుల బాధలు 'బోర్డు' పెద్దలకు పట్టవా?

### - కిలోమీటర్లు క్యూలు బారులుతీరినా సౌకర్యాలపై పలకరింపు కరువే!



క్యూలైన్లో నిరీక్షిస్తున్న భక్తులు

**తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** కిలోమీటర్ల దూరం వెలుపలకు విస్తరించిన భక్తుల క్యూలైన్లు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవ డానికి ఆరేడుగంటల సమయం నిలబడే నడుస్తూ వెళ్ళాల్సి వస్తుండటం, శ్రీవారి భక్తుల ఓపికను పరీక్షిస్తున్నారు. సామాన్యభక్తులకు క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తున్నాడు. వేసవి సెలవులు... ఆపై మరో పదిరోజుల్లో విద్యా సంస్థలు, కళాశాలలు తెరచుకోనుండటంతో మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు తరలివస్తు వన్నారు. నిండిన కొండతో బాటగంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు వ్యాపించాయి. ఓ వైపు భక్తులు తమకు దర్శనం చేయించండీ స్వామీ అంటూ వేడుకుంటుండగా మరోపక్క టిటిడి అధికారులు క్యూలైన్లలో ఓపికతో, సంయమనంతో వేచివుండటం తప్పదన్నట్లు ప్రకటన చేస్తున్నారు. ఏకంగా గురువారం ఉదయం నుండి నేటి (శుక్రవారం)ఉదయంవరకు భక్తులు క్యూలైన్ల వద్దకు కూడా చేరుకునే పరిస్థితి లేదు. దీంతో భక్తులు కొండపైనే ఉండాలని, వసతిసముదాయాల్లో నిరీక్షించాలని, తిరుపతికి దిగి వెళ్లాలని సూచనలిస్తున్నారు. భక్తులు తొందరపడవద్దని, వేసవిసెలవుల్లో పెరిగిన రద్దీతో క్యూలైన్లలో నిరీక్షించి శ్రీవారిని దర్శించుకోవడం తప్ప మరొకటి లేదని ప్రచారం చేస్తూ హోరెత్తిస్తున్నారు. గత ఇరవైరోజులుగా తిరుమలకొండపై చాంతాండంత దూరం క్యూలైన్లు బారులుతీరి సామాన్యభక్తుల పడిగాపులు పడుతున్నా కనీసం సౌకర్యాల కల్పన... అందుతున్న సహాయంపై పలకరించే టిటిడి బోర్డు సభ్యులు లేకపోవడం భక్తులపట్ల ఎంత అభిమానా లున్నా యో అర్థమ వుతుంది. సహజంగా తిరుమలలో వేసవి సెలవుల్లోనేగాక ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగితే భక్తులకు అందు తున్న సౌకర్యాలు, కల్పిస్తున్న సేవలపై ,సహకారంపై అడపాదడపా టిటిడి ఉన్నతాధి కారులు, గతంలో బోర్డు ఛైర్మన్,సభ్యులు ఒకరిద్దరు స్వయంగా వచ్చి ఆరాతీసి పర్యవేక్షించే వారు. అంతేగాక ఆలయం వెలుపలకు చేరిన కిలోమీటర్లు దూరం క్యూల వద్దకు వెళ్ళి భక్తులను పలకరించి, ఎక్కడ నుంచి వచ్చారు, ఏ సమయానికి క్యూలో ప్రవేశించారు... తాగునీరు, పాలు, మజ్జిగ, అన్నప్రసాదాలు అందే విషయంపై ఆరా తీసేవారు. దీనివల్ల అటు క్రిందిస్థాయి ఉద్యోగులు, శ్రీవారిసేవకుల్లో మరింత బాధ్యత పెరిగేది. ప్రస్తుతం విపరీతంగా రద్దీ పెరిగి కొండ కిటకిటలాడు తున్నా పర్యవేక్షణ ఏమీ లేకపోవడంతో టిటిడి బోర్డు ఉందా?అనే సందిగ్ధంలో ఇతరరాష్ట్రాల భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టిటిడిలో18మంది సభ్యులతో ప్రస్తుత బోర్డు కొనసాగుతోంది. అందులో ఇద్దరు సభ్యులు తిరుపతివాసులే ఉండటం విశేషం. అనూ హ్యంగా కలియుగ ప్రత్యక్షదైవమ్ తిరుమలేశుని దర్శనానికి భారీగా భక్తుల సంఖ్య పెరగడంతో వేసవిసెలవులు ముగింపుకు సమీపిస్తుండటంతో మరింతగా తిరుమలకిటకిటలాడుతోంది. గత నెలరోజుల నుంచి కొండపై భక్తులసంఖ్య విపరీతంగా పెరిగి భక్తుల క్యూలైన్లు కిలోమీటర్లు దూరం విస్తరించాయి. ఇప్పటికీ కొండపై పరిస్థితులు ఇలాగే ఉన్నాయి. బాటగంగమ్మ ఆలయం వద్ద నుండి అనుమతిస్తున్న సర్వ దర్శనం క్యూలైన్లు శిలాతోరణం, కృష్ణతేజ విశ్రాంతి భవనం, మేదరమిట్ట, నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు, క్యూలైన్లు.

## శ్రీసిటీని సందర్శించిన మహారాష్ట్ర విద్యార్థులు




**సత్యవేడు(తిరుపతి జిల్లా), మే 21 ప్రభాతవార్త:** కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ చొరవతో ఏక్‌భారత్ శ్రేష్ట్ భారత్‌యువ సంఘం కార్యక్రమంలో భాగంగా మహా రాష్ట్రంకు చెందిన వివిధ విద్యాసంస్థల నుంచి 50మంది విద్యార్థులు, అధ్యాపకులు గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష అవగాహన కల్పించడం లక్ష్యంగా మహారాష్ట్రంలోని 29 జిల్లాల నుంచి పర్యటనకు విచ్చేసిన విద్యార్థులకు శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టర్ రిలేషన్స్) రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి చర్చల్లో పాల్గొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్రసన్నారెడ్డి, దేశ సమైక్యతను చాటిచెబుతూ దేశంలోని విభిన్న ప్రాంతాలు, సంస్కృతులు, సాంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేసే ఈ మంచి కార్యక్రమానికి శ్రీసిటీని ఎంపిక చేయడం తాము గౌరవ ప్రదంగా భావిస్తున్నామన్నారు. వెనుకబడిన ప్రాంతం నుంచి అద్భుత ఆర్థిక కేంద్రంగా శ్రీసిటీ పరిణామం చెందిన తీరును వివరిస్తూ, ప్రస్తుతం 31 దేశాలకు చెందిన 250కిపైగా సంస్థలకు నిలయంగా ఆటో మొబైల్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ, ఇంజనీరింగ్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని తెలిపారు. పలు ఏసీ కంపెనీల ఏర్పాటుతో ఇండియా కూల్ క్యాపిటల్‌గా మారిందన్నారు. 80 వేల కోట్ల పెట్టుబడులు, 60 వేల కోట్లకు పైగా ఎగుమతుల సామర్థ్యంతో మేక్ఇన్ ఇండియా ఫర్ ది వరల్డ్ లక్ష్యానికి అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేస్తూ 85 వేల మందికిపైగా ఉపాధి కల్పిస్తున్నాయని, అందులో దాదాపు సగం మంది మహిళలేనని తెలిపారు. యువ సంఘం కార్యక్రమంపై స్పందిస్తూ యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనపై శ్రీసిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ముఖాముఖిలో ఎంతో ఆసక్తితో శ్రీసిటీ సామాజిక వసతులు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, సుస్థిరత, ఉపాధి అవకాశాలు తదితర పలు అంశాలను తెలుసుకున్న విద్యార్థులు, అనంతరం శ్రీసిటీ పరిసరాలను తిలకించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుపతి ఐఐటీని ఈ కార్యక్రమానికి నోడెల్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తించారు.

# నేడు గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

### - శిల్పకళ, భక్తి, సంప్రదాయాల సమ్మేళనం దివ్యక్షేత్రం



**తిరుమల,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** : టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో ఒకే ప్రాంగణంలో మూడు దివ్య రూపాల్లో శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చే గోవిందరాజస్వామి ఆలయం. ఆలయంలో రేపటి నుండి 31వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు నేటి సాయంత్రం 5.30 నుండి 8 గంటల మధ్య అంకురార్పణ ఈ కార్యక్రమం జరగనుంది. నేటి సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, గంగుండ్ర మండపంలో ఆస్థానం, యాగశాలలో శాస్త్రోక్త అంకురార్పణ కార్యక్రమాలు జరుగుతాయి. గోవిందరాజ స్వామి ఆలయం భక్తి, చరిత్ర, శిల్పకళ, ఆగమ సంప్రదాయాల సమ్మేళనంగా యుగయుగాలుగా భక్తులను ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తోంది. ఈ దివ్యక్షేత్రాన్ని దర్శించుకున్న భక్తులకు రుణ విమోచనం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక ఆనందం కలుగుతాయని స్థల పురాణం పేర్కొంటోంది. ధనాన్ని కొలుస్తూ అలసిన స్వామివారు ఆదిశేషునిపై శయ నించిన దివ్య రూపమే నేటి గోవిందరాజ స్వామి దర్శనమని భక్తుల విశ్వాసం. స్వామి నాభి నుండి బ్రహ్మదేవుడు ఉద్భవించినట్లు, పాదాల వద్ద శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, మోక్షం కోసం తపస్సు చేస్తున్న మధు–కైటభ రాక్షసులు కొలువై ఉన్న దృశ్యం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తుతోంది. ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో స్వామివారి సేవలు ప్రారంభమవుతాయి. ఉదయం 5.30 గంటలకు విశ్వరూప దర్శనం, 6.30 గంటలకు తోమాల సేవ, 7.30 గంటలకు అర్చన, 8 గంటలకు అర్చనానంతర దర్శనం నిర్వహిస్తారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవతో నిత్య కార్యక్రమాలు ముగుస్తాయి. గోవిందరాజ స్వామిని దర్శించుకునే భక్తులకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు చక్కెర పొంగలి, అన్నం, సాంబారు, రసం, కర్రీ, చట్నీ, మజ్జిగతో రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. ఆలయంలోకి ప్రవేశించగానే దర్శనమిచ్చే ఏడు అంతస్తుల మహారాజగోపురం విజయనగర శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. మూడు అంతస్తులతో నిర్మించిన పడి కావిలి గోపురం, మహాద్వార గోపురం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండగా, విమాన గోపురం బంగారు తాపడంతో దివ్య కాంతులను విరజిమ్ముతోంది. ఆలయంలో 70 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన పాత ధ్వజస్తంభం స్థానంలో 2018 ఏప్రిల్ 7న నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం 2018 ఏప్రిల్ 12న వైఖానస ఆగమోక్తంగా మహాసంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ విమాన గోపురానికి వంద కిలోల బంగారంతో తాపడం పనులను 2021 సెప్టెంబర్ 14న ప్రారంభించి, 2023 మే 25న బంగారు తాపడం విమాన గోపుర మహాసంప్రోక్షణను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన ఆండాళ్ అమ్మ, పుండరీకవల్లి అమ్మ, సుదర్శన చక్రత్తాళ్వార్ సన్నిధి, భగవద్రామాను జాచార్యులు, తిరుమలనంబి, అనంతాళ్వారుల సన్నిధులు భక్తులకు మరింత ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తున్నాయి. భగవద్రామాను జాచార్యుల ఆదేశాల మేరకు తిరుమల తరహాలో గోవిందరాజ స్వామికి నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాలను టిటిడి అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది. వైశాఖ మాసంలో బ్రహ్మోత్సవాలు, మాఘమాసంలో తెప్పోత్స వాలు, చైత్రమాసంలో వసంతోత్సవాలు, అశ్వయుజమాసంలో పవిత్రోత్సవాలు, జ్యేష్ఠా భిషేకం, పుష్పయాగం, పొన్నకాల్వ ఉత్సవం విశేషంగా జరుగుతాయి. ప్రతి పౌర్ణమికి గరుడసేవ, మూలమూర్తికి పూలంగి సేవ భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తు తున్నాయి. ప్రతిరోజూ భక్తులకు పొంగలి, పులిహోర, పెరుగన్నం, దోసెలను నైవేద్య ప్రసాదాలుగా అందిస్తున్నారు. ప్రత్యేక పర్వదినాల్లో చక్కెర పొంగలి, సీరా, క్షీ రాన్నం, బెల్లం దోశ, అప్పం, లడ్డూ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేస్తున్నారు.

వైష్ణవ సంప్రదాయ మహిమతో వెలసిన ఈ మహాక్షేత్రం తిరుపతి ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతోంది.

## టిటిడి పారిశుద్ధ్య విభాగంలో అవినీతి

### - వేతనదోపిడీతో లబ్ధిపొందుతున్నారు : మాజీ ఎంపి చింతామోహన్



**తిరుపతి,మే 21ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి శానిటేషన్ భాగంలో అవినీతి రాజ్యమేలు తోందని, కాంట్రాక్టర్లతో లాలూచి పొడి వారి నుంచి కొందరు ముందే డబ్బులు తీసు కుంటున్నారని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ సీనియర్‌నేత డాక్టర్ చింతామోహన్ సంచలన ఆరోపణలు చేశారు. పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి రెండు రోజుల్లో టెండర్లు ప్రక్రియ ముగించారని,. ఇందులో ప్రభుత్వ పెద్దల ప్రమేయం వుందన్నారు.ఎస్సీ, బీసీలకు కాంట్రాక్టు పనులు దక్కకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. తిరుపతిలో గురూవారం మీడియాతో మాట్లాడారు. టిటిడి ఆరోగ్య విభాగంలో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి పదివేల రూపాయలు వేతనం ఇస్తూ, 14 గంటలు కార్మికుల చేత పని చేయించుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి ఆధ్యాత్మిక కేంద్రం టిటిడి అని ముఖ్యమంత్రి అన్నారని,అయితే ఆధ్యాత్మిక కేంద్రం అవినీతి కేంద్రంగా తయారైందని ఘాటుగా విమర్శించారు. క్యాంప్ బెల్ అనేది అండమాన్ దగ్గర ఉన్న ఒక ప్రాంతమని,అక్కడ నాలుగువేల మంది ఆదివాసీలు ఉన్నారన్నారు. మోడీ మిత్రుడు అదానీ ఒక దేశాన్ని సృష్టించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని విమర్శించారు. దేశ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని అన్నారు. తిరుపతిలో ట్రైడెంట్, ఒబెరాయ్, దేవలోక్ అనే మూడు సంస్థలకు ఒకొక్క సంస్థకు 30 ఎకరాల చొప్పున, 90 ఎకరాలు టిటిడి భూములు ఇచ్చారన్నారు. వారి దగ్గర నుంచి వేల కోట్ల రూపాయలు ముడుపులు తీసుకున్నారు. 90 ఎకరాలు భూ కేటాయింపులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా నరేశ్‌కుమార్

విశాఖపట్నం, మే 21 ప్రభాతవార్త



హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సింబియోసిస్ టెక్నాలజీ సీఈఓ. ఓరుగంటి నరేష్ కుమార్‌ను నియమిస్తూ దేవదాయ శాఖ తరపున ట్రస్ట్ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో హిందూ ధర్మ వ్యాప్తికి నిర్వహించే ధార్మిక కార్యక్రమాలు, సమావేశాలను సమన్వయం చేయాలని ఈ సందర్భంగా సూచించారు.



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం ఉదయం నిర్వహించిన అష్టదళపద్మారాధనలో పాల్గొన్న ఉభయదాతలు, అర్చకులు, వేదపండితులు..

విశాఖపట్నం, ప్రభాతవార్త

## బీజేపీ ఆధ్వర్యంలో 'జనతా వారధి'

### 'మీ సమస్య.. మా బాధ్యత'కు విశేష స్పందన -ఏపి బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ వెల్లడి



విశాఖపట్నం, ప్రభాతవార్త

ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత చేరువగా ఉండే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "జనతా వారధి" కార్యక్రమాన్ని జనవరి 5,2026, సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీయన్ మాధవ్ తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల నుండి నేరుగా వినతులు, ఫిర్యాదులు, సమస్యలు, అర్జీలు స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం స్వీకరించిన సమస్యలను సోమవారం ఆయా జిల్లాలకు చెందిన అధికారులతో సమీక్షించి, వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం మరియు అధికార వ్యవస్థ మధ్య వారధిగా నిలవడమే "జనతా వారధి" కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. "జనతా వారధి" కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,248 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య సేవలు, విద్య, ఉపాధి, తాగునీటి సమస్యలు, రోడ్లు మరియు రెవెన్యూ సంబంధిత అంశాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అందిన అర్జీలలో సుమారు 2,180 సమస్యలు పరిష్కారమయ్యాయని, మరో 760 సమస్యలు సంబంధిత శాఖల పరిధిలో పరిష్కార దశలో ఉన్నాయని వెల్లడించారు. జనతా వారధి ద్వారా 486 పెన్షన్ సమస్యలు ,312 రేషన్ కార్డు సమస్యలు,228 భూ మరియు రెవెన్యూ సమస్యలు పరిష్కార దశకు చేరుకున్నాయన్నారు. 174 తాగునీరు మరియు మౌలిక వసతుల సమస్యలు, 142 విద్య మరియు ఉపాధి సంబంధిత సమస్యలు,96 ఆరోగ్య సేవలకు సంబంధించిన అర్జీలు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య సమన్వయ వారధిగా నిలవడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పీవీయన్ మాధవ్ పేర్కొన్నారు. 'జనతా వారధి' కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని, అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని ప్రతి వారం క్రమం తప్పకుండా కొనసాగించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని పీవీయన్ మాధవ్ కోరారు.

## ఎండల తీవ్రతపై అందరూ.. అప్రమత్తంగా ఉండాలి



### అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



విశాఖపట్నం, ప్రభాతవార్త

జిల్లాలో కొనసాగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలుపై గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్న వేళల్లో బయట తిరగవద్దని, ఈ మేరకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. చలివేంద్రాల్లో తగినంత తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్, ఎంపీడీవోలకు సూచించారు. ప్రైవేట్ సేవా సంస్థలు నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కేంద్రాల నిర్వహణలో సమన్వయం పాటించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ, భవన నిర్మాణం తదితర పనుల్లో పాల్గొనే కార్మికులకు తగిన రక్షణ చర్యలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల ప్రదేశాల్లో నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కార్మికులకు ఉపశమనం కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పని నిర్వహించాల్సి వస్తే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. యూపీహెచ్సీ, పీహెచ్సీల్లో వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక బెడ్లు సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్వోకు సూచించారు. గర్భిణీలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. వాహనదారుల కోసం ప్రధాన కూడళ్లలో షెడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, జాగ్రత్తలపై అవగాహన హోర్డింగులు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. భీమిలి మండలంలోని తాగునీటి సమస్య ఉన్న ఐదు గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సూచించారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ నగరంలోని 25 ప్రధాన కూడళ్లలో షెడ్లు ఏర్పాటు చేశామని, 25 వాటర్ ట్యాంకులను అందుబాటులో ఉంచామని తెలిపారు. 98 వార్డుల్లో ఏఈల పర్యవేక్షణలో చలివేంద్రాలు నిర్వహిస్తున్నామని, తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, 33 సన్‌స్ట్రోక్ కేసులు నమోదైనా పరిస్థితి నియంత్రణలోనే ఉందని డీపీఎం గోవింద్ తెలిపారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు శేషశైలజ, సంగీత్ మాధుర్, డీపీఎం గోవింద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## 'కూటమి' హయాంలో.. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు

### : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత
### ఘనంగా నక్కపల్లిలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం -తరలివచ్చిన విద్యార్థులు



నక్కపల్లి, మే 21, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోంమంత్రి వంగల పూడి అనిత ఆధ్వర్యంలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం గురువారం మంత్రి క్యాంప్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుద లైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమం లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధిం చిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 103 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. నగదు బహుమతితో పాటు సాలువా, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించి ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను ఈ సందర్భంగా రాష్ట్ర హోం 8వ పేజీలో

### ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఆధ్వర్యంలో

## ఖైదీలకు ఐటీ నైపుణ్య శిక్షణ

### విశాఖ సెంట్రల్ జైలులో "ఆఫీస్ అసిస్టెంట్" కోర్సును ప్రారంభించిన జిల్లా కలెక్టర్



విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

ఖైదీల పునరావాసం మరియు సమాజంలో తిరిగి కలిసిపోయే ప్రక్రియలో భాగంగా ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా "ఆఫీస్ అసిస్టెంట్" పేరుతో ఐటీ ఆధారిత నైపుణ్య శిక్షణా కోర్సును విశాఖపట్నం సెంట్రల్ జైలులో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ ఎం. అభిషిక్త్ కిషోర్ ప్రారంభించారు. ఖైదీలకు పరిశ్రమ ఆధారిత ఐటీ, కార్యాలయ నిర్వహణ నైపుణ్యాలను అందించాలనే లక్ష్యంతో, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఈ శిక్షణా కార్యక్రమం చేపట్టారు. మొదటి బ్యాచ్‌లో 30 మంది ఖైదీలకు శిక్షణ అందించనుండగా, ప్రధానంగా రిమాండ్ ఖైదీలు, ముఖ్యంగా ఎన్ డీ పిఎస్ కేసుల్లో ఉన్న యువ ఖైదీలపై దృష్టి సారించారు. రెండు నెలలపాటు కొనసాగే ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్‌డీఐ విశాఖపట్నం ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నారు. ఈ కోర్సులో కంప్యూటర్ అప్లికేషన్లు, కార్యాలయ పరిపాలన, డిజిటల్ కమ్యూనికేషన్, కార్యాలయ పరికరాల నిర్వహణ, ఉపాధి నైపుణ్యాలపై ఆచరణాత్మక శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే ఖైదీలలో డిజిటల్ అక్షరాస్యత, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, కార్యాలయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ 8వ పేజీలో

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత కార్యకర్తలదే..

### విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్



విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. విశాఖలోని లాసన్స్ బే కాలనీలో ఉన్న టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గానికి చెందిన వార్డు అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్లమెంటరీ కమిటీ సభ్యులతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యకర్తల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టి, వార్డుల వారీగా ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రత్యక్షంగా చూసిన కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ బాధ్యతను గుర్తించి మరింత చిత్తశుద్ధితో ప్రజాసేవలో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి ఆధారాలతో కూడిన సమస్యలను సేకరించి, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితిలో కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ కార్యకర్తలు ప్రభుత్వం మరియు ప్రజల మధ్య సంధానకర్తలుగా వ్యవహరిస్తూ ప్రజలకు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉత్తర నియోజకవర్గంలో 8వ పేజీలో

## పిలిస్తే పలికే ప్రభుత్వం.. మన ప్రభుత్వం

### దక్షిణం నియోజకవర్గంను మోడరన్‌గా తీర్చిదిద్దుతాం.. 37వ వార్డు జబ్బర్ తోటలో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, ప్రభాతవార్త



దక్షిణ నియోజకవర్గాన్ని మోడరన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. 37వ వార్డు జబ్బర్ తోటలో నీటి పైపులైన్‌ల ఏర్పాటు కోసం రూ. 20 లక్షల వ్యయంతో కూడిన పనులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కూటమి నేతలతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలు సమస్యలు అత్యధికంగా ఉన్న నియోజకవర్గం దక్షిణ నియోజకవర్గం అని, ఇటువంటి ప్రాంతాన్ని ఆధునికరణ చేయడమే కూటమి ప్రభుత్వ 8వ పేజీలో

## అమ్మవారి ఆలయంలో బోడపాటి ప్రత్యేక పూజలు

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



జనసేన పార్టీ రాష్ట్రఅధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు దేవుడు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించడం పట్ల జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్ గురువారం ఉదయం వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మా రాష్ట్ర అధినేత పట్ల దుష్ట శక్తుల మాట్లాడుతున్న వారికి తగిన బుద్ధి చెప్పాలని అటువంటి వారి నుంచి కాపాడాలని కోరుతూ వారాహి అమ్మవారిని పూజించడం జరిగిందని శివ దత్ ఈ సందర్భంగా తెలిపారు. అమ్మవారు పవన్ కళ్యాణ్ కు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించడం పట్ల పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని చెప్పారు.

## లక్ష్యాలను చేరుకోండి.. గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టండి: జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

నక్కపల్లి, ప్రభాతవార్త



జిల్లాలోని గ్రామాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని అందులో భాగంగా అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. గురువారం నక్కపల్లి వచ్చిన సందర్భంగా స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల నిర్వహణ మరుగుదొడ్ల నిర్మాణం తదితర కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏ ఒక్కరు నిర్లక్ష్యం ఉన్న క్షమించేది లేదని హెచ్చరించారు. గ్రామాలపై మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టే విధంగా జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షణ ఉండాలని అన్నారు .గ్రామాల వారిగా జరుగుతున్న కార్యక్రమాలపై జడ్పీ సీఈవో నారాయణమూర్తి, డిపిఓ సందీప్, హౌసింగ్ ,ఆర్డబ్ల్యూఎస్ తదితర అధికారులు, తాసిల్దార్ చిన్ని కృష్ణ, ఉప తాసిల్దార్ నారాయణరావు ఉన్నారు.

## ప్రశంసలు అందుకున్న గురుకుల పాఠశాల విద్యార్థినిలు

నక్కపల్లి, ప్రభాతవార్త



పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఊహించిన విధంగా ఈ ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రిన్సిపల్ ఉషారాణి ఆధ్వర్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌ల చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకోవడమే కాకుండా వారి నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు.

## పిలిస్తే పలికే ప్రభుత్వం.. మన ప్రభుత్వం

7వ పేజీ తరువాయి ..

లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలో పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. పిలిస్తే పలికే కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యమన్నారు. మౌలిక వసతుల కల్పన అనేది ఈ ప్రాంతంలో తరచూ జరిగే ప్రక్రియనని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, దక్షిణ నియోజకవర్గ కూటమి నాయకులు, జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శ్రీ శివ ప్రసాద్ రెడ్డి గారు, జోనల్ కమిషనర్ శ్రీ మల్లయ్య నాయుడు గారు, ఈ ఈ , డి ఈ ,ఏ.ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఖైదీలకు ఐటీ నైపుణ్య శిక్షణ

7వ పేజీ తరువాయి ..

ఖైదీల కోసం వినూత్న సంస్కరణ కార్యక్రమాలను అమలు చేస్తున్న జైళ్లశాఖ మరియు ఎస్‌డీఐ విశాఖపట్నం కృషిని అభినందించారు. జైళ్లలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఖైదీల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కోర్సు ప్రారంభానంతరం కలెక్టర్ ఖైదీలతో ముచ్చటించి, వారి ఆసక్తులు, భవిష్యత్తు లక్ష్యాలు, పునరావాసంపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని వారికి సూచించారు. తరువాత జైలు ప్రాంగణంలోని పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, ఖైదీల సంక్షేమం, వృత్తి విద్య, పునరావాస కార్యక్రమాల అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్య, వృత్తి శిక్షణ, సామర్థ్యాభివృద్ధి ద్వారా ఖైదీలను బాధ్యతాయుతమైన, నైపుణ్యం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని జైలు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. మహేష్ బాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ సి. హెచ్. సూర్యకుమార్, ఎస్‌డీఐ విశాఖపట్నం అధికారులు పాల్గొన్నారు.

## 'కూటమి' హయాంలో..

7వ పేజీ తరువాయి ..

మంత్రి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సత్కరించారు. గత సంవత్సరం కూడా పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించి సన్మానించినట్లు ఉపాధ్యాయులు గుర్తు చేశారు. సభలో విద్యార్థిని విద్యార్థులు మాట్లాడిన మాటలు చూసి హోం మంత్రి అనితతో పాటు జిల్లా కలెక్టర్ సంతోష్ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని చెప్పారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాసిరకం బ్యాగులు ఇచ్చారని విమర్శించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు. పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడా చూపకూడదని, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థికి ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని తెలిపారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని హోంమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు, ఆర్డీఓ వివి రమణ, డిప్యూటీ డీఈవో అప్పారావు ఎంఈఓ లు నరేష్, దొర, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, చించెలపు పద్దు ,అమలకంటి అబద్ధం, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవర సత్యనారాయణ, గుర్రం రామకృష్ణ, గోసల శ్రీకాంత్, మెరుగు నాగేశ్వరరావు, మునిషా బేగం, ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, వేమగిరి నూకరాజు, జయశ్రీ,శ్రీలక్ష్మి,వరలక్ష్మి ,సలీమా, ప్రిన్సిపల్ ఉషారాణి తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మర్రిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో మొరాయించిన రైలు ఇంజిన్..

### గంట పాటు నిలిచిపోయిన పలు రైళ్లు

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త:



నగరంలోని మర్రిపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రాత్రి పలాస- విశాఖ పాసింజర్ రైలు ఇంజిన్ సాంకేతిక సమస్యతో మొరాయించడంతో పలు రైళ్ల రాకపోకలు తీవ్రంగా అంతరాయం కలిగాయి. ఇంజన్‌కు మరమ్మతులు పూర్తయినప్పటికీ రైళ్ల కదలికలు సాధారణ స్థితికి చేరుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొరాయించిన రైలు వెనుక వరుసగా అనేక రైళ్లు నిలిచిపోయాయి. సింహాచలం రైల్వే స్టేషన్, పెందుర్తి రైల్వే స్టేషన్, కొత్తవలస రైల్వే స్టేషన్, కంటకాపల్లి రైల్వే స్టేషన్, విజయనగరం రైల్వే స్టేషన్ తదితర స్టేషన్లలో రైళ్లు నిలిచిపోయినట్లు సమాచారం. సుమారు రెండు గంటలుగా ప్రయాణికులు రైళ్లలోనే నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్ర ఉక్కపోత కారణంగా మహిళలు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తాగునీరు, గాలి సౌకర్యాలు సరిగా లేకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినప్పటికీ, రైళ్ల రాకపోకలు పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు మరికొంత సమయం పట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## సింహాచలం దేవస్థానం ధర్మకర్మల మండలి ప్రమాణస్వీకారం

సింహాచలం, 21 మే, ప్రభాతవార్త



శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డ్) ప్రమాణస్వీకార మహోత్సవం గురువారం కొండపైన అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) జల్లేపల్లి వెంకట్రావు నూతన సభ్యులచే శాస్త్రోక్తంగా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణ నరసాపురం జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆర్. కోటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు ఈ కార్యక్రమానికి వర్చువల్ (ఆన్‌లైన్) ద్వారా హాజరై, నూతన సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యార్థం బోర్డు సభ్యులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### ప్రమాణస్వీకారం చేసిన ధర్మకర్మల మండలి సభ్యులు

మాకేన సీతారాం పాత్రుడు (నవీన్), కసిరెడ్డి దామోదర్, చలమూరి భారతి, కరక దేవుడు, కనకాల మురళీమోహన్, వెంపడాపు అన్నపూర్ణ, బీతాల నీరజ లక్ష్మీ కుమారి, మధుపడ సన్యాసి రావు, డాక్టర్ ధరణి బండ్ల, నీతిపల్లి మహేష్, పెద్దిశెట్టి ఉషశ్రీ, లలిత జ్యోతి, గుత్తికొండ శ్రీలత, సుసరపు గణపతి రావు, చల్లాంగి జ్ఞానేశ్వరి, పావులూరి శ్రీనివాస రావు,

### ఎక్స్ అఫిషియో సభ్యులు

గూడవర్తి శ్రీనివాస ఆచార్యులు (ఆలయ ప్రధాన అర్చకులు)

### ప్రత్యేక ఆహ్వానితులు

బొక్కం స్వామి నాయుడు, వేదుల దక్షిణామూర్తి

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు అందించి స్వామివారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మధులత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షణ అధికారులు, ఇతర సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో అధికారులు, సభ్యుల కుటుంబ సభ్యులు , అభిమానులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత కార్యకర్తలదే..

7వ పేజీ తరువాయి ..

వార్డుల పునర్విభజనతో ఏర్పడిన మార్పులు, గత వైసీపీ ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చిన అర్బన్ ల్యాండ్ సీలింగ్ సమస్య, పోర్టు ప్రాంతం నుంచి వెలువడుతున్న ధూళి కాలుష్యం, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా నగర రహదారులపై భారీవాహనాల సంచారం వంటి అంశాలను పార్టీ శ్రేణులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చాయి. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ శ్రీభరత్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు చోడే పట్టాభిరామ్, ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధురవాడ పిఎసిఎస్ డిపాజిట్ సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన

### ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న పిఎసిఎస్ ప్రతినిధులు

పిఎం పాలెం, మే 21, ప్రభాతవార్త



మధురవాడ పిఎసిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన డిపాజిట్ సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు చైర్‌పర్సన్ పోతిన ప్రసాద్ తెలిపారు. గురువారం మధురవాడ నగరంపాలెం ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్ల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంటా శ్రీనివాసరావు, డీసీవో ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. నెల రోజులపాటు కొనసాగనున్న ఈ కార్యక్రమానికి ప్రజలు మంచి ఆదరణ చూపుతున్నారని, భవిష్యత్తులో కూడా దీన్ని విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు బైపిళ్ల పైడిరాజు, పోతిన వెంకట మీనాక్షి, సంఘం మానిటరింగ్ అధికారి మన్యాల రమేష్ బాబు, సీఈఓ ఎం. అప్పలరాజు, మాజీ ఉపాధ్యక్షుడు మరుపిళ్ల పైడిరాజు, మాజీ డైరెక్టర్ నాగోతి సూర్యప్రకాశ్, టీడీపీ నాయకులు పోతిన యల్లంనాయుడు, నాగోతి అనిత, నాగోతి శివాజీ, సంఘ సభ్యుడు శివరాజు రామాంజనేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పిఎం పాలెం , మే 21, ప్రభాతవార్త

మధురవాడ ప్రాంతంలో ఫుట్ బ్రిడ్జి పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. 33/11 కేవీ మధురవాడ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ మధురవాడ ఫీడర్‌పై నిర్వహించనున్న పనుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడనుందని ఆపరేషన్ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. సింహాచలంనాయుడు వెల్లడించారు. ఈ సందర్భంగా మధురవాడ, డి మార్ట్ పరిసర ప్రాంతాలు, ఎంఎస్‌ఆర్ లేఔట్, ఉజ్వల హాస్పిటల్ ఏరియా, సాయి ప్రియ లేఔట్, వల్లీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని అధికారులు కోరారు.

## ప్లాస్టిక్ రహిత మార్కెట్ల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

### జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.వి. రమణమూర్తి -కంచరపాలెం రైతు బజార్‌లో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై అవగాహన కార్యక్రమం

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త



ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించడం ద్వారా పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణానికి , స్వచ్ఛ సర్వేక్షన్ 2025 26లో విశాఖ నగరం దేశంలోనే పరిశుభ్ర నగరంగా ఉత్తమ స్థానం పొందేందుకు ప్రతి పౌరుడు సహకరించాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డి.వి. రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం ఆయన మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ఉత్తర జోన్ పరిధిలో ప్లాస్టిక్ రహిత మార్కెట్ల ఏర్పాటుకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా వార్డు నెం.54 పరిధిలోని కంచరపాలెం రైతు బజార్‌లో "ప్లాస్టిక్ ఫ్రీ మార్కెట్ క్యాంపెయిన్" జోనల్ కమిషనర్ బి.రాము తో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ కంచరపాలెం రైతు బజార్లో వ్యాపారులు, కొనుగోలుదారులు, స్థానిక ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ హానిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా గుడ్డ సంచులు, పేపర్ బ్యాగులు ఉపయోగించుకోవాలని, అలాగే చేపలు, మాంసం తదితర వాటికి స్టీల్ డబ్బాలను పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాలను పూర్తిగా ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, సుస్థిరమైన కొనుగోలు అలవాట్లను పెంపొందించుకోవాలని అడిషనల్ కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు జీవీఎంసీ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. జరుగుచున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2025 -26 కు సంబంధించి సర్వే బృందానికి విశాఖ నగర పరిశుభ్రస్థాయిని తెలిపేలా ప్రజలందరూ తమ అమూల్యమైన అభిప్రాయాలను తెలపాలని, పౌరుల అభిప్రాయాలను స్వచ్ఛత యాప్ లో గాని, ఎట.ంఎఎబతీ-ఝఅ.శీతీస్ర?? లింక్ ద్వారా గాని తెలిపి దేశంలోనే విశాఖ నగరం పరిశుభ్ర నగరంగా ప్రథమ స్థానం పొందేందుకు సహకరించాలని అదనపు కమిషనర్ విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ అప్పలనాయుడు,, శానిటరీ ఇన్‌స్పెక్టర్, స్థానిక ప్రజలు, వ్యాపారులు మరియు ఇతర జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్‌లో ఆర్ఐఎన్ఎల్ సీఎండీని కలిసిన జిల్లా కలెక్టర్

విశాఖపట్నం, మే 21 , ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ గురువారం విశాఖ ఉక్కు కర్మాగారంలో ఆర్ఐఎన్ఎల్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ఎన్.వి.ఎస్. ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆర్ఐఎన్ఎల్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌కు జిల్లా కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అభివృద్ధి, పారిశ్రామిక విస్తరణ, ఉపాధి అవకాశాలు, స్టీల్‌ప్లాంట్ పరిపాలనా, అభివృద్ధి అంశాలపై ఇరువురూ కాసేపు మాట్లాడుకున్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి.. క్రీడలను అలవాటు చేసుకోవాలి

### : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్..'డ్రగ్స్ వద్దు - ఆటలే ముద్దు' అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి



విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శంఖబ్రత సంకల్పం కార్యక్రమం కొనసాగింపుగా మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డ్రగ్స్ వద్దు - ఆటలే ముద్దు" అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హాజరై యువతకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్రీడల ద్వారా యువత శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, విద్యార్థులు, యువత సానుకూల దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా 450 మంది క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, 102 మంది వాలీబాల్ క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు, 30 మంది యువతులకు రింగులు, 250 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, క్రీడాకారులు, విద్యార్థులు, యువజన ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేజీహెచ్‌లో 5 శిశు ఆరోగ్య యాప్‌ల ఆవిష్కరణ

### యాప్‌ల రూపకర్త పిల్లల వైద్య విభాగం అధిపతి డాక్టర్ బి.యస్.చక్రవర్తి




విశాఖపట్నం, 21 మే ప్రభాతవార్త

ఆంధ్ర మెడికల్ కాలేజ్ పరిధిలోని కింగ్ జార్జ్ హాస్పిటల్,లోని శిశు వైద్య విభాగాధిపతిడాక్టర్ బి.యస్. చక్రవర్తి, తన పుట్టినరోజు సందర్భంగా ఐదు ఉచిత డిజిటల్ శిశు ఆరోగ్య యాప్ (సాధనాలు)లను గురువారం విడుదల చేశారు. స్వయంగా తాను తయారు చేసిన ఐదు పీ డియ్యా?ట్రిక్ డిజిటల్ యాప్ లను పిల్లలు వైద్య విభాగంలో గురువారం జరిగిన తన జన్మదిన వేడుకలు సందర్భంగా ఆసుపత్రి సూపరేంటెండెంట్ డాక్టర్ ఐ. వాణి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి ప్రారంభించారు. తల్లిదండ్రులు, ఆశా కార్యకర్తలు ఆరోగ్య సేవకులకు ఉపయోగపడే ఈ యాప్‌లు ఏ స్మార్ట్‌ఫోన్‌లోనైనా నేరుగాడౌన్ లోడ్ అవసరం లేకుండా తెరవొచ్చునని ఈ ఆరోగ్య సాధనాల రూపకర్త అయిన డాక్టర్ బీయస్. చక్రవర్తి మీడియాకు వెల్లడించారు ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.సంధ్యాదేవి కింగ్ జార్జ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ఐ.వాణి తో పాటు పిల్లలు వైద్య విభాగం కు చెందిన పలువురు వైద్య నిపుణులు పెడియాట్రిక్ సర్జరీ డాక్టర్‌లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. "ప్రతి తల్లికి, ప్రతి రాత్రి, పిల్లలకు జ్వరం వచ్చినపుడు- ఒక నిపుణుడైన వైద్యుడు పక్కన ఉన్నట్లు అనిపించాలి. అదే నా పుట్టినరోజు కోరిక."అని డాక్టర్ బి.యస్. చక్రవర్తి అభిప్రాయపడ్డారు. ఈ యాప్‌లు పూర్తిగా అవగాహన మరియు విద్యా ప్రయోజనం కోసం మాత్రమే రూపొందించబడ్డాయి. వృద్ధి, వికాసం, పోషకాహారం, టీకాలు మరియు అనారోగ్య సమయంలో తీసుకోవలసిన చర్యలపై సాధారణ మార్గదర్శకత్వం అందించడం వీటి లక్ష్యమన్నారు. ఈ యాప్‌లు వైద్య నిర్ణయాలకు ప్రత్యామ్నాయం కాదని ఏ ఫలితాన్నైనా అంధంగా నమ్మవద్దు. మీ పిల్లల ఆరోగ్య విషయంలో తుది నిర్ణయం ఎల్లప్పుడూ అర్హత కలిగిన శిశు వైద్యుడితో సంప్రదించి తీసుకోండని ఈసందర్భంగా డాక్టర్ చక్రవర్తి పిల్లల తల్లితండ్రులు కు తెలియజేసారు.

## సౌత్ వెస్టర్న్ రైల్వే భద్రతా పనుల కారణంగా పలు రైళ్ల రీషెడ్యూల్, మార్గమళ్లింపు

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త :

బెంగళూరు కంటోన్మెంట్--వైట్‌ఫీల్డ్ మధ్య జరుగుతున్న క్వాడ్రుప్లింగ్ పనుల్లో భాగంగా వైట్‌ఫీల్డ్ యార్డ్ ఫేజ్-1 రీమోడలింగ్‌కు సంబంధించిన ప్రీ-నాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్‌లాకింగ్ భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను రీషెడ్యూల్ చేయడంతో పాటు మార్గమళ్లింపు చేసినట్లు దక్షిణ పశ్చిమ రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఎస్ఎంవీటీ బెంగళూరు--న్యూ తిన్సుకియా ఎక్స్‌ప్రెస్, టాటానగర్--ఎస్ఎంవీటీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్, హతియా--ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్, మాల్డా టౌన్--ఎస్ఎంవీటీ బెంగళూరు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లను వివిధ తేదీల్లో 30 నిమిషాల నుంచి 180 నిమిషాల వరకు ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు. అలాగే మైసూరు--హౌరా ఎక్స్‌ప్రెస్, ఎస్ఎంవీటీ బెంగళూరు--గువాహటి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హౌరా--మైసూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, హతియా--ఎస్ఎంవీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్, బాలుర్‌ఘాట్--ఎస్ఎంవీటీ బెంగళూరు వీక్లీ ఎక్స్‌ప్రెస్ సహా పలు రైళ్లను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ మార్పుల కారణంగా కృష్ణరాజపురం, బంగారుపేట, జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, పెరంబూర్, ఆర్కోణం తదితర స్టేషన్లలో కొన్ని రైళ్ల నిలుపుదలలు రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు సంబంధిత రైల్వే విచారణ కేంద్రాలు లేదా అధికారిక రైల్వే వెబ్‌సైట్ ద్వారా తాజా వివరాలు తెలుసుకోవాలని అధికారులు సూచించారు.

## రాజీవ్ గాంధీ దేశానికి ఆధునికతను పరిచయం చేసిన దార్శనికుడు

### విశాఖలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా విశాఖలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు హాసిని వర్మ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం హాసిని వర్మ మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ దేశానికి ఆధునికతను పరిచయం చేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. 21వ శతాబ్దపు భారతదేశానికి పునాదులు వేసిన మహానేతగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు.

CLASSIFIEDS

VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, RAPARTHI RAMALAKSHMI W/O RAPARTHI ATCHUTA RAO, previously called RAPARTHI RAMALAXMI R/O 10-7-7/B RAM-NAGAR, VISAKHAPATNAM, now changed my name from RAPARTHI RAMALAXMI to RAPARTHI RAMALAKSHMI. Henceforth I will be called as RAPARTHI RAMALAKSHMI for all purposes. (Ro.No.7186)

★ I, TALARI BINDU W/O TALARI PRAVEEN previously called ELIPE BINDU R/O 55-1-509, DESAPATRUNI PALEM, PARAVADA, ANAKAPALLI, now changed my name from ELIPE BINDU to TALARI BINDU. Henceforth I will be called as TALARI BINDU for all purposes. (Ro.No.7192)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



## మట్టి ట్రాక్టర్ సీజ్

నక్కపల్లి, ప్రభాతవార్త

అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను నక్కపల్లి పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు స్వాధీనం పరుచుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు. మండలంలోని ఉద్దండపురం గ్రామ చెరువులో బుధవారం రాత్రి అక్రమంగా మట్టి తవ్వుతున్నారని వచ్చిన సమాచారం మేరకు నక్కపల్లి సీఐ జె.మురళి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి ట్రాక్టర్లను స్వాధీనపరుచుకున్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి ఏడి మైన్స్‌కు తదుపరి చర్యలు కోసం పంపించారు.

## మత్స్యకారుల సేవలో కూటమి ప్రభుత్వం: హోంమంత్రి వంగలపూడి అనిత

నక్కపల్లి, అడ్డు రోడ్డు/ప్రభాతవార్త



మత్స్యకారుల సేవలో కూటమి ప్రభుత్వం నిత్యం పనిచేస్తుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్ర హోంమంత్రి నివాసం వద్ద గురు వారం ఉదయం మత్స్యకారుల సేవలో కార్యక్రమం ఘనంగా పార్టీ శ్రేణులు నిర్వహించారు. పాయకరావు పేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన పెద్ద సంఖ్యలో మత్స్యకారులు నాయకులు పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ నాయకత్వంలో గోసల చిన్న తాతారావు శ్రీకాంత్ మెరుగు నాగేశ్వరరావు బొందు కాశీ విశ్వనాథ్ పిక్కి గంగరాజు కోదండరావ్ తోపాటు పలువురు



ముందుగా మంత్రి అనితను అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాల్గొన హోం మంత్రి అనిత చేతుల మీదుగా వేట నిషేధ భృతి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని మత్స్యకారులు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 18 మత్స్యకార గ్రామాలు ఉన్నాయని, మత్స్యకారుల అభివృద్ధికి ప్రభు త్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. వేట నిషేధ భృతి డబ్బులు బటన్ నొక్కిన గంటలోపే మత్స్యకారుల ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారులతో కలిసి భోజనం చేసి, వారి సమస్యలను తెలుసుకొని మమేకమయ్యారని చెప్పారు. మత్స్యకారుల జీవన విధానాన్ని మార్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. పాయక రావుపేట నియోజకవర్గానికి రెండు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు మంజూరు కావడం ఆనందంగా ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు మత్స్యకార గ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయని, ఇప్పుడు మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వంలో ఆ గ్రామాలు అభివృద్ధి దిశగా పయనిస్తున్నాయని పేర్కొన్నారు. త్వరలో పాయకరావుపేట నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలను బాగా చదివించా లని తల్లిదండ్రులకు సూచించారు. మత్స్యకారులకు సబ్సిడీపై ఇంజిన్లు, వలలు, జీపీఎస్ పరికరాలు అందిస్తు న్నామని, ఎండు చేపల ఎగుమతులపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని హోం మంత్రి అనిత వెల్లడించారు. మత్స శాఖ అధికారి విజయ్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసి నాయుడు, పార్టీ నాయకులు వినోద్ రాజు, వంకా రమణ, ఎరుపల్లి అప్పలరాజు, పేర్ల శ్రీను, కోడ ఆది రాజు, శివాజీ, బోయపాడు అప్పలరాజు, గరికిన సింహాద్రి, పలువురు మత్స్యకార నాయకులు ఉన్నారు.

## చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై ప్రశ్నించగా దాడి

### కొబ్బరి తోట ధ్వంసం చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు

బుచ్చయ్యపేట మే 21 ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం చిన్న భీమవరం గ్రామానికి చెందిన వెలంక్కాయల అప్పలనాయుడు తనపై దాడి చేసి, పొలంలో ఉన్న కొబ్బరి తోటను ధ్వంసం చేశారని బుధవారం బుచ్చయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్. భీమవరం సోమయాజులు చెరువులో గత రెండు రోజులుగా అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ అక్రమ తవ్వకాలపై ప్రశ్నించినందుకే కొందరు వ్యక్తులు తనపై దాడి చేసి, పొలంలోని కొబ్బరి చెట్లను ధ్వంసం చేశారని అప్పలనాయుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై బుచ్చయ్యపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై కూడా విచారణ కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## కొత్తమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



ఎస్ రాయవరం, మే 21, ప్రభాతవార్త

మండలంలో వెంకటాపురం గ్రామంలో వేంచేసి ఉన్న కొత్తమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా మాజీ శాసనసభ్యులు పాయకరావుపేట నియోజక వర్గం సమన్వయకర్త గ కంబాల జోగులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు ఎస్ ఏ ఎన్ మధువర్మ , గ్రామ మాజీ సర్పంచ్ కొప్పిశెట్టి సత్యం, నాయకులు పర్వతాలు,కర్రి శ్రీను,మరిసా శివ,చంద్ర,కొప్పిశెట్టి కాళీ ,కొప్పిశెట్టి వాసు, గారా కొండలరావు, గారా గాంధీ, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత రైతుల ఆగ్రహం.. తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

### భూ వివాదాలపై చర్యలు కోరుతూ నిరసన

బుచ్చయ్యపేట, మే 21, ప్రభాతవార్త



బుచ్చయ్యపేట మండలం చిన్న భీమ వరం గ్రామానికి చెందిన దళిత రైతులు గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. 1983లో ప్రభుత్వం ఇచ్చిన డి-పట్టా భూములను కొంతమంది ఆక్రమిం చుకున్నారని, పలుమార్లు ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల తరపున పోరాడుతున్న మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి అలియాస్ బుజ్జిపై అక్రమ కేసులు పెట్టడం తగదని మహిళా రైతులు తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలిపారు. ఆర్.భీమవరం పరిధిలోని డి-పట్టా భూములను జిరాయితీ భూములుగా ఎలా మార్చారని రైతులు ప్రశ్నించగా తహసీల్దార్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. భూములను రీ-సర్వే చేసి అసలు హక్కుదారులకు అప్పగించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

## జూన్ మొదటి వారంలో గాజువాక నూతన గ్రంథాలయ భవనం ప్రారంభం



గాజువాక,మే 21,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు గురువారం విశాఖపట్నంలో పర్యటించారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్‌తో కలిసి గాజువాక హైస్కూల్ పక్కన రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాన్ని, ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. చైర్మన్ మాట్లాడుతూ.. పెరుగుతున్న పాఠకుల సంఖ్యకు అనుగుణంగా నిర్మించిన ఈ నూతన భవనాన్ని జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. కోరమండల్ ఇంటర్నేషనల్ సంస్థ తమ సిఎస్ఆర్ నిధులు రూ. 15 లక్షలతో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫర్నిచర్, రీడింగ్ టేబుల్స్, ర్యాకులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు, వన్నెంరెడ్డి సతీష్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ఇక్కడ ఆర్వో ప్లాంట్, పోటీ పరీక్షల పుస్తకాలు సమకూరుస్తామని, యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా, గ్రంథపాలకులు బి.సూర్యకళ, పి.వి.ఎస్. రాజు, అజయ్‌కుమార్, ఎన్.వి.నరసింహం, కమిటీ సభ్యుడు తుమ్మపాల శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను గురించి ప్రజలకు తెలిసేలా ప్రతీ కార్యకర్త పనిచేయాలి ..ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలి, మే 21, ప్రభాతవార్త

పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్ వార్డు జనసేన కార్యకర్తలు నాయకులతో గురువారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే సుందర్పు విజయ కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, కూటమి నియమ నిబంధన లో ప్రకారం మిగతా రెండు పార్టీలతో కలిసి పని చేయాలని అన్నారు. ప్రతి వార్డులో ఈ రెండున్నర సంవత్సరాల వ్యవధిలో అనేక అభివృద్ధి పనులు చేశామని, వాటిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, జనసేన నాయకుడిపై ఉందని అన్నారు. వార్డుల్లో ఎటువంటి అభివృద్ధి పనులు డ్రైనేజీ నిర్మాణాలు, రోడ్డు నిర్మాణాలు ఉన్న ప్రతి నాయకుడు పెండింగ్ పనులను ఒక పేపర్‌పై రాసుకొని తనకు తెలియజేయాలని అన్నారు. వార్డుల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదని అన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి మంచినీటి కూరలు ఇస్తామని అన్నారు, త్వరలో అధికారులతో కలిసి ప్రతి వార్డులో కలిసిస్తానని ఎప్పటి వరకు చేసిన అభివృద్ధి పనులు ఎలా ఉన్నాయనేది పరిశీలించి ఇంకా పట్టణాభివృద్ధిలో పూట మీ ప్రభుత్వ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న నేపథ్యంలో వారిని ఆదర్శంగా తీసుకుని మన వార్డులను కూడా అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ గోపి,జనసేన నాయకులు కర్రీ ఝాన్సీ, ఊటకూటి రమేష్ నాయుడు, పిట్టా శ్రీనివాసరావు, కోటారు శ్రీనివాసరావు, గుర్రాల శేఖర్, కొటారు నరేష్,మున్సిపాలిటీకి చెందిన జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని వెదుళ్ళపాలెం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం గురువారం ఉదయం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ స్వామివారి దర్శనానికి వచ్చిన రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణను స్వామివారి చిత్రపటంతో ఘనంగా సత్కరించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో మాజీ సర్పంచ్ వెదుళ్ళ పాపారావు, వెంకటరమణతోపాటు పలువురున్నారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫోటో వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం



నక్కపల్లి రూరల్ , ప్రభాతవార్త

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు, కొత్తగా నియమితులైన గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యులకు ఫోటో అడ్రస్ వెరిఫికేషన్ కార్యక్రమం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు నిర్వహించారు. మండల లోని చందనాడ గ్రామంలో ఈ పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. గంట తిరుపతిరావు ఉన్నారు.

## అదుపుతకు కారు బోల్తా ఒకరు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు

ఎలమంచిలి, మే 21, ప్రభాతవార్త



జాతీయ రహదారి మర్రిబంద జంక్షన్ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు మరో వ్యక్తి తీవ్ర గాయాలు పాలైనట్లు ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం అనకాపల్లి వైపు నుండి వైపు వెళుతున్న కారు టైరు పంచర్ అవ్వడం వల్ల అదుపుతప్పి రోడ్డు పక్కకు పోర్లీలు కొట్టడం తో అందులో ఉన్న కారు డ్రైవర్ చనిపోగా మరో వ్యక్తి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కాకినాడ జిల్లా యు కొత్తపల్లి మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన పెనుముల్లు నాగ బుల్లి ప్రసాద్ రెడ్డి (30). ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మణికుమార్ రెడ్డిని ఎన్‌హెచ్ఐ అంబులెన్స్ లోని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రణతిని అభినందిస్తున్న మంత్రి వంగలపూడి అనిత



ఎలమంచిలి, మే 21, ప్రభాతవార్త

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన ప్రణతి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోనే మొదటి స్థానం నిలవడంతో గురువారం హోం మంత్రి వంగలపూడి అనిత విద్యార్థి ప్రణతిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన విద్యను అందిస్తున్న అనడానికి విద్యార్థి ప్రణతి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు అభినందనలు

నక్కపల్లి, ప్రభాతవార్త



ఆర్థిక ఇబ్బందులు ఉన్నత చదువులకు ఆటంకం కాకూడదని రాష్ట్ర హోం మంత్రి అనిత సూచించారు. మండలంలో ఈ సంవ త్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు "షైనింగ్ స్టార్స్"పేరిట విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ ఏర్పాటు చేసిన కార్యక్రమంలోజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద బోధిగలం గ్రామానికి చెందిన వేద విద్యార్థులు మొదటి, ద్వితీయ స్థానాలలో నిలిచిన ఎ.హాసిని, షేక్ నజియా పర్వీన్‌లను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జయశ్రీతో పాటు పాఠశాల ఉపాధ్యాయులను, గ్రామ మాజీ సర్పంచ్ ఫాతి మున్నీసా, మాజీ ఉపసర్పంచ్ ఖలీషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లోకేశ్ ప్రజాశక్తి ఫౌండేషన్ కార్యాలయానికి గ్రీన్ సిగ్నల్

### విశాఖపట్నం కేంద్రంగా మెయిన్ బ్రాంచ్ నిర్వహణ -మహానాడు అనంతరం ప్రారంభోత్సవ తేదీలు ఖరారు -చదరం తులసిరామ్



గాజువాక,మే 21,ప్రభాతవార్త

టీడీపీ యువనేత నారా లోకేష్ పాద యాత్ర స్ఫూర్తితో ఏర్పాటైన 'లోకేశ్ ప్రజాశక్తి ఫౌండేషన్' నూతన కార్యాలయాల ఏర్పాటుకు లోకేష్ పేషీ నుండి గ్రీన్ సిగ్నల్ లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఫౌండేషన్ నిర్వహిస్తోన్న సేవా కార్యక్రమాలకు ప్రజాదరణ లభిస్తుండటంపై టీడీపీ శ్రేణులు, నాయకులు అభినందనలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు చదరం తులసిరామ్ మాట్లాడుతూ, అనుమతులు లభించిన నేపథ్యంలో రాబోయే మహానాడు షెడ్యూల్ అనంతరం కార్యాలయాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. ముందుగా విశాఖపట్నం, విజయవాడ, అన్నవరం నగరాల్లో ప్రారంభోత్సవ తేదీలను ఖరారు చేస్తామన్నారు. ఇందులో విశాఖపట్నం నగరాన్ని మెయిన్ బ్రాంచ్‌గా చేసుకుని ప్రధాన కార్యకలాపాలు నడిపిస్తామని స్పష్టం చేశారు.గాజువాక శాసనసభ్యులు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆశీస్సులు, సూచనలతో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని చదరం తులసిరామ్ తెలిపారు.

## గాజువాక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం



గాజువాక, మే 21,ప్రభాతవార్త

స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, చెప్పడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం పిల్లలకు మానసిక ఉల్లాసం కోసం వినోదాత్మక 'బెలూన్ గేమ్' ఆడించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ, పాఠశాల ఉపాధ్యాయురాలు శ్యామల సంయుక్తంగా నిర్వహించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా తుంగ్లాం శ్రీ జై సంతోషి మాత ఆలయ గర్భగుడి భూమి పూజ

గాజువాక, మే 21,ప్రభాతవార్త



జీవీఎంసీ 69వ వార్డు పరిధిలోని తుంగ్లాం గ్రామంలో శ్రీ జై సంతోషి మాత ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గురువారం అమ్మవారి గర్భగుడి నందు మూల విరాట్ స్థానంలో భూమి పూజ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నెల్లిమర్ల శ్రీ సమతానంద దుర్గ మహాపీఠం ధర్మసంస్థానం అధిష్టాన పీఠాధిపతులు, హిందూ డీసీ ప్లీనరీ కమిటీ చైర్మన్ శ్రీ శ్రీ శ్రావణ చైతన్యానంద చిన్న స్వామి వారు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ.. సనాతన హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని, మానవ జీవితంలో దైవచింతన ప్రాధాన్యతను వివరించారు. ఈ పూజా కార్యక్రమంలో 69వ వార్డు మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు, తుంగ్లాం, కాపుతుంగ్లాం గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఉజ్బెకిస్థాన్‌లో ఉక్కు పంజా విసిరిన బాక్సర్ పోతిన రోహిత్

### ఆసియన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకం కైవసం -మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారుడి ఘనత.. దేశ కీర్తి ప్రతిష్టలు రెపరెపలు - గుల్లలపాలెం జీవీఎంసీ గ్రౌండ్‌లో విజేతకు ఘన సత్కారం



గాజువాక,మే 21,ప్రభాతవార్త

ఉజ్బెకిస్థాన్ వేదికగా ఈ నెల 1వ తేదీ నుండి 16వ తేదీ వరకు జరిగిన ఆసియన్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ అండర్-15 పోటీల్లో విశాఖపట్నం జిల్లాకు చెందిన బాక్సర్లు అంతర్జాతీయ వేదికపై ఉక్కు పంజా విసిరి పతకాల పంట పండించారు. ఈ ప్రతిష్టాత్మక ఛాంపియన్ షిప్‌లో శ్రీహరిపురంలోని 'మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్'లో శిక్షణ పొందిన పోతిన రోహిత్ అద్భుతమైన ప్రతిభను చాటాడు. అండర్-15 బాయ్స్ 33-35 కేజీల విభాగంలో రింగులో పంచ్‌ల వర్షం కురిపించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించి దేశ కీర్తిని చాటిన రోహిత్ ప్రదర్శనపై క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో రాణించి కాంస్య పతకంతో స్వగ్రామానికి విచ్చేసిన చిన్నారి పోతిన రోహిత్ విజయయాత్రను అభినందిస్తూ గుల్లలపాలెం జీవీఎంసీ గ్రౌండ్ నందు ఘన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు, కోచ్‌లు కలిసి రోహిత్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 61వ వార్డ్ టీడీపీ అధ్యక్షులు మజ్జి సోమేష్, దున్న ప్రతాప్, మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షులు మజ్జి రమేష్, బైబిల్ ప్రసాద్, కోచ్‌లు ప్రసాద్ పత్రుడు (ఇండియన్ ఆర్మీ), షేక్ అలీ (ఇండియన్ రైల్వే), అసిస్టెంట్ కోచ్‌లు కటారి సునీల్, హరి పత్రుడు, సాయి సూర్య, ప్రభు దత్త, గణేష్, బాక్సర్ సునంద, క్లబ్ క్రీడాకారులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ సుదర్శన హోమ సహిత కోటి విష్ణు సహస్రనామం

విశాఖపట్నం, మే 21,ప్రభాతవార్త



వన్ టౌన్ రాజప్ప నాయుడు వీధిలో గల శ్రీ గీతా ప్రచార సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ గీతా భవనంలో గల శ్రీ గీతా మందిరంలో సుదర్శన హోమ సహిత కోటి విష్ణు సహస్రనామ పారాయణం మంగళధ్వని వేదమంత్రములతో సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీకృష్ణార్జున సహిత విశ్వరూప భగవానునికి, లలితా దేవి అమ్మవారికి, షిరిడి సాయినాధునికి అర్చనలు, ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు హోమములు, పరమేశ్వరునికి అభిషేకములు సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు.ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్, శ్రీ గీతా ప్రచార సమితి అధ్యక్షులు సిహెచ్ విశ్వేశ్వరరావు, కార్యదర్శి ఎం వనజా దేవి, సంయుక్త కార్యదర్శి పి నూకరాజు, కోశాధికారి జీవిఆర్ ప్రసాద్, జి లక్ష్మీనరసింహ వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, సభ్యులు స్థానికులు పరిసర ప్రాంత వాసులు వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. విచ్చేసిన వారందరికీ తీర్థ ప్రసాదములు అన్న ప్రసాదము వితరణ చేయడమైనది.

## షిరిడి సాయిబాబా 31వ వార్షికోత్సవం



విశాఖపట్నం, మే 21,ప్రభాతవార్త

సూర్యబాగ్‌లో నిర్వహించిన శ్రీ షిరిడి సాయిబాబా వారి 31వ వార్షికోత్సవ మహోత్సవ వేడుకల్లో దక్షిణ నియోజక వర్గ శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కళ్యాణి ప్రెస్ ప్రొప్రైటరీ విరాట్ రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భక్తులతో కలిసి ప్రార్థనలు నిర్వహించి, అనంతరం అన్న ప్రసాదాన్ని భక్తులకు వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సాయిబాబా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, ఆలయ నిర్వాహకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీజగన్నాథ స్వామి ఆలయ ప్రతిష్టను మరింత పెంపొందించాలి :ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త



వన్ టౌన్ లో వున్న శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ సౌత్ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా సూరాడ రాజకుమార్ బాధ్యతలు స్వీకరించగా, ధర్మకర్త సభ్యులుగా బుదిరెడ్ల సత్యనారాయణ, రాయరాం, ఉప్పలపు ఆదిలక్ష్మి, సారిపల్లి జ్యోతి, పుక్కల కళ్యాణి, మానేపల్లి రమణి, నాగమల్లి భాస్కరరావు, బోనగిరి విజయదుర్గ, మంత రాజశేఖర్ వర్మ, మంత్రి శాలివాహన నియమితులయ్యారు. ప్రధాన అర్చకులు జగన్నాథ ఆచార్యులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయ అభివృద్ధికి నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. చైర్మన్ సూరాడ రాజకుమార్ మాట్లాడుతూ, దక్షిణ నియోజకవర్గంలో ఉన్న ఈ పురాతన జగన్నాథ స్వామి ఆలయానికి ప్రత్యేకమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ సహకారంతో ఆలయ ప్రతిష్టను మరింత పెంపొందించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్మన్, పాలకవర్గ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

## నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్లో గౌతమ బుద్ధుని విగ్రహావిష్కరణ



నర్సీపట్నం,మే 21,ప్రభాతవార్త

నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పంచాయతీ మాజీ వార్డు మెంబర్ కీర్తిశేషులు లాలం సూరిబాబు (జైల్ సింగ్) జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఒకటి, రెండు వార్డుల ఇన్చార్జి, పట్టణ టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ తన కుటుంబ సభ్యుల సహకారంతో ఈ విగ్రహాన్ని దాతగా వ్యవహరించి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పట్టణ టీడీపీ అధ్యక్షుడు చింతకాయల రాజేష్, డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ విగ్రహావిష్కరణ. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్కు వివిధ రకాల సమస్యలతో వచ్చే ప్రజలకు మానసిక ప్రశాంతతను చేకూర్చాలనే సదుద్దేశంతోనే ఈ గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు లాలం మురళీకృష్ణ తెలిపారు. స్టేషన్ ఆవరణలో విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన డీఎస్పీ, సీఐలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే 2013లో చింతకాయల రాజేష్ ప్రోత్సాహంతో, అయ్యన్నపాత్రుడి కుటుంబం వెంట నడుస్తూ తాను రాజకీయ ప్రవేశం చేశానని ఆయన గతాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం చింతకాయల రాజేష్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ ఆవరణను ఒక అందమైన పార్కులా తీర్చిదిద్దిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐకు ధన్యవాదాలు తెలిపారు.లాలం మురళీకృష్ణను ఆదర్శంగా తీసుకొని మరింత మంది దాతలు ముందుకు వచ్చి స్టేషన్ గ్రౌండ్స్ అభివృద్ధికి సహకరించాలని రాజేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ గఫూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, రావణ పల్లి నీటి సంఘం ప్రెసిడెంట్ రాజేశ్వరరావు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఉత్తల కృష్ణ, డబ్బిరు శ్రీకాంత్, ఒకటి రెండు వార్డుల కార్యకర్తలు, యూత్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద బొడ్డేపల్లి చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం: పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

నర్సీపట్నం,మే 21,ప్రభాతవార్త



పెద్ద బొడ్డేపల్లి చెరువు సమగ్ర అభివృద్ధిలో భాగంగా పంట కాలువ పూడికతీత, చెరువు గట్టుపై జంగిల్ క్లియరెన్స్, రెండు గేట్ల ఏర్పాటు పనులను రూ.6.5 లక్షల గ్రాంట్ నిధులతో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలోని జలవనరుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఆర్డీఓ బంగ్లా ముందు కల్వర్టు పనులు అవుతున్నాయని అదేవిధంగా జోగినాథపాలెంలో కల్వర్ట్ 10 పనులను విజయవంతంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. రూ.1 కోటి 40 లక్షల వ్యయంతో ఇక్కడ అధునాతన వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. గౌరవ స్పీకర్ ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని ఒక సుందరమైన పర్యాటక కేంద్రంగా మార్చడమే తమ ముఖ్య ఉద్దేశమని, అందరి సహకారంతో ఈ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద బొడ్డేపల్లి చెరువు నీటి సంఘం చైర్మన్ రుత్తల రామసత్యం, వైస్ చైర్మన్ గుడివాడ అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, వార్డు కౌన్సిలర్ గుడివాడ రాజానాయుడు, సత్తిబాబు, అప్పలనాయుడు, రావణపల్లి రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కృష్ణ మరియు స్థానిక రైతులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



నర్సీపట్నం,మే 21,ప్రభాతవార్త

నర్సీపట్నం పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అబీద్ సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ డీసీసీ అధ్యక్షులు మీసాల సుబ్బన్న రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. దేశ ఆధునికీకరణకు, యువత అభివఅద్ధికి, సమాచార సాంకేతిక రంగానికి పునాది వేసిన మహనేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, విద్యా రంగ ప్రగతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ సిద్ధ, నంగిన వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు చింతల సన్యాసిరావు, జిల్లా కార్యదర్శి సభ్యులు శేష, జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాల శివ, రాజన్న రాజా, అధికారి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం పోలీసులకు యోగా, మెడిటేషన్ శిక్షణ

నర్సీపట్నం,మే 21,ప్రభాతవార్త



నర్సీపట్నంలో పోలీసు సిబ్బందికి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో యోగా, మెడిటేషన్ శిక్షణా తరగతులు గురువారం ఉదయం నిర్వహించారు. మెడిటేషన్ గురువు లక్ష్మయ్య మాట్లాడుతూ ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం ధ్యానం, యోగాకు కేటాయిస్తే ఒత్తిడి తగ్గి పనితీరు మెరుగుపడుతుందని సూచించారు. అనంతరం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది విధుల్లో ఎదుర్కొనే ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ధ్యానం ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ షేక్ గఫూర్, రూరల్ సీఐ రేవతమ్మతో పాటు గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం, కృష్ణదేవిపేట ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ శిక్షణ తరగతులు



అనకాపల్లి , మే 21,ప్రభాతవార్త

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ పోలీస్ ట్రైనింగ్ వింగ్ సౌజన్యంతో అనకాపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బందికి మూడు రోజుల పాటు నిర్వహించే ఉచిత హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ (ధ్యానం) యోగా శిక్షణా తరగతులు గురువారం ఉదయం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. అనకాపల్లి పార్క్ సెంటర్ సమీపంలోని శ్రీ గౌరీ సేవా సంఘం కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కళ్యాణం వేదిక నందు ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థకు చెందిన ప్రముఖ శిక్షకులు (ట్రైనర్స్) ఐ.సంజీవ రాజు, డాక్టర్ కె.ఎమ్.కె.రావు ఆధ్వర్యంలో సిబ్బందికి ధ్యానం, శ్వాసక్రియలపై తొలి రోజు సాధన చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రావణి పోలీస్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ రాత్రింబవళ్లు ప్రజల రక్షణ కోసం నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ అధికారులు, సిబ్బంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. ఈ ఒత్తిడి వారి వ్యక్తిగత జీవితాలపై, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ప్రశాంతతను పొందేలా చేయడానికే జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో ఈ సంక్షేమ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రశాంతమైన మనస్సుతో విధులు నిర్వహిస్తే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చు అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సువర్ణ అవకాశాన్ని సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉపయోగించుకోవాలి. తొలిరోజు శిక్షణలో భాగంగా పోలీస్ సిబ్బంది అంతా ఒకేచోట చేరి ఏకాగ్రతతో యోగా, ధ్యాన ముద్రల్లో ఉన్న దృశ్యాలను డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించారు. క్రమశిక్షణతో కూడిన సిబ్బంది యోగా సాధన డ్రోన్ విజువల్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ప్రేమ కుమార్, అశోక్ కుమార్, స్వామి నాయుడు, అప్పలరాజు, కోటేశ్వరరావు, వివిధ పోలీస్ స్టేషన్ల సబ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొని ధ్యాన సాధన చేశారు. ఈ శిక్షణా తరగతులు మే 23వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు కొనసాగుతాయి.

## కసింకోటలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



కసింకోట, మే 21, ప్రభాతవార్త;

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కసింకోట మెయిన్ రోడ్ లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కత్తెర శ్రీధర్, సురా శ్రీనివాసు, తుట్టా రమణ , కొల్లి నూక అప్పారావు తదితరులు పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు.

### ప్రజ పాలనకు సౌలాభ్యంగా వార్డులు విభజన చేయాలని

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గేకి వినతి పత్రం అందజేసిన టిడిపి నాయకులు



అగనంపూడి, ప్రభాతవార్త

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గేని జీవీఎంసీ 85 వార్డ్ మాజీ కార్పొరేట్ ఇంచార్జ్ ఇల్లపు ప్రసాద్, విశాఖ పార్లమెంటరీ టిఎన్టియుసి అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, 85 వ వార్డు తెలుగు అధ్యక్షులు బందారు చందు రమేష్ కలిసి జీవీఎంసీ మున్సిపల్ కార్పొరేషన్‌ను వార్డులుగా విభజించుటకు సంబంధించిన తేదీ 17న మున్సిపల్ కార్పొరేషన్ నోటీసు బోర్డులో ప్రచురించిన ప్రాథమిక నోటిఫికేషన్ ని అభ్యంతరాలు తెలియజేస్తున్నామని. 2011 సంవత్సరంలో సుమారు 15 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న కార్పొరేషన్‌కు గరిష్టంగా 120 మంది సభ్యులు మాత్రమే అనుమతించబడతారు 2026 సంవత్సరం నడుస్తున్నందున 15 సంవత్సరాలు వ్యత్యాసంలో ఇప్పుడు నగర జనాభా సుమారు 26 లక్షలు ఉంటుంది. సౌలభ్యం కొరకు జీవీఎంసీ 150 వరకు పెంచుటకు తగిన ఉత్తరోలు జారీ చేయవలసిందిగా కమిషనర్‌కు వినత పత్రము అందజేశారు.

## మైనర్ల చేతికి బైక్‌లు.. తల్లిదండ్రులపై కేసులు తప్పవు

### ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సీఐ చంద్రశేఖర్ హెచ్చరిక

అచ్చుతాపురం, మే 21, ప్రభాతవార్త



అచ్చుతాపురంలో మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపితే తల్లిదండ్రుల బాధ్యతను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అచ్చుతాపురం సీఐ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ఇటీవల ప్రాంతంలో మైనర్లు నిర్లక్ష్యంగా బైకులు నడుపుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "పిల్లలపై ప్రేమ పేరుతో బైక్‌లు చేతికి ఇస్తే అది ముద్దు కాదు.. ప్రాణాలతో ఆటలాడినట్టే" అని సీఐ హెచ్చరించారు. మైనర్లు వేగంగా వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలకే కాకుండా రోడ్డు పై ప్రయాణించే నిరపరాధుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద విషాదాలకు దారి తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం మైనర్లు వాహనాలు నడిపితే సంబంధిత తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కేసులు నమోదు చేసి, భారీ జరిమానాలు విధించడంతో పాటు జైలు శిక్షకు కూడా అవకాశం ఉందని తెలిపారు. మైనర్ చేత వాహనం నడపనిచ్చిన యజమానికి రూ.25 వేల వరకు జరిమానా, మూడేళ్ల వరకు కారాగార శిక్ష విధించే నిబంధనలు అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. అదేవిధంగా వాహనం రిజిస్ట్రేషన్ రద్దు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడంపై కూడా పరిమితులు ఎదురయ్యే అవకాశముందని చెప్పారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, ట్రిపుల్ రైడింగ్, అధిక వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చట్టాలకు సహకరించాలని సీఐ కోరారు.

## మాకవరపాలెం నూతన వైద్యాధికారిగా రియాస్ అహమ్మద్

మాకవరపాలెం మే 21 ప్రభాతవార్త



మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా రియాస్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన రియాజ్ మాట్లాడుతూ మండలంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ తన వంతు సేవలు అందిస్తానన్నారు. ప్రధానంగా వేసవి దృష్టిలో ఉంచుకొని ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రజలు మరింత జాగ్రత్త వహించాలన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దన్నారు. ప్రధానంగా మసాలా, తినుబండారులకు దూరంగా ఉంటూ, ద్రపదార్ధలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ముఖ్యంగా కొబ్బరి నీళ్ళు, వోఆర్ఎస్, తీసుకోవడం మంచితన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వోఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు వచ్చి తీసుకోవచ్చు అన్నారు. విలేజ్ క్లినిక్ వద్ద ఆరోగ్య సిబ్బంది వద్ద అవసరమైన మందులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మండల ప్రజల సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తన వంతు పూర్తిస్థాయి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రియాస్ తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్యాధికారి రియాస్ కు డాక్టర్ ప్రత్యూష,సిహెచ్ఓ రమేష్, ఎంపిహెచ్ఓ సత్తిబాబు, ఫార్మసిస్ట్ జాస్మిన్, సూపర్వైజర్ ప్రభాకర్, తదితరులు స్వాగతించారు.

## మాకవరపాలెం పిహెచ్‌సిని సందర్శించిన డిఐఓ



మాకవరపాలెం, మే 21, ప్రభాతవార్త

మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ సందర్శించారు. ఈమేరకు గురువారం మాకవరపాలెం పీహెచ్సీలో జరుగుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్ర పరిధిలో జరుగుతున్న వివిధ సర్వేలు ప్రజలకు అందుతున్న సేవలుపై పూర్తిస్థాయిలో విచారణ చేశారు. పీహెచ్‌కి నూతనంగా వైద్యాధికారిగా వచ్చిన రియాస్ అహ్మద్, సిహెచ్ఓ రమేష్ లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్.ఓ.రామచంద్రరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## బయోగ్యాస్ యూనిట్ ద్వారా నెలకు రూ.60వేలు ఆదాయం

### స్వచ్ఛాంధ్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ రావు

కశింకోట, మే 21, ప్రభాతవార్త



:బయోగ్యాస్ యూనిట్ ద్వారా నెలకు రూ.60వేలు ఆదాయం సమకూర్తుందని స్వచ్ఛాంధ్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రమైన కశింకోట గ్రామంలో నిర్మిస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణాన్ని అర్జున్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేకూర్చే ఉద్దేశంతో బయోగ్యాస్ యూనిట్లు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సొంతంగా సాగు చేసే రైతులకు సంస్థ విత్తనాలు ఎరువులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఈ.సందీప్, ఎంపీడీఓ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.వెంకట లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## దిశ--సంకల్పం, యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహణ

### యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి :సీఐ చంద్రశేఖర్

అచ్చుతాపురం, మే 21, ప్రభాతవార్త

అచ్చుతాపురం మండల పరిధిలోని దిబ్బపాలెం గ్రామంలో "దిశ--సంకల్పం" మరియు యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరదాగా ప్రారంభమైన అలవాట్లు చివరికి నేరాలకు, కుటుంబ విభేదాలకు, ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయని హెచ్చరించారు. విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. దిశ--సంకల్పం కార్యక్రమం ద్వారా మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామస్తులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సై కొండయ్య, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.







## ఉపాధ్యాయుడు అప్పలరాజుకు సత్కారం



అనకాపల్లి మే 21, ప్రభాతవార్త

ప్రముఖ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి ఉత్సవాలు అనకాపల్లి సత్య గ్రాండ్‌లో బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేదికపై కుంద్రం హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, కవి రచయిత కోరాడ అప్పలరాజు రచించిన ఎడతెగని జ్ఞాపకాలు కవిత్వ సంపుటిని అనకాపల్లి మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ప్రముఖ సినీ గీత రచయిత గోదారి గట్టు మీద రామ చిలుకవే వంటి పాటల రచయిత భాస్కర భట్ల, సత్యారావు మాస్టర్, తానా నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాస్టర్‌ని అనేకమంది ప్రముఖులు అభినందించారు.

## బ్రాండిక్స్ గోడతో గ్రామానికి ఇబ్బందులు

### నిర్వాసితులకు న్యాయం చేయాలని టీడీపీ నేతల డిమాండ్
### -అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, మే 21, ప్రభాతవార్త



అచ్యుతాపురం మండలం దుప్పితూరు గ్రామంలో బ్రాండిక్స్ యాజమాన్యం నిర్మించిన భారీ గోడ కారణంగా గ్రామ ప్రజలు, నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ సమస్యలపై స్థానిక అట్లాస్ హోటల్‌లో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దుప్పితూరు గ్రామ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ బ్రాండిక్స్ సంస్థలో ఇప్పటికీ వైసీపీకి చెందిన వ్యక్తులకే కాంట్రాక్టులు, పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. అదే వర్గాలు గ్రామ సమస్యలను రాజకీయ రంగు పులుముతూ కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. "గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తున్నారు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రాండిక్స్ యాజమాన్యం వెంటనే నిర్వాసితులకు న్యాయం చేయడంతో పాటు స్థానిక కూటమి నాయకులతో సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని డిమాండ్ చేశారు. గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. అధికారుల అలసత్వం కారణంగా కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు కనీస వసతి సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. "ఇప్పటికైనా అధికారులు పాత రాజకీయ ప్రభావాల నుంచి బయటపడి కూటమి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలి. ప్రజలకు ఇబ్బందులు కలిగించి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే సహించేది లేదు" అని హెచ్చరించారు. దుప్పితూరు పీఏసీఎస్ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకట రమణ, గ్రామ శాఖ అధ్యక్షుడు బద్ది తాతాజీ, దేశంశెట్టి అప్పలనాయుడు, ప్రగడ జూనియర్ నాగేశ్వరరావు, దేశంశెట్టి కాసుబాబు, ప్రగడ రాజు పాల్గొన్నారు.



## ఘనంగా కొత్తమ్మ తల్లి జాతర

ఎస్.రాయవరం, మే 21, ప్రభాతవార్త

మండలంలో వెంకటాపూర్ గ్రామంలో వేంచేసి ఉన్న కొత్తమ్మ తల్లి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు ఉదయం నుండి భక్తులు ఆలయం చేరుకొని భక్తులు ముడుపులు చెల్లించుకున్నారు. వారు వీధుల్లో అమ్మవారి గరగలు డబ్బులు, శక్తి వేషాలతో ఊరేగించారు మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

## వార్డుల విభజన ముసాయిదాపై మున్సిపల్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, మే 21, ప్రభాతవార్త



పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీలోని వార్డుల విభజన ముసాయిదాయపై గురువారం మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వార్డులు విభజనపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని కూటమి నాయకులకు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సుపరిపాలన అందే విధంగా వార్డులు విభజన జరగాలని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మున్సిపాలిటీలో గల ప్రజలు పాల్గొన్నారు.

## మాకవరపాలెంలో జల హారతి కార్యక్రమం



మాకవరపాలెం మే 21 ప్రభాతవార్త

మండల కేంద్రం మాకవరపాలెంలో పాపయ్య చెరువు 100 రోజుల జలహారతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈమేరకు గురువారం చెరువు అభివృద్ధి జరుగుతున్న పనులను ఎంపీడీవో సాయి సుధా, ఏపీవో కాశీతో కలిసి సందర్శించారు. జల హారతిలో భాగంగా నీటి సంరక్షణ 100 రోజుల కార్యక్రమాన్ని ఉపాధి శ్రామికుల సమక్షంలో అధికారులు నేరుగా పర్యవేక్షించారు. మాకవరపాలెం టిడిపి నాయకులు మాజీ ఉపసర్పంచ్ లాలం రాము, రుత్తల నాని ఆధ్వర్యంలో పాపయ్యచెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా లాలం రాము,రుత్తల నాని మాట్లాడుతూ పాపయ్య చెరువు దాని సంబంధించిన కాలువలు అభివృద్ధి చేయడం వలన సుమారు 50 ఎకరాలు ఆయకట్టు నీరు అంది, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మరి ముఖ్యంగా పంటకాలువల అభివృద్ధి వలన సాగు భూములకు నీరు వెళ్లేందుకు సులభతరం అవుతుందన్నారు. గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెరువుని ఆనుకొని ఉన్న చెక్ డాం గేటు నిమిత్తం లక్ష రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గేటు లేకపోవడం వల్ల సాగునీరు వృధాగా పోతుందని అయ్యన్న పాత్రుడు చొరవతో పాపయ్యచెరువు అభివృద్ధితోపాటు చెక్ డాం గేటు మంజూరు చేసినందుకు మాకవర పాలెం రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, ఆయకట్టు రైతులు ఉపాధి హామీ శ్రామికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా

అనకాపల్లి, మే 21, ప్రభాతవార్త




సమస్యలు పరిష్కారం కోరుతూ ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రెండు రోజుల నిరసనలో భాగంగా గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో డిపో సెక్రెటరీ ఏఎన్ రావు, జిల్లా రీజినల్ సెక్రెటరీ పి.సుధాకర్‌లు మాట్లాడుతూ విద్యుత్ బస్సులు ఆర్టీసీ ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బంది ద్వారానే నడపాలని డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకం ద్వారా బస్సులో ప్రయాణం చేస్తున్న మహిళలకు జీరో టిక్కెట్ విధానాన్ని నిలుపుదల చేసి మిగతా ప్రయాణికులకు టిక్కెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని పని భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 13న ప్రభుత్వానికి, డిపో మేనేజర్ కు సమర్పించిన వినతి పత్రంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని, ప్రయాణికులకు సరిపడా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని తదితర సమస్యలపై వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

vsp11:vsp11.qxd 21-05-2026 21:37 Page 1






## సివిల్ సప్లై గోదాము వద్ద హమాలీల సమ్మె

**రెండు నెలలుగా జీతాలు లేక రోడ్డున పడ్డ కుటుంబాలు!**



గూడెం కొత్తవీధి, మే 21, (ప్రభాతవార్త): చింతపల్లి సివిల్ సప్లై గోదాములో హమాలీలుగా పనిచేస్తున్న 17 మంది కార్మికులకు గత మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు ఇంకా చెల్లించకపోవడంతో గురువారం హమాలీలు బంద్‌కు దిగారు. మేస్త్రి సత్తిబాబు ఆధ్వర్యంలో కార్మికులు గోదాం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతూ.. పలుమార్లు సంబంధిత అధికారులను కలిసి సమస్యను వివరించినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదని ఆరోపించారు. రెండు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. రోజువారీ కూలీతోనే కుటుంబాలను పోషిస్తున్న తమ పరిస్థితిని అధికారులు అర్థం చేసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులు నిర్వహించడం భారంగా మారిందని, అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే రెండు నెలల పెండింగ్ జీతాలను విడుదల చేయాలని, లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీతాలు చెల్లించే వరకు గోదాములో పనులను బహిష్కరిస్తూ బంద్ కొనసాగి స్తామని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని హమాలీలు కోరుతున్నారు.

## పెసా కమిటీ మండల అధ్యక్షుడిగా గణపతి



డుంబ్రిగుడ, మే 21 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో మండల పెసా కమిటీ ఎన్నిక గురువారం జరిగింది. మండల వ్యాప్తంగా ఉన్న పెసా కమిటీ ఉపా ధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు పాల్గొని మండల కమిటీని ఎన్ను కున్నారు. పెసా కమిటీ మండల అధ్యక్షుడిగా అగతంబిడి గణపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా చిన్నబాబు, కార్యదర్శిగా అప్పా రావు, ప్రధాన కార్యదర్శిగా గణేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన దేశ కమిటీ అధ్యక్షుడు గణపతి మాట్లాడారు గ్రామాభివృద్ధికి పెసా కమిటీతో సాధ్యపడుతుందని, గ్రామాల అభివృద్ధికి పెసా కమిటీ తోడ్పాటునిస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పెసా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై స్థానికుల ఆందోళన

డుంబ్రిగుడ, మే 21 ప్రభాతవార్త : మండల కేంద్రం డుంబ్రిగుడలో అక్రమ నిర్మాణాలపై స్థానిక గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులకు రక్షణ కవచంగానున్న 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నా, వీటిపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారికి అనుకుని అక్ర నిర్మాణాలు సాగుతున్నాయని గిరిజనులు అంటున్నారు. నిత్యం మండల కేంద్రంలో విధులు చేపట్టే అధికారులకు అక్రమ నిర్మాణాలు కంట బడకపోవడంలో అనుమానాలు తలెత్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడలో అక్రమ నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించి అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పాడేరు డిపోకు రూ.41లక్షల ఆదాయం

పాడేరు,మే21, ప్రభాతవార్త: పాడేరు శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ జాతర సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీవ నెల 17వ తేదీ నుండి 20 తేదీ వరకు 4 రోజులు పాటు నడిపిన ఆర్టీసీ బస్సులకు రూ/- 41 లక్షల 50 వేల రూపాయలు ఆదాయం వచ్చిందని పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ పీ. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంత్సరం 30 లక్షల 38 వేల రూపాయలు రాగా ఈ ఏడాది 3కలశాల 50 వేల రూపాయలు అదనంగా డిపోకు ఆదాయం వచ్చిందని డిఎం తెలిపారు. డిపోకు ఆదాయం రావడానికి కష్టపడి పనిచేసిన డిపో సిబ్బందికి డి ఎం శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

## ఏపీ ఆర్యవైశ్య మహాసభ అల్లూరి జిల్లా అధ్యక్షుడిగా శ్రీనాథ్ శ్రీను



పాడేరు,మే 21, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అల్లూరీ సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి జిల్లా అధ్యక్షులుగా శ్రీనాథ్ శ్రీనును నియమించడం రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు ఇల్లూరు లక్ష్మయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీను నియామకం పట్ల ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కో ఆర్డినేటర్ కారుమూరి మహేష్ , తదితరులు అభినందించారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు : కలెక్టర్



పాడేరు,మే21, ప్రభాతవార్త: జిల్లాలోని అన్ని గ్రామాలలో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా సంబంధిత అధికారులు యుద్ధప్రాతిపదికన తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టి. నిశాంతి. ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులతో వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత నివ్వాలనీ, ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య రాకూడదన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో చెడిపోయిన చేతిపంపులు, మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించి పునరుద్ధరించాలనీ, జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించ పరిశీలించి ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించాలన్నారు. కొయ్యూరు మండలంలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నందువల్ల ఆ మండల ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యను వేగవంతంగా పరిష్కరించుటకు తగు చూచనలు జారీ చేశారు. జిల్లాస్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనీ,తాగునీటి సమస్యలపై ఫిర్యాదుల రాకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించిన అధికారులు గ్రామస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అధికారులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల ప్రాథమిక బాధ్యతనీ, నిధులకు కొరత లేదనీ, అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి సమస్యలను అధిగమించాలన్నారు.

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, జిల్లా రెవిన్యూ అధికారి (ఎఫ్ఏసి) ఎంవీఎస్ లోకేశ్వరరావు , జిల్లా గ్రామీణ నీటి సరఫరా (ఆర్ డబ్ల్యూఎస్ ) ఈఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ విద్యాసాగర్ రావు, డిఎల్ పివో పిఎస్ కుమార్, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులతో సమీక్ష



పాడేరు, మే 21, ప్రభాతవార్త: ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు, ఉపాధి వేతనదారుల రక్షణే ప్రథమ ప్రాధాన్యతగా ఉపాధి హామీ పనుల వేళల్లో మార్పులు చేయడం జరిగిందని, పనిచేసే సమయం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మంచినీరు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం ప్రజలు అప్రమత్తంగా ఉండే విధముగా క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలనీ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల రక్షణ తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులతో గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అలాగే ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొగా, మండల స్థాయి అధికారులతో,మండల తహసిల్దార్లు, ఎంపీడీఓలు,గ్రామ/వార్డు సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ వర్చువల్ ద్వారా సమీక్షించారు. ఉపాధి హామీపథకం ( ఎన్ఆర్ఈజిఎస్ ) క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకు ఎండ తీవ్రత ఎక్కువగా పెరుగుతున్నందున ప్రజలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటికి వచ్చినప్పుడు అందుకు తగిన జాగ్రత్తలు తీసుకున్న తర్వాత మాత్రమే రోడ్లపైకి రావాలని, అత్యంత అవసరం ఉన్నట్లయితే తప్ప, బయట తిరగరాదని, మధ్యాహ్నం పూట బయటకు వచ్చేముందు తగు జాగ్రత్తలు తీసుకొని రావాలని సూచించారు. ఉపాధి హామీ కూలీల రక్షణ, ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేసే కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎండ తీవ్రత పెరగకముందే (ఉదయం పూట) పనులు ముగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కనీస వసతుల కల్పన, ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీల కోసం నీడ, మంచినీరు,మజ్జిగ సౌకర్యాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలనీ, అలాగే ఎండ దెబ్బ తగలకుండా అవసరమైన రక్షణ పరికరాలు, చలవ పందిర్లు సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎండ తీవ్రతపై అవగాహన కల్పించాలని, వడదెబ్బ బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖతో వారితో సమన్వయం చేసుకోవాలని అందుకు కావలసిన ఓఆర్ఎస్ ప్యాకెట్స్ ను సమకూర్చుకోవాలని ఆదేశించారు."ప్రజల ప్రాణాల రక్షణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆర్టీసీ బస్ స్టాప్ లలో, ముఖ్యమైన కూడలిలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల తాసిల్దార్, మండల అభివృద్ధి అధికార్లను ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, జిల్లా రెవెన్యూ అధికారి (ఎఫ్ ఏ సి )ఈఈ ఆర్ బ్ల్యూఎస్ నాగేశ్వరరావు, డ్వామా పిడి కె. విద్యాసాగర్, సిపిఓ ప్రసాదరావు, పిడి ఎపి ఎంఐపి రహీం, జిల్లా పశువర్ధక శాఖ అధికారి ఎం కరుణాకర్, అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రదీప్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జగన్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే



పాడేరు,మే21, ప్రభాతవార్త: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని పాడేరు మాజీ శాసనసభ్యులు, ఆ పార్టీ ఎస్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిగా తాడేపల్లి లోని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాతో పాటు ఎస్. కోట నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్మాణం కార్యకర్తల సమన్వయంపై పార్టీ అధినేత జగన్‌తో చర్చించారు.

## రాజు మృతికి నివాళులర్పించిన ఎంపిటిసి ఆనంద్



అరకులోయ, మే 21, ప్రభాతవార్త : అరకులోయలో నివాసముంటున్న రాజు ఫాస్ట్ ఫుడ్ యజమాని బి రాజు గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక టౌన్ ఎంపీటీసీ దూరియా ఆనంద్ రాజు స్వగృహం వద్దకు వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సాల్మన్ రాజు, పట్టాసి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు అమ్మవారి ఆలయంలో అన్నసమారాధన వాయిదా

పాడేరు,మే21, ప్రభాతవార్త: పాడేరు గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి ఆలయంలో శుక్రవారం జరగనున్న అన్నసమారాధన వాయిదా వేసినట్టు ఆలయ ప్రధాన కార్యదర్శి కోటిబాబు నాయుడు పేర్కొన్నారు. అన్నదాన సత్రం వద్ద ఘటాలు ఇంకా శుభ్రం చేయనందున అన్నదాన కార్యక్రమం వాయిదా వేయడం జరిగిందని, కావునా భక్తులు గమనించాలన్నారు. యధావిధిగా ఆదివారం నుంచి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కోటిబాబు తెలిపారు.

## దర్శన్‌పై దాడి ఒక డ్రామా.. మన్యంలో ఆ సంస్కృతే లేదు



గూడెం కొత్తవీధి, మే 21 (ప్రభాతవార్త): మొట్టడం రాజబాబు మాట్లాడుతూ, మోసగాళ్లు మోసం చేస్తూనే ఉంటారని, మోసపోయే వారు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అభినయ్ దర్శన్ పై జరిగినట్లు ప్రచారంలో ఉన్న దాడి ఘటనపై స్పందిస్తూ, ప్రశాంతంగా ఉండే మన్యప్రాంతంలో ఇటువంటి ఘటన జరిగిందనే విషయాన్ని ఆదివాసీ పార్టీ మొదటి నుంచే నమ్మలేదన్నారు. గతంలో రాజకీయ నాయకులపై దాడులు మావోయిస్టుల నుంచే జరిగేవని, రాజకీయ ప్రత్యర్థులు పరస్పరం దాడులు చేసుకున్న సంఘటనలు లేవన్నారు. దర్శన్‌కు పాడేరు ఎమ్మెల్యే అనుచరుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయని చెప్పడాన్ని తెలిసిన వారు నమ్మరని వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతంలో రాజకీయ, మత విద్వేషాలు లేవని, హిందూ, క్రైస్తవ, ముస్లిం సమాజాలు కలిసి సఖ్యతతో జీవిస్తున్నాయని తెలిపారు. అభినయ్ దర్శన్ స్వయంగా ఈ దాడి డ్రామా ఆడినట్టు తమకు అనుమానం ఉందన్నారు. పోలీసు అనుమతులు లేకుండా పాదయాత్ర నిర్వహించడం ద్వారా ప్రభుత్వానికే సవాల్ విసిరారని విమర్శించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లోకి వచ్చే వారిపై సరైన సమాచారం, నియంత్రణలు ఉండాలని డిమాండ్ చేశారు. దర్శన్‌ను నమ్మి సహకరించిన కొంతమంది ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆయనకు ఆశ్రయం ఇచ్చిన గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా పాస్టర్లు, క్రైస్తవ సోదరులు ఇకనైనా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని, ఆదివాసీ హక్కులు మరియు చట్టాలపై అవగాహన పెంచాలని సూచించారు.

## వలసగెడ్డలో పిఎం జన్ భగీదరి అభియాన్



గూడెంకొత్తవీధి, మే 21 (ప్రభాతవార్త): దుప్పులవాడ గ్రామ సచివాలయ పరిధిలోని వలసగెడ్డ గ్రామంలో "పి.యమ్ జన్ భగీదరి అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసే "ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్" (ఆదీనూా) హెల్త్ కార్డుల ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం పొందవచ్చని తెలియజేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత మరియు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి, గ్రామస్తులకు ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఓ. శ్రీసాగర్, సీలేరు ప్రభుత్వ హోమియో వైద్యాధికారిణి డాక్టర్ బి. సృజనరాయ్, హెల్త్ సూపర్ వైజర్ ఎన్. త్రినాథ్, హెల్త్ అసిస్టెంట్ పి. రాజుబాబు, ఏఎన్ఎమ్ కె.వి.ఎన్. కుమారి పాల్గొన్నారు. అలాగే దుప్పులవాడ స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది అయిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ ఎం. రాజేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి. కుసుమ రాణి, మహిళా పోలీస్ పి. ఈశ్వరి, వెటర్నరీ అసిస్టెంట్ జె. బాలమురళీకృష్ణ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### దొడ్డికొండలో...




గూడెం కొత్తవీధి, మే 21 (ప్రభాతవార్త): జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమంలో భాగంగా జీకే వీధి మండలంలోని దామనపల్లి పంచాయతీ పరిధిలోని దొడ్డికొండలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి బిహెచ్‌వీ రమణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపు, సికిల్ సెల్ అనీమియా పరీక్షలు, ఐసీడీఎస్ స్టాల్, ఆధార్ నమోదు కేంద్రం, పీఎం జన్మన్ హౌసింగ్ రిజిస్ట్రేషన్, జనధన్ బ్యాంకు ఖాతాల ప్రారంభం, పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల నమోదు, వందన్ వికాస్ కేంద్రం, అభా హెల్త్ కార్డుల పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని అవసరమైన సూచనలు అందించారు. మండల వ్యవసాయ అధికారి గిరిబాబు, గృహ నిర్మాణ శాఖ ఏఈ లక్ష్మీ విమల, ఐసీడీఎస్ సూపర్వైజర్ మోహిని, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సెగ్గే సూరి బాబు, చిట్టి పడాల్, అధికారులు, కూటమి నాయకులు, పేసా కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా జ్ఞానేశ్వరి బాధ్యతల స్వీకరణ



గూడెం కొత్తవీధి, మే 21 (ప్రభాతవార్త): ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం వరాహ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యురాలిగా చల్లంగి జ్ఞానేశ్వరి బాధ్యతలు చేపట్టారు. గిరిజన మహిళ ఆయన జ్ఞానేశ్వరి గత 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా, వివిధ హోదాల్లో పని చేశారు. గ్రామస్థాయిలో ఆమె పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. దీంతో ఆమె సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జరిచేసింది. ఈ మేరకు గురువారం సింహాచలం ఆలయంలో ఆలయ ధర్మకర్త, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు వర్చువల్ విధానాల్లో సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. జనసేన అరకు పార్లమెంటరీ నియోజకవర్గం కార్యానిర్వాహక సభ్యుడు గొర్లె వీర వెంకట్ ఆమెను సత్కరించి అభినందించారు.

## ధారకొండ ఘాట్‌లో వాహనం బోల్తా



గూడెం కొత్తవీధి, మే 21 (ప్రభాతవార్త): జీకేవీధి మండలం దారకొండ ఘాట్ రోడ్డులో గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాలకు పాల ప్యాకెట్లను తరలిస్తున్న బొలెరో పికప్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో వాహనంలో ముగ్గురు ప్రయాణిస్తుండగా, వారిలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. దారకొండ ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## జాతీయ రహదారి (ఎన్ హెచ్ -516) పెండింగ్లో ఉన్న సివిల్ డిపాజిట్ కేసెస్ నివేదికను త్వరితగతిన సమర్పించాలి



పాడేరు,మే21, ప్రభాతవార్త: జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఇన్చార్జి సబ్ కలెక్టర్ ఆదిత్య వర్మ జాతీయ రహదారి (ఎన్ హెచ్ -516) బృందంతో కలిసి పాడేరు నుండి జి. మాడుగుల వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో గురువారం సందర్శించి, సమీక్షించారు. ఈ పర్యటనలో భాగంగా జి. మాడుగుల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అధికారులు, అక్కడ తహశీల్దార్ మరియు కార్యాలయ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సివిల్ డిపాజిట్ల సంఖ్యపై సుదీర్ఘంగా చర్చించారు. పెండింగ్ లో ఉన్న సివిల్ డిపాజిట్ కేసెస్ పై నివేదిక రేపు సమర్పించాలని ఆదేశించి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రహదారి పనులు లో సమస్యలు, ఆలస్యంపై ఆరా తీశారు. జాతీయ రహదారులు పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిమాడుగుల తాసిల్దార్ జి రాజ్ కుమార్, నేషనల్ హైవే అసిస్టెంట్ ఇంజనీర్ లోకేష్, జి మాడుగుల రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పాడేరు జిల్లా ఆసుపత్రిలో అంబులెన్స్ లేక నరకయాతన

### కలెక్టర్ , పాడేరు ఐటిడిఏ పిఓ చొరవతో రెండు అంబులెన్సు, ఒక 108లో పేషెంట్లను కేజీహెచ్‌కు తరలింపు



పాడేరు,మే21, ప్రభాతవార్త:పాడేరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఎమర్జెన్సీ కేసులను కేజీహెచ్‌లో రిఫరల్ చేయాలంటే అంబులెన్స్ లేక నరకయాతన పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు రాధాకృష్ణ మాట్లాడుతూ: కిముడు లింగన్న 60 సంవత్సరాలు తలకి సమస్య,గుండె సమస్యతో గురువారం ఉదయం 10 గంటలకు కేజీహెచ్ రిఫరల్ రాశారు. అదేవిధంగా కాదేలి చంటిబాబు 31 సంవత్సరాలు పచ్చ కామెర్లు, లివర్, కిడ్నీ సమస్య కారణంగా ఉదయం 10 కేజీహెచ్ లో గంటలకు రిఫరల్, తమర్బ హరి 55 సంవత్సరాలు కాళ్లు రావటం లేదు నిన్న కేజీహెచ్ లో రిఫరల్ చేశారు గురువారం ఆరు గంటల వరకు అంబులెన్స్ లేదు జిల్లా కలెక్టర్ , మరియు పిఓ కి ఫోన్ చేయటంతో వెంటనే స్పందించి రెండు అంబులెన్సులు ఒక 108 అంబులెన్స్ ఏర్పాటుచేసి కేజీహెచ్కు రిఫరల్ చేశారు. పాడేరు ఐటిడిఏ పిఓ ఆదిత్యవర్మ చొరవ చాలా అభినందనీయం నాలుగైదు సార్లు ఫోన్ చేసి అంబులెన్స్ వచ్చిందా లేదా అని స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకుని, డిఎంహెచ్ఓ ఆఫీస్ నుంచి ఫోన్ వచ్చిందా లేదా డాక్టర్లు ఫోన్ చేశారా లేదా అని 10, 20 నిమిషాలకు ఫోన్ చేసి అడిగి తెలుసుకోవడం పాడేరు ఐటిడిఏ పిఓకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

## మహానాడు విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి: హోంమంత్రి అనిత



(నక్కపల్లి /ఎస్. రాయవరం ప్రభాతవార్త ): పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లిలోని మంత్రి నివాసంలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణపై టిడిపి శ్రేణులకు ఆమె దిశానిర్దేశం చేశారు. మహానాడు నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని హోంమంత్రి సూచించారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా మహానాడు నిర్వహించామని, ఈసారి మరింత ఉత్సాహంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తాను 50 శాతం వాహన వినియోగాన్ని తగ్గించుకున్నానని తెలిపారు. ప్రతి శుక్రవారం వాహనాలను ఉపయోగించకుండా తమ తమ పనులను నిర్వహించేలా నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని సూచించారు. ఈసారి మహానాడు ఆన్లైన్ విధానంలో అద్భుతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. క్లస్టర్ ప్రాతిపదికన మహానాడు కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. మహానాడుకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పసుపు రంగు షర్టులు ధరించాలని సూచించారు. గ్రామ స్థాయి నాయకుల నుంచి మండల స్థాయి నాయకుల వరకు అందరూ సమన్వయంతో పనిచేసి మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత వరకు కళ్యాణ మండపాల్లో మహానాడు కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో మహానాడు జరగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహానాడుకు హాజరయ్యే నాయకులు, కార్యకర్తలకు భోజనం, స్నాక్స్‌తో పాటు ఇతర సౌకర్యాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేయాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ,పార్టీ నాయకులు వినోద్ రాజు, గుర్రం రామకృష్ణ, అమలకంటి అబద్ధం, గింజల లక్ష్మణరావు, చించులకు వద్దు,పెద్దిరెడ్డి చిట్టిబాబు, మనిషా బేగం, కాశీ విశ్వనాథ్, వెలగ శ్రీను, కొప్పిశెట్టి బుజ్జి ,దార్ల కృష్ణ,నల్లల వెంకటరాజు ,ప్రగడ వీరబాబు, గొట్టివాడ బాబ్జి,రమా కుమారి తో పాటు పలువురు ఉన్నారు.

## దళిత హక్కులను కాలరాసిన జగన్



విశాఖపట్నం, మే 21,ప్రభాతవార్త

జగన్మోహన్ రెడ్డి పాలనలో దళితుల హక్కులను యధేచ్చగా కాలరాశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. డాక్టర్ సుధాకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో గురువారం పోస్టర్‌ను ప్రదర్శించారు. కోవిడ్ సమయంలో మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్ ఉద్యోగం నుంచి తొలగించి చనిపోయేవరకూ వేధించారన్నారు. దళితులను అణగదొక్కే వైసీపీని ప్రజలు తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, కె.రామా నాయుడు, తాత్రాజు అప్పారావు, సూరాల సత్య వరప్రసాద్, దేవుళ్లు, కాకర రమణ, ఎన్ని వెంకట్రావు, నరసింగరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో 27, 28 వ తేదీలలో మండల స్థాయి మహానాడు

పద్మనాభం, మే 21, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ రహదారి బంగ్లాలో రాష్ట్ర టీడీపీ అధిష్టాన మేరకు ఈ నెల27,28వ తేదీలలో మండల స్థాయి మహానాడు కార్యక్రమంను మండలం లో ఉన్న టీడీపీ క్లస్టర్స్ ఆధ్వర్యములో నిర్వ హించనున్నట్లు క్లస్టర్ కోఆర్డినేటర్ కె.రామ రాజు చెప్పారు. గురువారం మహానాడు కార్యక్రమం నిర్వాణ ఏర్పాట్లును ఆయనతో పాటు మండల సీనియర్ నాయకుడు మజ్జి నందీష్ పరిశీలిం చారు. నాయకులు, కార్యకర్తలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లును సిద్దం చేయనున్నట్లు రామరాజు తెలిపారు. ఈ మహానాడు కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హాజరవుతారని ఆయన అన్నారు.ఈ మహానాడు కార్యక్రమంను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఐక్య పోరాటంతో కాలుష్యంపై సమర శంఖం

### -గంగవరం పోర్టు, స్టీల్ ప్లాంట్ కాలుష్యంపై ప్రజా సంఘాల ఆగ్రహం



గాజువాక,మే 21,ప్రభాతవార్త

పరిశ్రమల కాలుష్యం నుండి ప్రజలను కాపాడాలని కోరుతూ గురువారం సమతానగర్‌లో వార్వా నివాస్, వాయిస్ ఆఫ్ గాజువాక, జనవిజ్ఞాన వేదిక, సమతానగర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. గంగవరం పోర్టు, స్టీల్ ప్లాంట్ల కాలుష్యం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు, నాయకుల్లో చలనం లేదన్నారు. గతంలో ప్రజా పోరాటం వల్లే అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రక్రియ ఆగిందని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో కాలుష్యంపై ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహిత గాజువాక కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.హిమంతరావు, చిక్కా సత్యనారాయణ, టివి నాగేశ్వరరావు, త్రినాధస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వడగాడ్పులతో నిర్మానుష్యంగా మారిన రోడ్లు, జంక్షనులు

పద్మనాభం, మే 21,ప్రభాతవార్త



అగ్నికార్తిలో భాగంగా గత మూడు రోజుల నుండి మండుతున్న ఎండలతో పద్మనాభం మండలంలో పలు గ్రామాల రోడ్లు, జంక్షన్లు గురువారం నిర్మానుష్యం గా మారాయి. ఉదయం నుండి సాయం త్రం వరకు కాస్తున్న తీవ్రమైన ఎండలు, వీస్తున్న వడగాడ్పులతో ప్రభుత్వం హెచ్చి రించినట్లుగా ప్రజలు బయట కానరావడం లేదు. అలాగే వడగాడ్పులకు బయపడి వాహనదారులు తిరగలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే పద్మనాభం, మద్దిగ్రామ, చిన్నాపురం,రేవిడి,రెడ్డిపల్లి జంక్షన్లు, రోడ్లు కర్ఫ్యూ విధించినట్లుగా మారాయి.ప్రజలు బయటకు రాకపోవడంతో దుకాణాలను కూడా యజమానులు మూసివేసారు.

## పద్మనాభంలో భక్తి శ్రద్ధలతో ముత్యాలమ్మ మహోత్సవం



పద్మనాభం, మే21, ప్రభాతవార్త

పద్మనాభం జంక్షనులో కొలువు దీరిన ముత్యాలమ్మ అమ్మవారి మహోత్సవంను గురువారం ఉదయం గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ రచ్చబండ నుండి అధిక సంఖ్యలో మహిళలు, యువతీ, యువకులు, రైతులు సాము గరిడీలు, కోలాటాలతో అమ్మవారిని పోలీసుస్టేషను మీదుగా ఊరేగించి జంక్షనులో ఉన్న అమ్మవారి గుడికి చేరుకున్నారు.అనంతరం భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం జ్యేష్ఠమాసం మొదటి వారంలో ఈ పండగను చేయడం పూర్వ సాంప్రదాయం.

## డాక్టర్ సుధాకర్ వర్ధంతి

### -కేండిల్ ర్యాలీలో పాల్గొన్న విప్ గణబాబు

గాజువాక,మే 21,ప్రభాతవార్త



గత ప్రభుత్వ అణచివేతకు బలైన దివంగత డాక్టర్ సుధాకర్ వర్ధంతిని పురస్కరించుకుని పారిశ్రామిక ప్రాంత దళిత సంఘాల ఆధ్వర్యంలో మల్కాపురం ఏడు గుడుల కూడలి వద్ద గురువారం భారీ కేండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు (గణబాబు) అంబేద్కర్ విగ్రహానికి, డాక్టర్ సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. కరోనా సమయంలో కనీస మాస్కులు, కిట్లు అడిగినందుకు నాటి జగన్ ప్రభుత్వం ఒక దళిత వైద్యుడిని మానసిక రోగిగా ముద్ర వేసి, నడిరోడ్డుపై చేతులు కట్టేసి కొట్టించి హింసించిందని మండిపడ్డారు. ఆ వేధింపుల వల్లే ఆయన ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే బాధితులకు న్యాయం జరుగుతోందని, దళితుల హక్కులను కాలరాసే శక్తులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నీలాపు జోగి, టి. చైతన్య, శ్రీధర్, పి. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే 'అల్లూరి పార్కు' సమగ్ర నిర్వహణ

### జీవీఎంసీ ఉద్యానవన శాఖ వెల్లడి -టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు

### -"ప్రభాత వార్త "కథనానికి అధికారుల వివరణ

**వార్త ప్రభావం**



గాజువాక,మే 21,ప్రభాతవార్త

మహా విశాఖ నగరపాలక సంస్థ 76వ వార్డ్ పరిధిలోని అల్లూరి సీతారామరాజు పార్కు నిర్వహణపై బుధవారం ప్రముఖ దినపత్రిక "వార్త"పత్రికలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ ఉద్యానవన శాఖ (హార్టికల్చర్ విభాగం) అధికారులు స్పందించారు. "అల్లూరి పార్కులో నిర్వహణ లోపం.. ఎక్కడి చెత్త అక్కడే" అనే వార్తాంశంపై ఉద్యానవన ఉప సంచాలకుల ఆదేశాల మేరకు గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, రీజాయిండర్ విడుదల చేశారు. పార్కులో పెండింగ్‌లో ఉన్న సివిల్, ఇంజినీరింగ్ పనులను పూర్తి చేసి.. ఈ నెల 15వ తేదీ నుంచే సందర్శకుల కోసం పార్కును యథావిధిగా తెరిచినట్లు అధికారులు స్పష్టం చేశారు.

**ముగింపు దశలో టెండర్లు....**

పార్కులోని మొక్కల పెంపకం, నిరంతర నిర్వహణకు సంబంధించిన పనులు ప్రస్తుతం టెండర్ల ప్రక్రియలో ఉన్నాయని ఉద్యానవన విభాగం ప్రతినిధులు తెలిపారు.టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే.. నిబంధనల ప్రకారం ఎంపికైన గుత్తేదారు (కాంట్రాక్టర్) ద్వారా పార్కు సుందరీకరణ, మొక్కల సంరక్షణ పనులను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామన్నారు. "సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం" అని జీవీఎంసీ ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

## ఎరువులు వినియోగం, సారవంతమైన నేలపై రైతులకు అవగాహన



పద్మనాభం, మే 21,ప్రభాతవార్త

భారత ప్రభుత్వం పథకంలో భాగంగా నాగ్రామం, నాకు గొప్ప కార్యక్రమంలో గురువారం విశాఖపట్నంలో ఉన్న కేంద్ర మత్స్య శాఖ పరిశోధన కేంద్రం శాస్త్ర వేత్తలు సమతుల్య ఎరువులు వినియోగం, సారవంత మైన నేల, ఆరోగ్యమైన మట్టి పై గందవరం, మద్ది, అనంతవరం గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు జాయ్, ఎస్ఎస్ రాజు, రితీష్ రంజాన్,జయశ్రీ లోక,మానస మాట్లాడుతూ యూరియా, ఎరువులు తగ్గించాలని,సేంద్రీయ, మరియు పచ్చిరొట్ట ఎరువులు వాడాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ విజయప్రసాదు, ఎం చలం, రైతులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

### -మే 25న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు

విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త



జీవీఎంసీ పరిధిలోని విద్యార్థుల కోసం వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గురువారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశం మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ ఏ రాజు, సమ్మర్ కోచింగ్ క్యాంప్ మోనిటరింగ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, జీవీఎంసీ పరిధిలో మొత్తం 486 కేంద్రాలలో 8 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల 12,036 మంది విద్యార్థినీ, విద్యార్థులకు మే 25, 2026 నుంచి జూన్ 6, 2026 వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాల ప్రారంభోత్సవం మే 25న స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో జరగనున్నాయన్నారు. శిబిరాల్లో పాల్గొనే పిల్లలకు టీ-షర్ట్‌లతో పాటు ప్రతిరోజూ బాయిల్డ్ ఎగ్, బిస్కెట్ ప్యాకెట్, చెక్కి, అదనంగా బటర్‌మిల్క్ అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 5:30 గంటలకు అన్ని జోన్లలోని 20 పాయింట్ల ద్వారా డైట్ పంపిణీ చేపట్టాలని సూచించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లలో మొత్తం 41 క్రీడా విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణతో పాటు పలువురు మోనిటరింగ్ కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కమిటీ సమన్వయంతో ఎటువంటి రిమార్కులు లేకుండా శిబిరాలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి శిక్షణా కేంద్రంలో తగిన త్రాగునీటి సదుపాయం కల్పించాలని త్రాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణను ఆదేశించారు. వైద్య సేవల కోసం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి, డీఎంఅండ్‌హెచ్‌ల సహకారం తీసుకోవాలని అదనపు కమిషనర్‌కు సచించారు. అలాగే ప్రతి కోచింగ్ సెంటర్ వద్ద శిబిరాలకు సంబంధించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిరోజూ హాజరు నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. విద్యార్థులను ఆకర్షించేందుకు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ల పర్యవేక్షణ కోసం కమిటీకి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేస్తామని, జీవీఎంసీ ప్రతిష్టకు భంగం కలగకుండా నిబద్ధతతో శిబిరాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు.

## విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు నిర్వహించిన నగర పోలీసులు



విశాఖపట్నం, మే 21 ప్రభాతవార్త

విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలను నగర పోలీసులు గురువారం నిర్వహించారు. డా. శంఖబ్రత బాగ్చి కమిషనర్ ఆఫ్ పోలీస్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, నగర భద్రతను మరింత బలోపేతం చేయడం తో పాటు నగరం గుండా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజిబుల్ పోలీసింగ్ వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల ద్వారా నేర కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నియంత్రణ సాధిస్తూ, ప్రజలకు సురక్షితమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించేందుకు నగర పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

## శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డు మెంబెర్‌గా సన్యాసిరావు

### -ఆరిలోవ నుండి తరలివెల్లిన కూటమి శ్రేణులు

ఆరిలోవ, మే21, ప్రభాతవార్త



శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ట్రస్ట్ బోర్డ్ మెంబర్ గా బిజెపి తరపున ఆరిలోవకు చెందిన మధుపాడ సన్యాసిరావు ఎన్నిక కాబడ్డారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆరిలోవ 11,12,13 వార్డుల నుండి పెద్ద ఎత్తున కూటమి శ్రేణులు ఆయనకు మద్దతు పలుకుతూ బయలుదేరి సింహాచలం వెళ్లారు. ఇంధనం ఆదా చేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపుమేరకు అధిక సంఖ్యలో ఎలక్ట్రికల్ వాహనాలు వేసుకొని ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొండపల్లి సతీష్ బాబు,టి. కోటేశ్వరరావు, సిహెచ్ సుబ్బలక్ష్మి,వి. నాగరాజు, ఒమ్మి సన్యాసి రావు, ఏడువాక సన్యాసిరావు, కాకి గంగ రాజు,ముగడ రాజారావు,ధర్మారావు, బాల స్వామి పాల్గొన్నారు.

## కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన నగర పోలీసులు



విశాఖపట్నం, మే 21 ప్రభాతవార్త

కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నగర పోలీసులు గురువారం నిర్వహించారు. డా.శంఖబ్రత బాగ్చి, కమీషనర్ ఆఫ్ పోలీస్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ దృష్ట్యా "కార్డన్ ఉ సెర్చ్" ఆపరేషన్ నిర్వహించి, ప్రతి ఇంటిని నిశితంగా తనిఖీ చేసి సరియైన ధృవపత్రాలు లేని 04 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

## పెద్దతీనార్ల గ్రామంలో వైద్య శిబిరం

నక్కపల్లి,ప్రభాతవార్త



మండలంలోని పెద్ద తీనార్ల గ్రామంలో గొడిచెర్ల పీహెచ్సీ ఆధ్వర్యంలో టీబీకు సంబంధించిన పలు వ్యాధులు విషయమై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులతో పాటు ఎంపీటీసీ మెరుగు నాగేశ్వరరావు ఉన్నారు.

## ఆ విద్యార్థినికి ప్రశంసల జల్లు

నక్కపల్లి ,ప్రభాతవార్త

నక్కపల్లి బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతూ ఢిల్లీ స్థాయి వరకు పాఠశాల ఖ్యాతిని చాటి చెప్పిన అమలకంటి అప్పారావు, దేవీల కుమార్తె ఉత్తమ మార్కులు సాధించడంతో ప్రధానోపాధ్యాయురాలు శ్రీ లక్ష్మీ ఆధ్వర్యంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాట జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తో పాటు విద్యాశాఖ అధికారులు అభినందించి ప్రశంసలు జల్లు కురిపించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురందాసు నూకరాజు ,ఎంఈఓ నరేష్ ,దొర తో పాటు పాటు పలువురు ఉన్నారు.



## 'గ్రేటర్' బీఆర్‌టీఎస్ రోడ్డులో ఈ-ఆర్టీ వ్యవస్థ ఏర్పాటుపై పరిశీలన

### -ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆధునిక ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్సిట్‌పై జీవీఎంసీ దృష్టి



విశాఖపట్నం, మే 21, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ గురువారం నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా ఈ-ఆర్టీ (ఎలక్ట్రిక్ రాపిడ్ ట్రాన్సిట్) వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ ప్రధాన ఇంజనీర్ పి.వి. సత్యనారాయణ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, ట్రాఫిక్ అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. ప్రవీణ్ కుమార్, పెందుర్తి మండల రెవెన్యూ అధికారి వెంకటరమణతో పాటు హెచ్‌ఈఎస్ఎస్ గ్రీన్ మోబిలిటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు. పెందుర్తి జంక్షన్ నుంచి కాన్వెంట్ జంక్షన్ వరకు రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతో పాటు ఆధునిక ప్రజా రవాణా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడానికి ఈ-ఆర్టీ వ్యవస్థపై కార్యాచరణ చేపట్టే అంశంపై అధికారులు చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మెట్రో తరహా సౌకర్యాలతో కూడిన రోడ్డు ఆధారిత ప్రజా రవాణా వ్యవస్థను అందించడమే లక్ష్యమని తెలిపారు. ఈ-ఆర్టీ వ్యవస్థ ద్వారా ప్రత్యేక కారిడార్లలో ఎలక్ట్రిక్ బస్సులు వేగవంతంగా, సురక్షితంగా, పర్యావరణ హితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. హెచ్‌ఈఎస్ఎస్ సంస్థ ప్రతినిధులు ఈ -ఆర్టీ వ్యవస్థ ప్రత్యేకతలను వివరించారు. అధిక సామర్థ్యంతో కూడిన ఎలక్ట్రిక్ బస్సులు ఒకేసారి 240 మందికి పైగా ప్రయాణికులను తరలించగలవని, రోజుకు సుమారు 23 గంటలపాటు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటాయని తెలిపారు. యూరప్, ఆస్ట్రేలియా దేశాల్లో ఈ వ్యవస్థ విజయవంతంగా అమలులో ఉందని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని నియంత్రించడం, కాలుష్యాన్ని తగ్గించడం, వేగవంతమైన ప్రజా రవాణా సేవలు అందించడం వంటి అంశాల్లో ఈ-ఆర్టీ వ్యవస్థ కీలక పాత్ర పోషించనుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్ల ఏర్పాటు, ప్రత్యేక మార్గాల అభివృద్ధి, ఎలక్ట్రిక్ బస్సుల రాకపోకలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై అధికారులు స్థల పరిశీలన నిర్వహించారు. ఈ అంశంపై ఆర్టీసీ, ఈపీడీసీఎల్, ట్రాఫిక్ పోలీస్, జీవీఎంసీ, రెవెన్యూ తదితర శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ప్రధాన ఇంజనీర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ రామ్మోహన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వర రెడ్డి, హెచ్‌ఈఎస్ఎస్ ప్రాజెక్టు ప్రతినిధులు ప్రవీణ్ కుమార్, ప్రాణేష్ ఎన్ నాయక్, జీవీఎంసీ టెక్నికల్ అడ్వైజర్ కేవీఎన్ రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆరిలోవలో యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

### -ప్రతిరోజు 100 ఆపరేషన్లు చేయాలని ఆదేశం

ఆరిలోవ, మే21, ప్రభాతవార్త



గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిరోజు సుమారు 100 కుక్కలకు ఆపరేషన్లు చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎంసీ సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ కిరణ్ కుమార్‌ను ఆదేశించారు. గురువారం ఆయన తూర్పు జోన్ ఆరిలోవ లో గల ఎబిసి (ఏనిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్శనలో జీవీఎంసీ కమిషనర్ ఆరిలోవ ఎబిసి సెంటర్ ను పరిశీలించారు. అక్కడ వాల్ మౌంటెడ్ కెనల్స్ లో కుక్కలను పరిశీలించి ,వాటి షెల్టర్ కోసం సిద్ధం చేస్తున్న బాక్స్ కెనల్స్ ను పరిశీలించారు. అనంతరం కుక్కలకు ఆపరేషన్ చేసే థియేటర్ ను పరిశీలించి రోజుకి ఎన్ని ఆపరేషన్స్ జరుగుచున్నాయో ఎంత మంది డాక్టర్లు ఆపరేషన్ నిర్వహిస్తున్నారో ఆరా తీశారు.ఆపరేషన్ చేసే ప్రక్రియను అక్కడ ఉన్న సీసీ కెమెరాలు ద్వారా పరిశీలించారు. నగరంలో గల అనకాపల్లి, ఆరిలోవ, నరవ, కాపులప్పాడ లో గల నాలుగు ఎ బి సి కేంద్రాలలో రోజుకు సుమారు 65 నుండి 70 కుక్కలకు ఆపరేషన్ చేయడం జరుగుతుందని,వీటి సంఖ్యను 100 కు పెంచాలని జీవీఎంసీ కమిషనర్ సిటీ వెటర్నరీ అధికారిని ఆదేశించారు.పట్టుకున్న కుక్కను ఎన్ని రోజులలో డాగ్ సెంటర్లో ఉంచుతారని కమిషనర్ ఆరా తీయగా పట్టుకున్న డాగ్ ను ఒక్కరోజు ఉంచి ఆరోగ్యం గా ఉన్న పిదప ఆపరేషన్ చేసి , ఎడమ చెవికి నాచ్ వేసి మూడు నాలుగు రోజులు పాటు ఉంచి వాటికి ఆహారం రెండు పూటలా పెట్టడం జరుగుతుందని అధికారులు తెలిపారు.యాంటీ రాబిస్ వ్యాక్సిన్ వేసిన తర్వాత కుక్కను ఏ ప్రాంతం నుండి తీసుకొచ్చామో అదే ప్రాంతాల్లో వదిలిపెట్టడం జరుగుతుందని కమిషనర్ కు సిటీ వెటర్నరీ అధికారి వివరించారు.ఆరిలోవ, నరవ సెంటర్లలో మరిన్ని ఆపరేషన్లు చేసేందుకు అవసరమయ్యే చర్యలు తో పాటు స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సెంటర్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి దానిని జీవీఎంసీలోని (సిఓసి) సిటీ ఆపరేషన్ సెంటర్ కు అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు. వీధులలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను పట్టుకొని వాటికి ఆహారం, నీరు అందించాలని అలాగే పశువుల యజమానులు నిబంధనల ప్రకారం జరిమానా విధించి వారికి అప్పజెప్పాలన్నారు. పశువుల సంరక్షణార్థం వాటికి అవసరమగు షెల్టర్లను ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేయాలని,వాటి నిర్వహణకు సామాజిక బాధ్యతతో ముందుకు వస్తున్న జైన్ కమ్యూనిటీ ఆర్గనైజేషన్ వారిని సంప్రదించి తగిన చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ కు కమిషనర్ ఆదేశించారు.నగరంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పశు సంచార నియంత్రణకు చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన దెందుకూరి



నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

మండలంలోని ఉద్దండ పురం గ్రామంలో ఊర చెరువు పీటర్ ఛానల్ నందు జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఇంచార్జ్ ఎంపీడీవో దెందుకూరి సీతారామ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సూచనలు ఇవ్వడంతో పాటు జల ధార -జల హారతి కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు గణేష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా డాక్టర్ సుధాకర్ వర్ధంతి

అగనంపూడి, ప్రభాతవార్త



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసన సభ్యులు గౌరవనీయులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు హాస్పిటల్‌లో దళిత డా.సుధాకర్ వర్ధంతి సందర్భంగా అగనంపూడి ఏరియా హాస్పిటల్‌లో గాజువాక నియోజకవర్గం డాక్టర్ సెల్ ప్రెసిడెంట్ తాతాజీ ఆధ్వర్యంలో నివాళులర్పించి సంఘీభావం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమానికి 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ సుధాకర్ కరోనా టైములో ప్రజల కోసం మాస్కులు సరైన వైద్యం అందించడం లేదని ప్రశ్నించినందుకు ఆయన్ని మానసికంగా హింసించి హత్య చేశారని ఎలాంటి దాడులు ఏ డాక్టర్ పైన కూడా జరగకూడదని ఖండించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ డాక్టర్లు, నర్సులు, పార్లమెంట్ ఉపాధ్యక్షులు కరణం సత్యారావు, బలిరెడ్డి సత్యనారాయణ, హాస్పిటల్ డైరెక్టర్స్ దొక్కా రమేష్, కోసూరు తాతారావు, వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, శీరంశెట్టి బాబ్జి, గొల్లవిల్లి నూకరాజు, కసిపల్లి శ్రీను, కొర్రాయి జగదీష్,ఉరికూటి అప్పలరాజు, ఉరికూటి నూకరాజు, గాజువాక మహిళా ఉపాధ్యక్షురాలు గంతకోరు సత్యవతి, 79వ వార్డు మహిళా అధ్యక్షురాలు గళ్ళ హనిత, మహిళ జనరల్ సెక్రెటరీ శిరీష, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

నక్కపల్లి రూరల్,ప్రభాతవార్త



మండలంలోని అమలా పురం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొంటున్న కూలీలకు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూటమి నాయకుల ఆధ్వర్యంలో గురువారంమజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కష్టపడే కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం మా బాధ్యత అనే భావంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం ఎంతో ఆనందంగా నాయకులు ఎరుపల్లి అప్పలరాజు, గోవిందరావు, సత్తిబాబు, రాజు, పైడిరాజు తదితరులు అన్నారు

## చింతామణి తల్లి ఆడియో పాటలు విడుదల



కవిటి, మే 21 ప్రభాతవార్త : శ్రీశ్రీశ్రీ చింతామణి గ్రామదేవత ఉత్సవ కమిటీ సౌజన్యంతో భక్తి పరవశాన్ని కలిగించే చక్కని చింతామణి తల్లి ఆడియో పాటలు భక్తుల ముందుకు తీసుకువస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి మహిమ, గ్రామదేవత వైభవం, భక్తి భావాన్ని ప్రతిబింబించే ఈ పాటలు భక్తులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా రూపొందించబడ్డాయి. ఈ ఆడియో సాంగ్స్‌లో ప్రముఖ గాయకులు చిన్నా గురుస్వామి మరియు టి.జ్యోత్స్న తమ మధుర గానంతో భక్తి రసాన్ని పంచారు. పాటల రచనను పిబిఎల్ కె.ప్రసాద్ అందించగా, సంగీత స్వరకల్పనను పీబీ కె.శర్మ (ఉన్నతి డాన్స్ అకాడమీ) సమకూర్చారు. రికార్డింగ్ కార్యక్రమం శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ డాన్స్ అకాడమీలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో రూపొందించిన ఈ భక్తి గీతాలు ప్రతి ఇంటిలో మారుమోగాలని ఆకాంక్షించారు. భక్తులందరూ ఈ ఆడియో సాంగ్స్‌ను ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.

## విత్తన గుళికలపై అవగాహన



కంచిలి, మే 21 ప్రభాతవార్త : కంచిలి మండలం డోలగోవిందపురం గ్రామంలో విత్తన గుళికలపై అవగాహన కల్పిస్తూ రైతులు సమక్షంలో విత్తన గుళికలు తయారుచేసి కాంప్లెక్ బ్లాకు ఐదు ఎకరాలు లైన్స్ షోయింగ్ పద్ధతిలో ఐదు మంది రైతులతో ఈ విత్తన గుళికలు వేయించడం జరిగింది. ఈ విధముగా విత్తన గుళికలు చేసి వేయడం వలన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం పడిన విత్తనం మొలకలు వస్తాయి. ఈ విత్తనాలు ఎలాంటి ఎండ టైంలో వేసిన విత్తనం పాడవకుండా భూమి లో ఎటువంటి నష్టము కలగకుండా భూమిలో నిక్షేపంగా ఉంటాయి. వర్షాలు పడినప్పుడు మొలకశాతం బాగా వస్తుందని, ఎటువంటి చీడ పీడలకు విత్తనాలు పాడవకుండా కాపాడడం జరుగుతుంది. భూమిలో సూక్ష్మజీవులు ఎండబారిన పడకుండా కాపాడుతుందని, తక్కువ వర్షపాతం వలన రైతుకు ఏదో ఒక పంట వలన ఆదాయం వస్తుందని నిరంతరం భూమిని పచ్చని పంటలతో కప్పి ఉంటుందని భూమిలో తేమశాతం ఉంటుందని మరియు భూమిలో జీవవైవిద్యం పెరుగుతుందని రైతులకు ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్ శివానందం వివరించడం జరిగింది. పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ మామిడి హరికృష్ణ, సచివాలయ ఇంజనీరింగ్ అధికారి, లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు, రైతులు లీడ్ ఫార్మర్స్ అంపూరం యూనిట్ ఐ సి ఆర్ పి లు, ట్రైనీ ఐసిఆర్పీలు పాల్గొన్నారు.

## రైతులు పీఎం కిసాన్ ఈకేవైసీ పూర్తి చేసుకోండి



వీరఘట్టం, మే 21 ప్రభాతవార్త : జిల్లాలోని రైతులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎంకిసాన్ పథకం కింద ఇకెవైసి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భవానీ శంకరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన భూస్వామ్య రైతులకు సంవత్సరానికి రూ.6,000లు ఆర్థిక సహాయం నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతోందని, ఈ లబ్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే ఇకెవైసి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. రైతులు తమ మొబైల్ ద్వారా పి ఎం కిసాన్ పోర్టల్ లేదా యాప్‌లో ఓటీపీ ఆధారంగా గానీ, లేదా ఫేస్ అథెంటికేషన్ ద్వారా గానీ స్వయంగా ఇకెవైసి చేసుకోవచ్చని తెలిపారు. బయోమెట్రిక్ విధానం కోసం సమీపంలోని గ్రామ రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లను లేదా సీఎస్‌సీ కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. నమోదులు వేగవంతం చేయాలిఇకెవైసితో పాటు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఏ పి ఏ ఐ ఎం ఎస్ రైతు నమోదులు, ఏ పి ఎఫ్ ఆర్ నమోదులను కూడా రైతులు వెంటనే పూర్తి చేయాలని వ్యవసాయ అధికారి సూచించారు. గ్రామ స్థాయిలో ఈ ప్రక్రియలను వేగవంతం చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని, రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి ఈ నమోదులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మరో ఐదు రోజులు ఎండల తీవ్రత అధికం : కలెక్టర్



వీరఘట్టం, మే 21 ప్రభాతవార్త : పార్వతీపురం మన్యం జిల్లాలో రానున్న ఐదు రోజుల పాటు ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ వారు జారీ చేసిన వాతావరణ హెచ్చరికల నివేదికను పరిశీలించిన అనంతరం ఆయన జిల్లా యంత్రాంగాన్ని మరియు ప్రజలను అప్రమత్తం చేశారు. రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో ఎండల తీవ్రత ప్రమాదకర స్థాయికి 41 డిగ్రీల నుంచి 54డిగ్రీల వరకు చేరుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, సాలూరు, పాచిపెంట, మక్కువ, సీతంపేట, భామిని, కొమరాడ, బలిజిపేట, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి, పాలకొండ 15 మండలాల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉందని కలెక్టర్ ప్రత్యేకంగా పేర్కొన్నారు. ప్రజలు మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు మరియు చిన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు, వడదెబ్బ తగలకుండా తగినన్ని నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి తీసుకోవాలని కోరారు. మండల స్థాయి అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన సదుపాయాలు మరియు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశించారు.

## యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ఆముదాలవలస, మే 21 ప్రభాతవార్త : యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పైడి వరాహ నరసింహులు అన్నారు. బుధవారం టి20 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వరాహ నరసింహులు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, సమయ భావన పెరగడానికి క్రీడలో ఎంతో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలికి తీయడం కోసం ఇలాంటి టోర్నమెంట్‌లు యువతకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. అనంతరం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో మెట్టెక్కివలస గ్రీన్ టీంపై నరసన్నపేట వైఎంసిసి విజయం సాధించిందని క్రికెట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, సుదర్శనరావు, నారా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



మెళియాపుట్టి, మే 21 ప్రభాతవార్త : ఖరీఫ్ 2026 సమీపిస్తున్న తరుణంలో చాపర రైతు సేవ కేంద్రంలో రైతులకు 50 శాతం రాయితీపైన పచ్చిరొట్ట విత్తనాలు కట్టే జనుము, జీలుగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా పిఎసిఎస్ చైర్మన్ సలానా మోహన్‌రావు పాల్గొన్నారు. రైతులందరూ కూడా నేల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయడం వలన నేలలో సేంద్రియ కర్బన శాతం పెంచడంతోపాటుగా రసాయన ఎరువుల వినియోగాన్ని కూడా తగ్గించుకోవచ్చని, ముఖ్యంగా పంట దిగుబడులు అధికంగా పొందవచ్చు అని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తున్న పిఎండిఎస్ విత్తనాలను ఈ సంవత్సరం వాతావరణం దృష్ట్యా ప్రతి ఒక్క రైతు కూడా ఖచ్చితంగా సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నాగరాజు మోహన్ రావు, మండల టిడిపి నాయకులు నంబల్ల వెంకటరావు గౌడ్ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్ నాయకులు శ్రీను పోలి నాయుడు నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

## సీజీఆర్ఎఫ్‌తో విద్యుత్ సమస్యల పరిష్కారం



సీతంపేట, మే 21 ప్రభాతవార్త : ఆంధ్ర ప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న (సిజిఆర్ఎఫ్) ద్వారా విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం సీతంపేట ఐటిడిఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వినియోగదారుల నుండి వినతులను స్వీకరించారు. సీతంపేట గ్రామంలో ఎన్నో దశాబ్దాలుగా నివాసముంటున్న ఎస్సీ కులాలకు చెందిన 23 కుటుంబాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని ఫిర్యాదులు అందాయని తెలిపారు. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. విద్యుత్ లోవోల్టేజ్ సమస్య, అధిక బిల్లులు వంటి వాటిపై వినతలు వచ్చాయని అన్నారు. ఎంవి విజయ చాముండి, ఎస్.సుబ్బారావు ఎన్.మురళీకృష్ణ డిప్యూటీ ఇంజనీర్లు మోహన్ చక్రవర్తి, రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, ఏఈ టెక్నికల్ కె.వి.కృష్ణారావు, జూనియర్ ఇంజనీర్ నీలిమతో పాటు వీరఘట్టం, పాలకొండ, భామిని ప్రాంతాల అసిస్టెంట్ ఇంజనీర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ విప్



కవిటి, మే 21 ప్రభాతవార్త : రైతు సంక్షేమ మే ప్రభుత్వ ధ్యేయమంటూ ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం రామయ్యపుట్టుగ క్యాంప్ కార్యాలయం నందు 50% రాయితీపై జీలుగు విత్తనాలను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ రైతు పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటూ కొనియాడారు. రైతులంతా ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న నాణ్యమైన విత్తనాలను వినియోగించుకొని అధిక దిగుబడులు సాధించాలంటూ కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి బెందాళం రమేష్, ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాశ్, పిఏసిఎస్ అధ్యక్షులు వాసుదేవ్ ప్రధాన్, మాజీ ఏఎంసి ఉపాధ్యక్షులు ఎస్.వెంకటరమణ, మాజీ జడ్పిటిసి పి.కృష్ణారావు, ఏవో శ్రీదేవి, తెలుగుదేశం నాయకులు వజ్జ రంగారావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## మారుతీనగర్‌లో కార్డెన్ సెర్చ్



సంతకవిటి, మే 21 ప్రభాతవార్త : సంతకవిటి మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో గల మారుతి నగర్ కాలనీలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీపురుపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్పీతో పాటు 15 మంది ఎస్ఐలు 38 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఐదు లైన్లు గల ఈ కాలనీలో 280 గృహాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎటువంటి పేపర్లు లేని 16 వాహనాలను సీజ్ చేశారు. గంజాయి మత్తు డ్రగ్స్ అలవాటు పడి యువత చెడిపోతున్నారన్న కారణంతో ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు డిఎస్పి రాఘవులు తెలిపారు ఒక్కసారిగా మారుతి నగర్‌ను పోలీసులు చుట్టుముట్టడంతో కాలనీవాసులంతా ఆశ్చర్యానికి లోనయ్యారు. కార్డెన్ సెర్చ్ అని తెలిసిన తర్వాత పోలీసులకు కాలనీవాసులు సహకరించారు. కార్యక్రమంలో సంతకవిటి ఎస్ఐ గోపాల్‌తో పాటు రూరల్ సీఐ ఉపేంద్ర ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వైసీపీని వీడి టీడీపీలో చేరిక



పాతపట్నం, మే 21 ప్రభాతవార్త : స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సమక్షంలో మెళియాపుట్టి మండలం గంగరాజుపురం గ్రామ పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షులు నంబాల వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్లు వట్టి కుళ్ళ శంకర్, గంగారత్నం, నీటి సంఘ అధ్యక్షులు జమ్మిన బైరాగి, మాజీ వార్డ్ మెంబర్ నగరం బిల్లి సంతోషి వీరితో పాటు వైసీపీని వీడి సుమారు 180 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ఎమ్మెల్యే గోవిందరావు పనితీరు, స్థానిక నాయకత్వంపై నమ్మకంతో వైసీపీని వీడి టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మెలియాపుట్టి మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్వతి కుటుంబానికి ఎస్సీ కమిషన్ మెంబర్ పరామర్శ



లావేరు, మే 21 ప్రభాతవార్త : మండల కేంద్రం లావేరు గ్రామానికి చెందిన దళిత మహిళా నాయకురాలు మాజీ సర్పంచ్ టీడీపీ నాయకులు గండి పార్వతి కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర ఎస్సి కమిషన్ మెంబర్ రావాడ సీతారాం పరామర్శించారు. ఇటీవల పార్వతి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న సీతారాం లావేరులో ఆమె స్వగృహంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. ఆమె కుమారుడు గండి సురేష్‌ను అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళిత సమాజానికి టీడీపీకి పార్వతి లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. నిత్యం మహిళలు సమస్యలపైన దళిత వర్గాలు అభ్యున్నతి కోసం నిరంతరం తన పోరాటాన్ని కొనసాగించారని అన్నారు. సీతారాం వెంట ఎచ్చెర్ల ఎస్సీ సెల్ నాయకులు లింగాల రామకృష్ణ, దుంగ వెంకటరమణ, లండ శంకర్, కుప్పిలి పొలారావు, దువ్వన సంతోష్ తదితరులు ఉన్నారు.

## ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి



పాతపట్నం, మే 21 ప్రభాతవార్త : స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాతపట్నం నియోజక వర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన విద్యుత్ శాఖ జెఈలు, ఏఈలు మరియు ఇతర అధికారుల తో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించే విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, లోవోల్టేజ్ సమస్యలు ఉన్న చోట వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, ఎక్కడైనా కరెంట్ కోతలు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి 26 వినతులను స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధింత అధికారులను ఎమ్మెల్యే గోవిందరావు ఆదేశించారు.

## క్రికెట్ టోర్నీ విజేత బైదులాపురం జట్టు



సీతంపేట, మే 21 ప్రభాతవార్త : సీతంపేట మండలం దేవనాపురం గ్రామంలో శ్రీశ్రీశ్రీ చంద్రమ్మ తల్లి ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బైదులాపురం. క్రికెట్ టీం కైవాసం చేసుకోగా వళ్ళ గజ్జి టీం రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర గురువారం బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు అప్పారావు. అశోక్. సూరి. హరి. జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, మే 21 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లా అత్యుత్తమ క్రికెటర్‌లుగా తయారు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఉన్న క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడిగా ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీ కార్యవర్గాన్ని శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో ఉన్నటువంటి క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం నందు ప్రకటించారు. అందులో భాగంగా వైస్ ప్రెసిడెంట్‌గా తర్లాడ బాలమురళిని, కార్యద ర్శిగా షేక్ హసన్ రాజాను, 23 సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తూ యువ క్రీడాకారులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు సంఘం కట్టుబడి పని చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల యువతకు అవకాశాలు అందించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయికి తీర్చిదిద్దడం లక్ష్యంగా ముందుకు సాగుతామని నూతన అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన రవికుమార్‌కి క్రికెట్ క్రీడాకారులు సన్మానించారు. కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు, క్రికెట్ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సీతంపేట ఐటీడీఏలో అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



సీతంపేట, మే 21 ప్రభాతవార్త : సీతంపేట ఐటీడీఏ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న వర్కర్, హెల్పర్ పోస్టుల భర్తీకి గురువారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ కొనసాగింది. ఐటీడీఏ పరిధిలో సీతంపేట, భామిని, పాలకొండ ప్రాజెక్టలలో 1 వర్కర్, 39 హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. వీటికి మొత్తం 97 దరఖాస్తులు వచ్చాయి. ఇంటర్వ్యూలకు దరఖాస్తు చేసుకున్న 97 మందిలో 69 మంది అభ్యర్థులూ హాజరయ్యారు. ఐటీడీఏ అధికారులు అభ్యర్థుల విద్యార్హతలు, సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. సంక్షేమ పథకాలు, స్థానిక పరిస్థితులపై అభ్యర్థుల అవగాహనను ఇంటర్వ్యూలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో సేవలను మరింత బలోపేతం చేసేందుకు ఈ నియామకాలు చేపడుతున్నామన్నారు. అర్హత, ప్రతిభ ఆధారంగా పూర్తిగా పారదర్శకమైన పద్ధతిలో, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడిఎస్ పీడీ డా.టి.కనకదుర్గ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ పార్వతి పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త



## ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఫ్లెక్సీల తొలగింపు



రాజాం, మే 21 ప్రభాతవార్త: రహదారులపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, కటౌట్లు ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగిస్తున్న తరుణంలో పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఉద్దేశంతో రాజాం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం వీటిని తొలగించడానికి మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి రహదారికి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు అమర్చిన బ్యానర్లను తొలగించారు. ఈ విధంగా తొలగించడంతో మున్సిపల్ కమిషనర్ తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## రసాయన ఎరువులు వద్దు.. సేంద్రియ ఎరువులే ముద్దు



వీరఘట్టం, మే 21 ప్రభాతవార్త : రసాయన ఎరువులు వద్దని ప్రకృతి వ్యవసాయమే ముద్దని నొక్కి వక్కాణిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య గురువారం ధాత్రి మాత బచావో కార్యక్రమంలో భాగంగా మండలంలో వీరఘట్టం, నడుకూరు, తూడి, యు.వెంకంపేట గ్రామాల్లో పాల్గొని మాట్లాడారు. రసాయన ఎరువులు మరియు యూరియా తక్కువ ఉపయోగిస్తూ సేంద్రీయ మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరిస్తూ మన నేలను ఏ విధంగా కాపాడుకోవాలి మరియు సారవంతంగా మార్చుకోవాలి అనే విషయాలను రైతులతో నేరుగా చర్చించారు. కార్యక్రమంలో నవధాన్యాలను ఉపయోగిస్తూ భూమి సారవంతంగా మార్చడం, వాటి ఉపయోగాలను రైతులకు తెలిపారు నేనో యూరియా మరియు నానో డి ఏ పి వాడే పద్ధతులను రైతులకు వివరించారు. ప్రతి ఒక్క రైతు ఏటీఎం విధానాలను అనుసరిస్తూ అధిక దిగుబడులను సాధించాలని సూచించారు.

## ఘనంగా ధర్మకర్తలి మండలి ప్రమాణ స్వీకారం



కోటబొమ్మాళి, మే 21 ప్రభాతవార్త : శ్రీ వారాహలక్ష్మినర్సింహస్వామి ఆలయ ప్రాంగణంలో ధర్మకర్తలి మండలి ప్రమాణస్వీకారం గురువారం ఘనంగా నిర్వహించారు. కోటబొమ్మాళికి చెందిన ప్రముఖ పురోహితులు సుసరావు గణపతిశర్మ తోటి సభ్యులతో పాటు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరావు అన్లైన్లో జూమ్ద్వారా సభ్యులకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా గణపతి శర్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ పదవిని . సమర్ధవంతంగా చేసి యువతకు, ప్రజలకు ఆధ్యాత్మిక వైపు మల్లించేందుకు, ఆలయ అభివృద్ధికి సాయశక్తుల కృషి చేస్తానని ఆయన అన్నారు.

## టెక్కలిలో తాగునీటి ఎద్దడి



టెక్కలి, మే 21 ప్రభాతవార్త : శ్రీకాకుళం జిల్లా టెక్కలి టౌన్‌లోని సర్వమంగళ మెట్ట వీధి, ఎన్టీఆర్ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో త్రాగునీరు అందక స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వీధుల్లో పూర్తిగా నీరు అందడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో అరకొరగా మాత్రమే నీళ్లు వస్తున్నాయి. అదే సమయంలో కొన్ని వీధుల్లో నిర్లక్ష్యం వల్ల లక్షల లీటర్ల మంచినీరు వృధాగా డ్రైనేజీల పాలవుతోంది. వృధాగా పోతున్న నీటిని అరికట్టలేకపోవడం, నీరు అందని ప్రాంతాలకు అందించలేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. టెక్కలి టౌన్ పరిధిలో తాగునీటి ప్రాజెక్టు ఉన్నప్పటికీ పట్టణ ప్రజలకు నీరు అందకపోవడం శోచనీయం.

**తీవ్రంగా నీటి ఎద్దడి ఉన్న వీధులు :**

ఎన్టీఆర్ కాలనీ, కుమ్మర వీధి, సర్వమంగళ మెట్టవీధి, గోడగల వీధి, పాల కేంద్రం వెనుక ప్రాంతం, పెద్ద శివాలయం వీధి, దిగువ మత్స్యకార్ల వీధి. సర్వ మంగళ వీధి ఈ వీధుల్లో పూర్తిగా నీరు అందడం లేదు. మరికొన్ని వీధుల్లో అరకొరగా మాత్రమే వస్తోంది. నీరు అందని వీధుల్లో ఇప్పటికీ కొత్త పైపులైన్లు వేయలేదు. ఎగువ ప్రాంతాలకు త్రాగునీరు అందడం లేదు. దిగువ ప్రాంతాల్లో మాత్రం నిర్లక్ష్యం వల్ల త్రాగునీరు వృధాగా డ్రైనేజీలోకి వెళ్తోంది. ఇలా సంవత్సరాలు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఇంకెన్నాళ్లకు మా వీధుల్లో పూర్తి సమయం తాగునీరు అందుతుంది? మాకు న్యాయం చేసేది ఎవరు? మా కష్టాలు ఎవరికీ పట్టవా?" అని ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో స్థానిక ప్రజలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

**ప్రజల డిమాండ్లు:**

నీరు అందని వీధులన్నింటికీ తక్షణమే ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయాలి. వృధాగా పోతున్న నీటిని వెంటనే అరికట్టాలి. బురద నీరు, పురుగులు నీరు రాకుండా అరికట్టాలి, లీకేజీలకు శాశ్వత మరమ్మతులు చేయాలి. అనేక సంవత్సరాలు గడుస్తున్నా మురుకు నీరు కలుషితం మాత్రం అరికట్టలేకపోతున్నారు, కొత్త పైపులైన్లు వేసి, అన్ని వీధులకు సమానంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలి. జిల్లా సంబంధిత అధికారులు స్వయంగా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అన్నప్రసాదం వితరణ



కోటబొమ్మాళి, మే 21 ప్రభాతవార్త : ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, కోరుకున్న వారికి కొంగు బంగారం శ్రీ కొత్తమ్మతల్లి సన్నిధిలో గురువారం ఆలయ కార్య నిర్వహణ అధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 300 మంది భక్తులకు అన్నప్రసాదం వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు మంచాల వెంకట రావు, దేవాది లక్ష్మణ రావు భక్తులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే శిరీష



పలాస, మే 21 ప్రభాతవార్త : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దగ్గర పిఎస్ఓగా పని చేస్తూ విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో తలగాపు శంకర్ మరణించిన విషయం అందరికి విధితమే. ఐతే శంకర్ కుటుంబానికి ఆరోజు శిరీష అండగా నిలిచి అతని భార్యకి పిల్లలకి కుటుంబ సభ్యులకి ధైర్యం చెప్పి మీకు నేను అండగా ఉంటానని ఇచ్చిన మాట ప్రకారం వారికి ప్రభుత్వపరంగా చెందవలసిన అన్ని సౌకర్యాలను అందిస్తూ ఆయన భార్య తలగాపు శిరీష ఉద్యోగం కల్పిస్తూ పలాస జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు శిరీషని వ్యక్తిగతంగా కలుసుకొని కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఇది శిరీష కమిట్మెంట్ అంటే. తన చుట్టూ ఉన్న వారి పట్ల ఆమె ఎంత బాధ్యతగా ఉంటారనడానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

## బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం



శ్రీకాకుళం, మే 21 ప్రభాతవార్త : మండుతున్న ఎండల్లో ఓఆర్ఎస్, గ్లూకోజ్ వంటివి తీసుకోవడం ద్వారా బాటసారులు, వాహన చోదకులు ఉపశమనం పొందవచ్చని శ్రీకాకుళం మునిసిపల్ కమిషనర్ హనుమంతు కూర్మరావు పేర్కొన్నారు. కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక ఏడు రోడ్ల కూడలిలో ప్రజలకు తాగునీటి సీసాలు, గ్లూకోజ్ నీటిని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల ఆరోగ్యంపై సామాజిక బాధ్యతతో కిమ్స్ యాజమాన్యం ఈ సేవా కార్యక్ర మాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్య సూత్రాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే ఆలస్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ప్రజల దాహార్తిని తీర్చిన కిమ్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్, కిమ్స్ ఆసుపత్రి వైద్య సిబ్బంది, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు గౌతమి, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

22 -5Pg9th cheli.qxd:22 -5Pg9th cheli.qxd 1/1/02 6:04 AM Page 1



## ముడతలూ, మచ్చలూ లేకుండా..



30వ పడిలోకి అడుగు పెట్టగానే... వృద్ధాప్య ఛాయలు మొదలై పోయాయని బాధపడేవారే ఎక్కువ. ఈ సమస్యనుంచి బయటపడటానికి ఏవేవో మార్గాలను కనిపెట్టపెడతారు. వాటిలో మాయిశ్చరైజర్ల వాడకం ఒకటి. అయితే, సరైన వాటిని ఎంపిక చేసుకోకపోయినా, రాసుకునే విధానం తెలియకపోయినా... సమస్య మరింత జటిలం అవుతుంది. అసలు దీన్నెల వాడాలంటే... చాలామంది పొడిబారిన చర్మంపై మాయిశ్చరైజర్ రాస్తుంటారు. అలాకాకుండా చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని రాయాలి. అప్పుడే ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇప్పుడంతా ఉరుకులూ, పరుగులే... ఆ కంగారులో దీన్ని రాసుకొని, వెంటనే మేకప్ వేసుకునే వాళ్లే ఎక్కువ. దీనివల్ల చర్మకణాలు మూసుకుపోయి, వృద్ధాప్య ఛాయలు తొందరగా వచ్చేస్తాయట. అందుకే దీన్ని రాసుకున్నాక 1015 నిమిషాలైనా ఆరనివ్వాలి. అప్పుడే అనుకున్న స్థాయిలో ఫలితం ఉంటుంది. చాలా మాయిశ్చరైజర్స్‌లో చర్మానికి హాని చేసే రసాయనాలు ఉంటాయి. అందుకే వీటి ఎంపికలో సహజ సిద్ధమైన వాటితో తయారైన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ వేరే ఉత్పత్తులు వాడినా... తయారీలో వాడే వస్తువులు, స్థాయులూ మీ చర్మతత్వానికి సరిపోతాయో లేదో తెలుసుకుని... వైద్యుల సలహా మేరకు తీసుకుంటేనే మేలు. చర్మ సంరక్షణలో ముఖానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... మెడను అలానే వదిలేస్తారు. దాంతో పిగ్మెంటేషన్, ముడతలు పడి... ఎక్కువ వయసు వారిలా కనిపిస్తారు. కాబట్టి ముఖంతో పాటూ మెడకు దీన్ని రాయాలి. వాడుకలో పరిమాణమూ ముఖ్యమే. ఏ చర్మతత్వానికి ఎంతమేర మాయిశ్చరైజర్ వాడొచ్చో తెలుసు కోవాలి. అలాకాకుండా, ఎక్కువ, తక్కువ రాస్తే అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు ఆ స్కిన్‌ను కాబట్టి మాయిశ్చరైజర్స్ అవసరం లేదనుకుంటారు చాలామంది. కానీ దీనికీ ఇవి అవసరమే. ✶

## ఎనర్జీ డ్రింక్స్ తాగుతున్నారా?



**తక్షణ శక్తి కావాలనుకున్నప్పుడో, సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నప్పుడో వెంటనే మనకు గుర్తొచ్చేవి ఎనర్జీ డ్రింక్‌లే. అయితే జాగ్రత్తలు కూడా అవసరం.**

క్షణం తీరికలేని ఈ జీవితాల్లో తక్షణ శక్తినిచ్చే ఆహారానికీ, పానీయాలకూ మనం అలవాటుపడ్డా మనటంలో సందేహం లేదు. అయితే ఈ సౌకర్యమే మన అనారోగ్యాలకు కారణమవుతోందట. వీటిని తక్కువ మొత్తాల్లో తీసుకున్నా సరే.. విద్యార్థుల్లో నిద్రలేమి సమస్య లొస్తున్నట్లు తాజా పరిశోధనల్లో వెల్లడైంది. నిద్రలేమికి జీవనశైలి, ఒత్తిడి, నిద్రవేళలు సక్రమంగా లేకపోవటం.. వంటివి కారణమైనప్పటికీ ఇదీ ఓ కారణమవుతోందట. సాధారణంగా ఎనర్జీ డ్రింక్‌లు త్వరగా శక్తినిస్తాయని, శారీరకంగా, మానసికంగానూ చురుగ్గా ఉండొచ్చని తీసుకుంటాం. అయితే వీటిల్లో ఉండే కెఫీన్.. కేంద్ర నాడీ వ్యవస్థను స్టిమ్యులేట్ చేసి, అలసటను తగ్గిస్తుంది. అయితే ఇవి అందరిలోనూ ఒకేలాంటి ప్రభావం చూపించవచ్చు. ఒక వ్యక్తి కుండే కెఫీన్ సెన్సి టివిటీ, ఆరోగ్యం, వారికున్న ఇతర వ్యాధులను బట్టి ఫలితాలు వేరుగా ఉంటాయట. వీటిని ఎక్కువగా తీసుకుంటే బిపి పెరగటం, ఆందోళన, గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణ సమస్యల వంటివి తలెత్తుతాయట. వీటిలో ఉండే పంచదార బరువు పెరిగేలా చేయ టమే కాదు. దంత సమస్యలనూ తెచ్చి పెడుతుంది. ఈ ఎనర్జీ డ్రింకుల వల్ల అందరికీ ఒకేలాంటి ప్రయోజనాలు అందవనీ వాటిని పరిమితంగా తీసుకోకుంటే అనారోగ్యాలు తప్పవనీ వైద్యులు సూచిస్తున్నారు.

**ప్రత్యామ్నాయం ఇలా...** . శక్తి తగ్గకుండా ఉండాలంటే ముఖ్యంగా చేయాల్సినది శరీరంలో నీటి శాతం తగ్గకుండా చేసుకోవటం. అందుకోసం నీళు, హెర్బల్ టీ, ఇన్‌ఫ్యూజ్‌డ్ వాటర్‌ను (పండ్లను వేసి ఉంచినవి) తీసుకుంటే ఉల్లాసంగానూ ఆరోగ్యంగానూ ఉంటాం. నట్స్ పెరుగు, పండ్లు, తృణధాన్యాలతో చేసిన క్రాకర్స్ వంటివి చిరుతిళ్లుగా తీసుకోవచ్చు. వీటిలోని సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులూ, ప్రొటీన్లూ ఆకలిని తీర్చటమే కాకుండా శరీరానికి పోషకాలనూ అంది స్తాయి. అలానే కూరగాయలు, పండ్లతో స్మూతీ చేసుకుని దాన్లో కొంచెం తీనె కలిపి తీసుకుంటే శక్తి కోల్పోకుండా ఉంటాం. లేదంటే తాజా పండ్ల రసాలు తీసుకున్నామంచిదే. ▫

## పిల్లలు, కెరియర్ సమన్వయం !



**మాతృత్వం ఓ** మధురానుభూతి. కానీ ఆ ప్రయాణంలో శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాలపరంగా, సామాజికంగా మనం ఎదుర్కొనే సవాళ్లనేకం. ఓవైపు తల్లిగా బాధ్యతలు నెరవేరుస్తూ, మరోవైపు కెరియర్‌నీ సమన్వయం చేసుకోవడం అంత తేలికేం కాదు. అందుకే చాలామంది ఉద్యోగినులు ప్రమోషన్లూ, వేతనాల విషయంలో రాజీపడుతున్నారు. కొంతమందైతే అసలు ఉద్యోగాన్నే వదిలేస్తున్నారు. ఈ పరిస్థితినే 'మదర్‌హుడ్ పెనాల్టీ'గా అభివర్ణిస్తున్నారు నిపుణులు. తొలి బిడ్డ పుట్టిన మొదటి ఏడాది 24 శాతం మహిళలు ఉద్యోగాల్ని వదిలేస్తుంటే, ఐదేళ్ల తర్వాతా చేరనివారు. 17 శాతం. పదేళ్లయ్యాకా కూడా చేరని మహిళలు 15 శాతమట. ఇప్పుడిప్పుడే భర్తా.. పిల్లల బాధ్యతల్ని పంచుకోవడం సంతోషించదగ్గ విషయమే అయినా, ఆడవాళ్లు చేసే పనిలో మూడో వంతు మాత్రమే చేస్తున్నారట. ఇప్పటికీ చాలామంది మహిళలపై ఇల్లూ, ఉద్యోగంతో పాటు అదనపు పనిభారం ఉంటూనే ఉంటుంది. నిజానికి అమ్మకాని మహిళలకూ, తల్లులకూ మధ్య వేతనాల్లో ఉండే తేడా ఆడా, మగా వేతనాల్లో ఉండే భేదం కంటే ఎక్కువట. ఎందుకంటే తల్లయిన మహిళ సమర్థవంతంగా పనిచేయలేదనీ, ఎక్కువగా భావోద్వేగాలకు లోనవుతుంటారనీ భావించడమే అందుకు కారణమట. పిల్లల బాధ్యతలతో ఈ 'మమ్మీట్రాక్'లో పడి చాలామంది మహిళలు తమ సామర్థ్యాల కంటే తక్కువ ఉద్యోగాల్లో సర్దుకుపోతున్నారు. కెరియర్లో ఎదిగే అవకాశాలు పోగొట్టుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే నిజానికి ప్రభుత్వ విధానాలు మాత్రమే సరిపోవు. ఇంట్లోనూ, సంస్థల ఆలోచనా విధానాల్లోనూ మార్పురావాల్సి ఉంది. అప్పుడే సమానత్వం సాధించగలం. అమ్మ మోస్తోన్న ఈ శిక్షను తగ్గించగలం. ▫

## ఫ్రిజ్‌లో ఎంత సమయం పెట్టాలి?

**ఫ్రిజ్‌లో పెడితే పదార్థాలు పాడైపోవు అనుకుంటారు. కానీ వాటికీ ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. అంతేకాదు. అవి చూడ్డానికి, రుచికి బాగానే ఉంటాయి. కానీ మన ఆరోగ్యాన్ని పాడు చేసే బ్యాక్టీరియా వాటిలో అభివృద్ధి చెందు తుంది. కాబట్టి ఏ పదార్థం ఎప్పుడు ఫ్రిజ్‌లో పెట్టాలి? ఎన్ని రోజులు ఉంచాలి?**



ఏ కాలంలోనైనా ఫ్రిజ్‌లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల ఫారన్‌హీట్ (4.4 డిగ్రీల సెల్సియస్)కు మించ కుండా చూసుకోవాలి. పాలు, పాల పదార్థాలు, మాంసం, కోడిగుడ్లు, చేపలు.. వంటి త్వరగా పాడైపోయే పదార్థాలు బయటి నుంచితెచ్చిన రెండు గంట ల్లోపే ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఒకవేళ బయట ఉష్ణోగ్రత 90 డిగ్రీల ఫారన్‌హీట్ (32.2 డిగ్రీల సెల్సియస్) కంటే ఎక్కువగా ఉన్నట్లయితే తెచ్చిన గంటలోపే ఈ పదార్థాల్ని ఫ్రిజ్‌లో పెట్టాలి. గడ్డకటిని పదార్థాలను కిచెన్ ప్లాట్ ఫామ్, టేబుల్‌పై పెట్టి వాటంతటవే కరిగిపోతాయి అని వదిలేయడం మంచిది కాదు. ఎందుకంటే గది ఉష్ణోగ్రత వద్దకు చేరేసరికి ఆయా పదార్థాల్లోని బ్యాక్టీరియా రెండింతలవుతుంది. కాబట్టి కౌంటర్ టాప్స్‌పై పెట్టి ఘనీభవించిన పదార్థాల్ని అస్సలు కరిగించ కూడదు. నీటిలో/ మైక్రోవేవ్ ఒవెన్‌లో పెట్టి కరిగించడం సురక్షితం. సూప్స్, ఇతర కూరల్ని 'కాయగూరలు లేదా ఇతర మాంసాహారం కలిపి తయారు చేసినా మూడు నాలుగు రోజుల వరకు ఫ్రిజ్‌లో నిల్వ చేయచ్చు. మిగిలి పోయిన ఆహార పదార్థాలు (మాంసం, పౌల్ట్రీ, చికెన్ నగెట్స్/ ప్యాటీస్, పిజ్జా.. వంటివి ఫ్రిజ్‌లో మూడు నాలుగు రోజులు ఉంచచ్చు. అలాగని అన్ని పదార్థాలను రోజుల తరబడి ఫ్రీజర్లో పెట్టి ఎప్పుడో వినియోగించడం కరక్ట్ కాదు. అయితే సాధ్యమైనంత వరకు మనం తీసుకునే ఆహార పదార్థాల్ని తాజాగా, పరిశుభ్రంగా, అప్పటికప్పుడు వండుకొని, వేడివేడిగా తీసుకోవడమే మంచిదని చెబుతున్నారు నిపుణులు. కాబట్టి వీలైనంతవరకు మిగిలిపోయిన అన్ని పదార్థాలనీ ఫ్రిజ్‌లో తోసేయకుండా జాగ్రత్త పడడం మంచిది. ▫

## 'సర్వేజనాః సుఖినో భవంతు'

**హిమాలయమంత ఉన్నతమైంది**, గంగా జలంలా పవిత్రమైంది హిందూధర్మం. అందుకే ఈ ధర్మం యుగయుగాలుగా మనుగడ సాగిస్తూ కొనసాగుతోంది. ఇది వేదాల్లోంచి జన్మించినందు వల్లే ఇంతటి శక్తి కలిగుంది. అందుకే మనదేశాన్ని వేదభూమి, కర్మభూమి, ధర్మభూమి, పుణ్య భూమి అంటూ వర్ణించారు. సమైక్యంగా, ప్రేమభావంతో జీవించమని ఉపదేశిస్తున్నాయి వేదాలు. కుటుంబంలోనూ ఒకరితో ఒకరు ఎలా ప్రవర్తించాలో బోధిస్తాయి. తండ్రిని అనుకరించాలని, తల్లి మనసును నొప్పించకూడదని, భార్యాభర్తలు పరస్పర అవగాహనతో ఉండాలని తెలియజేస్తున్నాయి. తొడపుట్టినవాళ్లు కలహించుకో కూడదని పేర్కొంది అధర్వణవేదం. కుటుంబమే కాదు, సమాజశ్రేయస్సూ ముఖ్యమని, సకల ప్రాణకోటీ ఐక్యతంగా ఉండాలని బోధిస్తుంది రుగ్వేదంలోని సంపన్న సూక్తం. సంపన్న అంటే జయించడం అనే అర్థముంది. అంటే అవసరమైనవి సాధించుకునేలా ప్రేరేపిస్తుంది. ఇలా వేద ఆధారితమైన హిందూధర్మం- 'సర్వేజనాఃసుఖినో భవంతు' అంటూ సర్వ జనావళి సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తుంది. ప్రకృతిలో అణువణువునా పరమాత్మను దర్శిస్తుంది. ప్రకృతినే గురువుగా భావిస్తుంది. ప్రకృతి నుంచే పాఠాలు నేర్చు కోమంటుంది. తులసిమొక్కకి పవిత్ర స్థానం ఇచ్చింది హిందూ ధర్మం. సర్వతీర్థాలను, దేవతలను కలిగున్న తులసిని తులసీమాతగా కీర్తించింది. హిందూ ధర్మం ప్రవచించే సూత్రాలన్నింటిలో ఆధ్యాత్మికత ఇమిడి ఉంటుంది. మన ఆచారాలు భక్తిని ప్రేరేపించడమే కాదు. ప్రశాంతత నిచ్చి, అభ్యున్నతి దిశగా నడిపిస్తాయి. ✶

## స్పడ్‌గా ఆడుదాం..



ముందుగా పిల్లల్లో ఎవరో ఒకరు బంతిని గాల్లోకి ఎగరవేయాలి. ఎగరవేసిన వెంటనే ఇతర పిల్లల్లో ఎవరో ఒకరి పేరుని గట్టి అరవాలి. అలా ఎవరి పేరు చెప్పారో వాళ్లు ఆ బాల్‌ని కిందపడే లోగా పట్టుకోవాలి. వెంటనే ఎస్‌పియూడి (స్పడ్) అని అరవాలి. దీంతో మిగతా పిల్లలు ఎక్కడ ఉన్నవాళ్లు అక్కడే కదలకుండా ఉండిపోవాలి. బాల్ పట్టుకున్న పిల్లవాడు నిల్చున్న చోటునుంచే దాన్ని ఎవరో ఒకరి మీదకు విసరాలి. బాల్ తగిలిన వాళ్లకు ఒక 'ఎస్' అక్షరం వచ్చినట్లు. తర్వాత వాళ్లే బాల్‌ను కూడా పైకి విసరాల్సి ఉంటుంది. అలా ఎవరికైతే ముందుగా ఎస్‌పియూడి అక్షరాలు వస్తాయో వాళ్లు ఓడిపోయినట్లు మిగిలిన వాళ్లు ఆటను కొనసాగిస్తారు! ఈ ఆటవల్ల పిలల్లో మెంటల్ అలర్ట్‌నెస్ అలపడుతుంది. ▫

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్: Cheli@vaartha.com

# తెర

## 'ఆత్మకథ' టైటిల్ ట్రైలర్ లాంచ్



దర్శకత్వంలో రానున్న చిత్రం ఆత్మ కథ యాన్ అన్ టోల్డ్ స్టోరీ. సినీ ప్రముఖులు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేతుల మీదగా ఈ చిత్ర టైటిల్, అలాగే ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. జెమిని సురేష్ హీరోగా రూప హీరోయిన్‌గా చేయగా 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వి, సమ్మెట గాంధీ, షకలక శంకర్, తాగుబోతు రమేష్, ధనరాజ్, నాగ మహేష్, బలగం విజయ లక్ష్మి, శ్రీనివాస్ నాయుడు తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ గుండ్రెడ్డి మాట్లాడుతూ... 'నేను ఇతర భాషలలో కూడా సినిమాలు చేశాను. ప్రతి సినిమాకు నా వెనుక ఉండి నన్ను సపోర్ట్ చేస్తూ వచ్చిన వ్యక్తి మా అన్నయ్య ప్రసన్న. చెప్పిన బడ్జెట్‌లో ఒక సినిమా చేశాను అంటే దానికి ఎంతో మంది సహకారం ఉండటం వల్లనే. అలాగే చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో నాకు ఎంతో సహాయం చేసిన వ్యక్తి రామకృష్ణ అన్నయ్య. ఈ చిత్ర నిర్మాత మా ఇంటి ఓనర్, ఆయన కుమారుడే ఈ సినిమాకు సంగీతాన్ని అందించారు. తెలుగు చిత్ర నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ...'వారాహి ఎంటర్టైన్మెంట్స్ వస్తున్న ఆత్మకథ చిత్రం ఒక సామాన్యుడిది. దర్శకుడు శ్రీనివాస్ తమ పిల్లలు కూడా ఇదే ఇండస్ట్రీలో ఉండటంతో వారి సహాయంతో నిర్మాతకు బడ్జెట్ పెరగకుండా ఈ సినిమాకు ఎంతో బడ్జెట్ తగ్గించి వేడి చేశారు. నటుడు కెవి ప్రదీప్ గారు మాట్లాడుతూ... ఈ కార్యక్రమంలో పాల్గొనడం, అందరిని కలవడం చాలా సంతోషం. నటుడు సమ్మెట గాంధీ మాట్లాడుతూ... ఈ కార్యక్రమానికి వచ్చిన దర్శకులు నాకు కథ చెప్పినప్పుడు ఆ కథలో ఆత్మ నేను అని చెప్పినప్పుడు సినిమాలో నేను కనిపిస్తానా అనుకున్న కాని సినిమా అంతా నా చుట్టూ తిరుగుతుంది అని సంతోషించాను.

## చిరుబాబీ 2 /చిరు 158, షూటింగ్ ప్రారంభం



మెగాస్టార్ చిరంజీవి, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లి క్రేజీ కాంబినేషన్ లో వచ్చిన వాల్తేర్ వీరయ్య సంచలనాత్మక మాస్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ ద్వయం మరో భారీ ప్రాజెక్ట్ చిరుబాబీ2 / చిరు158తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె నారాయణ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. కన్నడ, తమిళ, హిందీ భాషల్లో పలు భారీ ప్రాజెక్టులను అందించిన తర్వాత, కేవీఎన్ ప్రొడక్షన్స్ వారి తొలి తెలుగు చిత్రం ఇది. ఇప్పటికే వరుస అప్డేట్స్‌తో భారీ అంచనాలు సృష్టించిన ఈ చిత్రం నేడు ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, నాగబాబు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఈ కార్యక్రమం మరింత వైభవంగా మారింది. ఈ మెగా త్రయం వేదికను పంచుకోవడం అభిమానులకు కనులవిందు చేసింది. పవన్ కళ్యాణ్ క్లాప్‌బోర్డ్ కొట్టగా, సుష్మిత కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. వి.వి. వినాయక్ ఫస్ట్ షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. బి. గోపాల్, కోదండరామి రెడ్డి, నాగబాబు చిత్ర బృందానికి స్క్రిప్ట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నుంచి లోహిత్ తన బృందంతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## 'డేవిడ్ రెడ్డి' మూవీ టీజర్ రిలీజ్



ఈ దసరాకు గ్రాండ్ పాన్ ఇండియా రిలీజ్ కు వస్తున్న మూవీ 'రా కింగ్' మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'డేవిడ్ రెడ్డి'. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్ పై నల్లగంగుల వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమా రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కుతోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో రూపొందుతున్న ఈ చిత్రం ఈ దసరా పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు 'రా కింగ్' మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా డేవిడ్ రెడ్డి సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే 1897 నుంచి 1920 మధ్య బ్రిటీష్ పాలనా కాలం నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమాలోని ప్రతి విజువల్, ప్రతి షాట్, నటీనటుల ఎంపిక ఇలా...అన్ని విషయాల్లో హై క్వాలిటీ మేకింగ్ వ్యాల్యూస్ కనిపిస్తున్నాయి. మహాత్ముడి అహింసా మార్గానికి భిన్నంగా హింసా మార్గాన్ని ఎంచుకుంటాడు డేవిడ్ రెడ్డి. అమాయక భారతీయుల్ని హింసిస్తున్న ఆంగ్లేయులపై ప్రతి దాడులు చేస్తూ వారికి దడ పుట్టిస్తాడు. దేశంలో నెహ్రూ, బోస్ వంటి అగ్ర నాయకులు డేవిడ్ రెడ్డి గురించి తెలుసుకుంటూ ఉంటారు. మరోవైపు డేవిడ్‌రెడ్డి రూపంలో తమ సామ్రాజ్యానికి పొంచి ఉన్న ప్రమాదం గురించి లండన్ లోని బ్రిటీష్ ఇంటెలిజెన్స్ వార్ రూమ్‌లో చర్చలు జరుగుతుంటాయి. 50 బెటాలియన్లలోని 2 వేల మందిని ఒంటరిగా ఎదుర్కొన్న డేవిడ్ రెడ్డి సాహసం, దేశాన్ని మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్న అతని వ్యక్తిత్వం బ్రిటీషర్స్‌ను ఆకర్షిస్తుంది. డేవిడ్‌రెడ్డిని తమ కోసం పనిచేసేలా ఒప్పించాలని బ్రిటీషర్స్ ప్లాన్ చేస్తారు.

## 'ఐ యామ్ గేమ్' ఆగస్టు 20న వరల్డ్ వైడ్ రిలీజ్

దుల్కర్ సల్మాన్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'ఐ యామ్ గేమ్' రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 2026 ఆగస్టు 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్ల లో విడుదల కానుంది. ప్రస్తుతం డబ్బింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దుల్కర్ సల్మాన్‌కు చెందిన వే ఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లొకేషన్ల లో చిత్రీకరించిన ఈ సినిమాకు నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్నారు. వే ఫారర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ సంయుక్తంగా నిర్మిస్తుండగా, షహబాస్ రషీద్, ఆదర్శ్ సుకుమారన్ కథా రచన అందించారు. మలయాళ సినీ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కుతున్న చిత్రాల్లో ఒకటిగా ఐ యామ్ గేమ్ నిలవనుంది. ఈ చిత్రంలో దుల్కర్ సల్మాన్ అల్ట్రా స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారు. తన కెరీర్‌లో ఇదే అత్యంత స్టైలిష్ మూవీ అని దుల్కర్ ఇప్పటికే వెల్లడించారు. 'లోకా' బ్లాక్‌బస్టర్ తర్వాత వే ఫారర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న తదుపరి భారీ ప్రాజెక్ట్ ఇదే. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్,



సెకండ్ లుక్ పోస్టర్లు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన తెచ్చుకున్నాయి. ఇదే దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో 40వ చిత్రం కావడం విశేషం.

## బి.ఎ. రాజు 5వ వర్ధంతి నివాళి



చిత్ర పరిశ్రమతో పాటు అభిమానులు సైతం బీఏ రాజు స్ఫూర్తివంతమైన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటున్నారు. మే 21న ఆయన అయిదవ వర్ధంతి సందర్భంగా తెలుగు చలనచిత్ర పరిశ్రమపై ఆయన వేసిన చెరగని ముద్రను గుర్తు చేసుకుందాం. నలభై ఏళ్లకు పైగా సాగిన కెరీర్‌తో బీఏ రాజు గారు ఒక గొప్ప మార్గదర్శకుడిగా నిలిచారు. ఫిల్మ్ జర్నలిస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్, మ్యాగజైన్, వెబ్‌సైట్ హెడ్, నిర్మాతగా ఆయన ఎనలేని సేవలు అందించారు. లెజెండరీ సూపర్ స్టార్ కృష్ణ కి పీఆర్‌ఓగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, అద్భుతంగా పబ్లిసిటీ బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రముఖ ఫిల్మ్ జర్నలిస్ట్‌గా ఎదిగి, సూపర్ హిట్ వీక్లీ, క్రేజీ వరల్డ్ వంటి పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. సినిమా పట్ల ఆయనకున్న అంకితభావం, అభిరుచి ప్రతి దశలోనూ కనిపించాయి. జర్నలిజానికే పరిమితం కాకుండా సూపర్ హిట్ ఫ్రెండ్స్, ఆ తర్వాత ఆర్జే సినిమాస్ బ్యానర్ల పై నిర్మాతగా మారారు. ప్రేమలో పవని కళ్యాణ్, చంటిగాడు, లవ్లీ, వైశాఖం వంటి గుర్తుండిపోయే చిత్రాలను అందించారు. తన సతీమణి, దివంగత బి.జయతో కలిసి నిర్మించిన చిత్రాలు ప్రేక్షకుల హృదయాలకు చేరువయ్యాయి. కథ చెప్పడంలో, సినిమా నిర్మాణంలో ఆయనకున్న నైపుణ్యం వాటిలో స్పష్టంగా కనిపిస్తుంది. తన కెరీర్‌లో ఎందరో ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకున్నారు. దర్శకులు, నటులు, టెక్నీషియన్లకు విలువైన సలహాలు, మద్దతు ఇచ్చారు. ఆయన వృత్తి నిబద్ధత, నిజాయితీ ఆయనకు అందరి గౌరవాన్ని సంపాదించిపెట్టాయి. సినిమాపై ఆయనకున్న విస్తృతమైన జ్ఞానం, అంకితభావం స్ఫూర్తిని ఇస్తాయి.

## జులై 3న 'నాగబంధం' విడుదల

జూలై 3న 'నాగబంధం' విడుదల విరాట్ కర్ణా, అభిషేక్ నామా, నిక్ స్టూడియోస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'నాగబంధం' నార్త్ ఇండియాలో జూలై 3నజీ స్టూడియోస్ ద్వారా గ్రాండ్ రిలీజ్ అభిషేక్ నామాదర్శకత్వంలో, విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో ఘనంగా విడుదల కాబోతున్న నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్స్ట్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ మరో క్రేజీ అప్డేట్ ఇచ్చారు. నార్త్ ఇండియాలో అన్ని భాషల థియేట్రికల్ రిలీజ్ పార్ట్నర్‌గా ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ చేతులు కలిపింది. ఎపిక్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతున్న 'నాగబంధం'ను నార్త్ ఇండియాలో అన్ని భాషల్లో జీ స్టూడియోస్ గ్రాండ్‌గా విడుదల చేయనుంది. ఈ సినిమాలో నభానటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతిబాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు



కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది.

## త్రైత సిద్ధాంతం అనగా కర్మయోగం భక్తయోగం



రామభద్రపురం, మే 21 ప్రభాత వార్త: వేసవి సెలవుల సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బొబ్బిలి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈరోజు రామభద్రపురం మండలంలోని పాడివానవలస, కొత్త రేగ, పాత రేగ, దుప్పల పూడి,నర్సాపూరం, ఆరిక తోట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం ను ఇంటింటా నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తన కాల జ్ఞానం లో తాడిపత్రి లోని ప్రబోధాశ్రమము ఉన్నత మైన జ్ఞానం కలిగినదని చెప్పారు. మహాదేవతలు అందరూ అట్టి ఆనందాశ్రమం లో ఆనందగురువు వద్ద నే ఉన్నారు అని చెప్పారు అని అన్నారు. ప్రబోధాశ్రమం నుండి వెలువడిన త్రైత సిద్ధాంతము గొప్పది అని పరోక్షంగా చెప్పారు.త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం ను తెలియజేస్తుంది., ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నాము అని , మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలు గా విభజింపబడి ఉన్నాడని – జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు, భగవద్గీత లో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయి అని తెలిపారు.కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి బొబ్బిలి కమిటీ అధ్యక్షులు, సభ్యులు సి.హెచ్. అప్పల నాయుడు శంకర్రావు, సత్యనారాయణ, వెంకటరావు,ఆదిలక్ష్మి, గణపతి, సత్యవతి, పైడి రాజు, సుహాసిని పాల్గొన్నారు.

## 14 కిలోల గంజాయి పట్టివేత, ఇద్దరు అరెస్ట్

చీపురుపల్లి , మే 21 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు, చీపురుపల్లి డిఎస్పి ఎస్ రాఘవులు ఆధ్వర్యంలో చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకరరావు , బుదరాయవలస, గరివిడి గుర్ల ఎస్సై గార్లు, వారి సిబ్బంది ,ఈగల్ టీం ,డాగ్స్ స్క్వాడ్ మరియు జిఆర్పి పోలీసు వాళ్లతో కలిసి, గంజాయిని అరికట్టడానికి ట్రైన్ చెకింగ్ కార్యక్రమం గురువారం కండక్ట్ చెయ్యగా, అందులో భాగంగా బ్రహ్మపుర నుండి విశాఖపట్నం వెళ్తున్న ప్యాసింజర్ ట్రైన్ నెం. 58531 చీపురుపల్లి లో ఎక్కి తనిఖీ చేయగా మార్గమధ్యంలో నెల్లిమర్ల చేరే సరికి 11వ నెంబర్ భోగి లో ఇద్దరు అనుమానితులను పట్టుకోవడం జరిగింది హరి డీఎస్పీఎస్ రాఘవులు గురువారం నాడు విలేకరులకు వివరించారు. వాళ్ల వద్ద మూడు బ్యాగులు సీటు కింద గుర్తించగా ఆ బ్యాగులు ఎవరని అడగగా, వారితో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, ఆ బ్యాగులో వారివే అని నిర్ధారణ చేసుకొని పరిశీలించగా ఆ బ్యాగలను చెక్ చేయగా, బ్యాగులో బ్రౌన్ కలర్ రంగు కలిగిన, 14 ప్యాకెట్లు దొరికాయ్ అన్నారు. వాటిని ఓపెన్ చేసి వాసన చూడగా గంజాయి గా గుర్తించమన్నారు. తదుపరి గంజాయి తరలిస్తున్న వ్యక్తులు ఎల్దోసి పార్ట్ మార్క్ జోసఫ్ ఒకరిగా, 21 సంవత్సరాలు కల ఎర్నాకులం కేరళ వ్యక్తిగా సైబర్ ఫారిన్ సిక్స్ సెన్స్ చదువుతున్నట్లు గుర్తించమన్నారు. రెండో వ్యక్తి దేవానంద కోడవరం సన్నాఫ్ సంతోషి 21 సంవత్సరాలు కాసర్ఘాట్ జిల్లా, కేరళ , బీసీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నట్లు తమ పరిశీలన తెలిసిందని డీఎస్పీ వివరించారు. పై వ్యక్తులు ఇద్దరూ చెడు వ్యసనాలకు అలవాటపడి తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి వ్యాపారం చేద్దామని బరంపురం చెందిన రాహుల్ అనే వ్యక్తి వద్ద పై గంజాయిని కొనుగోలు చేసినట్లు డి.ఎస్పీ ఎస్ రాఘవులు తెలిపారు వారి వద్ద నుండి మొత్తం 14 గంజాయి ప్యాకెట్లలో సుమారు 14 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, ఇద్దరు నిందితులను వారి వద్ద ఉన్న 2 సెల్ ఫోన్స్ ను, తదుపరి దర్యాప్తు నిమిత్తం అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించిన ఇద్దరు నిందితులను స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి విచారణ నిమిత్తం పలాస జిఆర్పీ పోలీసులకు అప్పగించడం జరిగినది హనీ డిఎస్పి వివరించారు.ట్రైన్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఈ తనిఖీలు మరియు గంజాయి పట్టివేత చర్యలను చేపట్టిన పోలీసులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తారని జిల్లా ఎస్పీ ఏ ఆర్. దామోదర్ సారథ్యంలో నిరంతరముగా మత్తు పదార్థాల రవాణా అమ్మకాలు వాడకాల పైన నిఘాపిస్తామని ఈ సందర్భంగా డిఎస్పి వివరించారు..

## నేలమట్టమైన మామిడి.. రోధిస్తున్న రైతన్నలు



వేపాడ, మే 21 , ప్రభాతవార్త:– వేపాడ మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన ,పెను గాలులతో కోత దశలో ఉన్న మామిడి పంట నేలమట్టమయింది. దీంతో లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని పలువురు రైతులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో మామిడి పూత ఆశాజనకంగా రావడంతో లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టామని తేనె మంచు, పొగ మంచు తమ పాలిట శాపంగా మారాయని వాపోయారు. మంచు ప్రభావంతో 50 శాతం పూత రాలిపోయిందని మిగిలిన పూతతో నష్టాలు రాకపోయిన పెట్టుబడులు వస్తాయని ఆశించామని ప్రస్తుతం ప్రకృతి తమపై కన్నెర్ర చేసి వడగళ్ల వాన, పెనుగాలులు రూపంలో చెట్లను ఉన్న కాయలన్నీ నేలకు రాలిపోయాయని దీంతో ఆర్థికంగా నష్టపోయామని పలు గ్రామాల రైతులు ,వ్యాపారులు గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి మామిడి రైతులకు పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

## ఉత్తరావల్లిలో టిబి పరీక్షలు



మెరకముడిదాం, మే 22, ప్రభాతవార్త : వంద రోజులు టీబీ వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా మెరకముడిదాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఉత్తరావల్లి గ్రామంలో టీబీ పరీక్షలు మరియు ఎక్స్రేలు హ్యాండ్ హెడ్ ఎక్స్రే మిషన్ ఉపయోగించి గ్రామంలో ఉన్న ప్రజలందరికీ ఉచితముగా వైద్యాధికారి కె. అజిత్ బాబు ఆధ్వర్యంలో టీబీ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా టి.బి.యూనిట్ సభ్యులు కె.గౌరీ శంకర్ మరియుఆర్ . సంజిత్ ఎక్స్రే మిషన్ ద్వారా ఎక్స్రే పరీక్షలు జరిపారు. ఉత్తరవల్లి గ్రామంలో 14 సంవత్సరాలు పైబడిన, హైరిస్క్ లో ఉన్నటువంటి వ్యక్తులకు 150మందికి ఎక్స్ రే లు తీయడం జరిగినది. తదుపరి హై రిస్క్ గ్రామాలైన, మెరక ముడిదాం 22 వ తేదీన, పులుగుమ్మి 23 వ తేదీన, ఊటపల్లి 25 వ తేదీన గాదెల మర్రి వలస 26. వ తేదీన ఎక్స్ రే పరీక్షలు నిర్వహించ బడునని ఈ అవకాశం ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియ చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఓ ఆర్ రామారావు, హెల్త్ సూపర్వైజర్ జయలక్ష్మి ఎమ్మెల్యే లక్ష్మీ చంద్రిక, ఏఎన్ఎం జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలు కీలకం



గరివిడి, మే21, ప్రభాత వార్త: పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలే కీలకమని చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా మహిళా నాయకురాలు డాక్టర్ బొత్స అనూష అన్నారు. గరివిడి లోగల శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ క్యాంప్ కార్యాలయంలో గురువారం గరివిడి పట్టణ,మండల గ్రామ క్లస్టర్,డివిజన్ ఇంచార్జి లు,బూత్ ఏజెంట్లు కి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అనూష మాట్లాడుతూ బూత్ స్థాయిలో ఇంటి ఇంటి కి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కొత్త ఓటర్లు నమోదు, తప్పులు సవరణ,తదితర అంశాలపై ప్రతీ కార్యకర్త బాధ్యత గా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క ఓటు మిస్ కా కూడదన్నారు.కార్యక్రమంలో చీపురుపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు,జిసిసి మాజీ చైర్పర్సన్ శోభా స్వాతి రాణి, మండల వైకాపా అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వర రావు, మండల వైకాపా నాయకులువాకాడ శ్రీనివాసరావు, ఎలకల అప్పలనాయుడు, గుడివాడ శ్రీరాములు నాయుడు, యడ్ల అప్పారావు,బుర్లే నరేష్,లెంక శ్రీరాములునాయుడు, బూడి శ్రీరాములు నాయుడు,పి.కుమార్,బమ్మిడి కార్తీక్,బొంపల్లి వెంకట రావు,పొన్నాడ కుమార్ , తదితరులు పెక్కు సంఖ్యలో పాల్గొన్నారు.

## పిడుగుపడి ఒకరు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

### సోంపురంలో అలముకున్న విషాదం



వేపాడ, మే 21 ,ప్రభాతవార్త: వేపాడ మండలం సోంపురం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం పిడుగు పడి ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అప్పల ఈశ్వర చెరువు వద్ద ఉపాధి హామీ పనులు ముగించుకొని గ్రామానికి తిరిగి వస్తుండగా ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఈ సమయంలో పొలం మధ్యలో అకస్మాత్తుగా పిడుగు పడటంతో జొన్నపల్లి సన్నిబాబు (63) అక్కడికక్కడే మృతి చెందారు. గోరుపోటు దేవి (36) తీవ్రంగా గాయపడగా, ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణం పిడుగు ప్రభావంతో సగం వరకు కరిగిపోయింది. ఆమె వద్ద ఉన్న సెల్ఫోన్ కూడా కొంతమేర కాలిపోయింది. అలాగే గొర్రెపోటు చిన్నమ్మ (48)కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. పిడుగుపాటుతో గాయపడిన వారిని చూసిన గొర్రెపోటు అంజలి వెంటనే ధైర్యంగా స్పందించి గొర్రెపోటు దేవి శరీరంపై వస్తున్న మంటలను ఆర్పి ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు స్థానికులు తెలిపారు.తీవ్రంగా గాయపడిన గోరుపోటు దేవి, గొర్రెపోటు చిన్నమ్మలను స్థానికులు 108 వాహనం ద్వారా శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

## ఉపాధి హామీ చట్టం మహాత్మా గాంధీ పేరుతో కొనసాగాలి



పాచిపెంట ,మే 21 ప్రభాత వార్త: ఉపాధి హామీ పథకం పాత పద్ధతిలో కొనసాగాలని ఆదివాసి గిరిజన జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పాచిపెంట 1, సచివాలయం, పంచాయతీ కార్యదర్శి దీపక్ గిరిజన సంఘం ఆదివాసి గిరిజన సంఘం నాయకులు జన్ని రామయ్య వినతిపత్రం అందించారు. సచివాలయం టుకార్యదర్శి అలాగే వినతి పత్రాలు అందజేశారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రెండు పూటలు పనులు రద్దు చేయాలని పనిచేసిన చోట మౌలిక సదుపాయాలు కల్పించాలని గుణపాలు పారలు మెడికల్ కిట్లు పంపిణీ చేయాలని మంచినీరు మజ్జిగ సరఫరా చేయాలని సంవత్సరానికి ?200 రోజులు పనులు ఇవ్వాలని 600 కూలి వేతనం చెల్లించాలని కోరారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రజా సంఘాలు ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి సాధించుకున్నటువంటి హక్కు అటువంటి హక్కును కాలరాస్తూ మహాత్మా గాంధీ పేరుతో ఉన్నటువంటి చట్టాన్ని మార్చాలని కేంద్ర నరేంద్ర మోడీ చూడడం సరికాదని అన్నారు. పాత పద్ధతుల్లోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరారు . భవిష్యత్తులో ఉపాధి చట్టాన్ని పగడ్బందీగా అవినీతికి అవకాశం లేకుండా నడపాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి ఆదినారాయణ కే చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వాడకంపై రైతులకు అవగాహన



దత్తిరాజేరు మే 21 ప్రభాతవార్త : మండల పరిధిలో గల మరడాశీగ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యూరియా పై రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని జిల్లా వనరుల కేంద్ర అధికారి పి నిర్మల వ్యవసాయ అధికారి గోవిందమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలకరి వర్షాలకు నవధాన్యాలు పచ్చి రొట్టి వే యటం వలన భూములు సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందని వాతావరణ మార్పులు ఏలినినో ప్రభావానికి చక్కటి పరిష్కారం వర్షాలు మొదటి దఫాగా నత్రజని బాశ్వరం మరియు పొటాష్ కలిపి కాంప్లెక్స్ ఎరువులు వేసుకున్నట్లయితే మొక్కకి కావలసిన పోషకాలు అందవటంతో పాటు పోటాస్ వేయడం వల్ల మొక్కకి అంతర్గత శక్తి పెరిగి పచ్చపురుగు పీక పొరుగు ఉధృతి తగ్గి రైతుకు పురుగు మందులు పిచికారి చేసే ఖర్చు తగ్గుతుంది అదేవిధంగా రెండు విడతలుగా నానో యూరియా పిచికారి చేసుకోవాలి. ధర ప్రకారం తక్కువగా ఉండి 100% మొక్క నానా యూరియాను తీసుకుంటుంది మూడో విడతగా యూరియా మరియు పటాస్ చిరుపాటు దశలో వేసుకోవాలి అంతేకాకుండా రైతు నీటి స్థాయిలో మల్టీకే పౌడర్ ఒక కేజీ ఒక ఎకరానికి పిచికారి చేసుకున్న కూడా రైతుకు యూరియా మరియు పోటాస్ బస్తాల పై పెట్టి బడి 2000 రూపాయల వరకు ఆదా అవుతుంది మండలంలో ఉన్న వివిధ పంటల సాగు చేసే రైతులందరూ ఈ విధంగా యూరియా కార్డ్స్ తీసుకోవాలని కోరడం జరిగింది గ్రామ వ్యవస్థాయ నాయకులందరూ రైతు యొక్క వివరములు కార్డుల గురించి రైతుకు అందజేస్తారు కనుక రైతులందరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వ్యవసాయ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## మహానాడుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలి



దత్తరాజేరు, మే 21, ప్రభాతవార్త: మండలంలో ఉన్న టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు 27 28 29 తేదీల్లో జరగబోయే మహానాడు కార్యక్రమానికి తరలిరావాలని క్లస్టర్ ఇంచార్జ్ బోడసింగి సత్తిబాబు తెలిపారు . గురువారం దత్తిరాజేరు టిడిపి పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి మొత్తం 30 నుంచి 40 మంది వరకు తగ్గకుండా తీసుకురావాలని కార్యకర్తలకు సూచించారు మహానాడు ఒక పండుగలా జరిపిస్తారని వచ్చిన కార్యకర్తలు అభిమానులు అందరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తారని తెలుగు ప్రజల గుండెల్లో స్థిర స్థాయిలో నిలిచే పార్టీ తెలుగుదేశం పార్టీ అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ పండక్కి ప్రతి ఒక్కరు రావాలని కోరారు . కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మిత్తిరెడ్డి ఈశ్వరరావు వంగపండు కృష్ణ బండి కృష్ణ గంట విజయలక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

## ఎండ తీవ్రంగా ఉంది అవసరమైతేనే బయటికి రావాలి

కురుపాం, మే21, ప్రభాతవార్త : రానున్న 15 రోజులు ఎండ తీవ్రత ఉన్నందున అవసరమైతేనే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలనీ ఎం పి డి ఓ జె ఉమా మహేశ్వరీ, తహసీల్దార్ కె. జయ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు తాత్కాలిక షెడ్ ( నీడ కోసం )మెడికల్ కిట్స్, ఓ ఆర్. ఎస్ కలిపిన నీరు =కుండతో ) అందుబాటులో ఉంచలని ఉపాధిహామీ సిబ్బందికి ఆదేశించమన్నాడు. ప్రతి వేతన దారుడు పనికి వచ్చేటప్పుడు 3 లీటర్ల మంచినీరు తెచ్చుకోవాలన్నారు.సంత, బస్టాండ్, ప్రధాన కూడల్లో త్రాగు నీరు సదుపాయం కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, వి ఆర్ ఓ లకు ఉమా మహేశ్వరీ, తహసీల్దార్ జయ సూచించారు.

## వడదెబ్బతో యువకుడి మృతి

చీపురుపల్లి, మే 21 ప్రభాతవార్త : చీపురుపల్లి పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన లక్కిడాపు రఘు (30) అరేయ్ యువకుడు గురువారం తీవ్ర ఎండ తాపం వలన వడదెబ్బకు గురై మృతి చెందాడు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చెప్పుల షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రఘు గురువారం నాడు తీవ్ర ఎండ తాపానికి గురికావడంతో అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేసరికే ఆయన మృతి చెందాడు. మృతుడికి వివాహం కాగా భార్య మాత్రమే ఉన్నారు. స్థానిక ఎంపీటీసీ సభ్యులు దాలయ్య అవసరమైన సహకారాలను అందజేస్తున్నారు.

## నాగార్జున ఆడ.. మగ తేడా మాట్లాడొద్దు..



చీపురుపల్లి మే 21 ప్రభాతవార్త.. మా నాయకుడు ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కోసం డిసిసిబి చైర్మన్ నాగార్జున ఆడా మగ తేడా కానీ మాటలు ఆడొద్దు అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం వలి రెడ్డి శ్రీనివాస నాయుడు మీసాల వరహాల నాయుడు తదితరులు హెచ్చరించారు. గురువారం నాడు చీపురుపల్లిలో వారు పాత్రికేయులతో మాట్లాడుతూ విదేశాల్లో చదువుకుంటున్న నాగార్జునకు కనీస జ్ఞానం లేకుండా పరిపాక్వత లేకుండా మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినాయకులను విమర్శించి మాట్లాడితే చంద్రబాబు నాయుడు ఉన్నత పదవులు కట్టబడతారేమోనన్న ఉద్దేశంతో అర్థం లేని ఆరోపణ చేయడం సబబు కాదని హెచ్చరించారు. చీపురుపల్లి శాసనసభ్యులు సొంత పెదనాన్నే నాగార్జునను తుంగలో తొక్కుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. ప్రజల పక్షాన కూటమి ప్రభుత్వం ఆరాచకాలను ఎండగడుతున్న వైసిపి నేతలపైన అర్థం లేని ఆరోపణలు చేసుకోవడం మానుకోవాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. వైసిపి పాలనలో ప్రజలకు జరిగిన సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చేసిన కార్యక్రమాల పైన ప్రజలు తేడాను గమనిస్తున్నారని సూచించారు. తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుతో పట్టించిన కూటమి పాలకులను ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు మీసాల వరహాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాళ్లు తేలి ప్రమాదకరంగా రోడ్డు

డెంకాడ మే 21 ప్రభాతవార్త : మండలంలోని గొడిపాలెం నుంచి పేడాడ మీదుగా బంటుపల్లి వెళ్లే రహదారిలో రాళ్లు తేలి ప్రమాదకరంగా మారింది. బోగాపురం నుంచి విజయనగరం వెళ్లేందుకు నిత్యం వందల సంఖ్యలో వాహన చోధకులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. అక్కడ గుంతలు ఎక్కువగా ఉండడంతో వాహనదారులు గాయాల పాలవుతున్నారు.ఈ విషయమై జేఇ వెంకటేష్ వివరణ కోరగా మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## యస్ సొసైటీ ఆధ్వర్యంలో వారపు సంతలో మజ్జిగ పంపిణీ

కురుపాం, మే21, ప్రభాతవార్త : కురుపాం వారపు సంతలో యస్ సొసైటీ స్వచంద సంస్థ ప్రతినిధులు గురువారం మజ్జిక పంపిణీ చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీ లకు చల్లని మజ్జిక అందిం చటం వలన పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా దురుబిలి సెంటర్ , కురుపాం వారపు సంతలో మంచి నీరు, మజ్జిక పంపిణీ చేసినట్లు తెలిపారు. మరికొంత మంది దాతలు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది మల్లేష్ , గణేష్, గున్నమ, చంద్రకళ నేస్తం సంఘం ప్రతినిధి గీత రాణి పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## ఎల్.కోటలో 'గ్రోమోర్' షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే కోళ్ల



లక్క వరపు కోట, మే 21 ప్రభాత వార్త : మండల కేంద్రమైన ఎల్.కోట జంక్షన్ లో నూతనంగా ఏర్పాటు చేసిన 'గ్రోమోర్' రిటైల్ అవుట్లెట్ (షాప్) గురువారం ఘనంగా ప్రారంభమైంది. కోరమండల్ ఇంటర్నేషనల్ ఏరియా మేనేజర్ మహేష్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనం గావించి ఈ నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రైతాంగానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పాదకాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఒకే ప్లాట్ఫారమ్ ద్వారా రైతులకు అవసరమైన అత్యాధునిక ఎరువులు, పురుగుమందులు, అధిక దిగుబడినిచ్చే విత్తనాలతో పాటు నిపుణుల ఉచిత సలహాలు కూడా ఈ కేంద్రం ద్వారా అందడం వల్ల స్థానిక రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు ఇలాంటి ఆధునిక కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.రైతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి రైతుకూ ప్రభుత్వ పథకాలు, ఆధునిక సాంకేతికత అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఎమ్మెల్యే లలిత కుమారికి కోరమండల్ ఏరియా మేనేజర్ మహేష్ మరియు ప్రతినిధులు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు, కోరమండల్ సంస్థ సిబ్బంది, డీలర్లు, స్థానిక రైతు సోదరులు పాల్గొన్నారు.

## నాగావళి నది ఇసుక లొల్లి..?

### భూ యజమానుల ఫిర్యాదుతో బయటపడుతున్న ఇసుకాసురుల బాగోతం...!



కొమరాడ మే 21 ప్రభాతవార్త: కొమరాడ మండలంలో నాగావళి నది లో ఇసుక కాసులు కురిపిస్తుంది. దీంతో జిల్లాలో రాజకీయ నాయకులు, కొంతమంది అధికారుల కన్ను నాగవల్లి నదీ తీర ప్రాంతంలో ఉన్న ఇసుకపై పడినట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగానే అక్రమ మార్గంగా ఇసుకను తరలించుకుపోయి కాసులు పోగు చేసుకోవాలన్న ఆలోచనతోనే కొంతమంది అక్రమార్కులు జిల్లాలో కొంత మంది అధికారులను ప్రసన్నం చేసుకొని అక్రమ మార్గంగా అనుమతులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొమరాడ మండలం రామభద్రపురం సమీపంలో కోరిశిల గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 54–2ఎ, 54–2వ, 54–2ష్ట నందు గిరిజనులకు ప్రభుత్వం గతంలో పట్టాలను మంజూరు చేసింది. ప్రస్తుతం ఆ భూములలో నాగావళి నదికి వరద ప్రవాహం వల్ల వచ్చిన ఇసుక భారీ స్థాయిలో నిల్వలు నిండి ఉన్నాయి.అయితే ఆ ఇసుక తరలించుకునేందుకు గాను అనుమతులు పొందినట్లు కొంతమంది చెప్తున్నట్లు బాధిత రైతులు తెలుపుతున్నారు. ఈ భూములకు సంబంధించిన వన్ బీ లు పాస్ పుస్తకాలు కూడా తమ వద్ద ఉన్నాయని తమ అనుమతులు లేకుండా రెవెన్యూ, నీటిపారుదల శాఖ, మైనింగ్ అధికారులు సంబంధిత ఇసుక అక్రమార్కుల తో చేతులు కలిపి తమ పొలంలో ఉన్న ఇసుకను మా అంగీకారం లేకుండా ఎలా అనుమతులు మంజూరు చేశారంటూ కొండ గొర్రె కంబ , పువ్వల రామయ్య భార్య లక్ష్మి, పువ్వల ఆదయ్య లు వారి వారసులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమే జిల్లా కలెక్టర్కు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందించలేదని ఆరోపిస్తున్నారు. అయితే ఇటీవల రాష్ట్ర నీటిపారుదల శాఖ మాత్యులు, ముఖ్యమంత్రి కార్యాలయాల్లో కూడా ఫిర్యాదు ఇచ్చినట్లు బాధితులు చెపుతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేల్కొని క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి తగిన న్యాయం చేయాలని బాధిత గిరిజన రైతులు కోరుతున్నారు మరి మన ఉన్నతాధికారులు ఎ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరి...!

## హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ప్రోగ్రాంలో పోలీస్‌కు ధ్యాన శిక్షణ



సాలూరు, మే21, ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ అండ్ రూరల్ సర్కిల్ పోలీస్ వారు గురువారం ఉదయం లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో హార్ట్ఫుల్నెస్ మెడి టేషన్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఏడు రోజులు పాటు జరిగే ఈ మెడిటేషన్ ప్రోగ్రాంలో మానసిక ప్రశాంతత,ఒత్తిడి నియంత్రణ ధ్యానం ద్వారా ఆరోగ్యపరిరక్షణ ఇంక పోలీస్ విధినిర్వహణలో ఏకాగ్రత గురించి అవగాహన కల్పిస్తారు.అందులో భాగంగా మెడిటేషన్ ట్రైనర్లు జి శ్రీధర్ నాయుడు ఇంకా రామ చంద్ర రెడ్డి ధ్యాన పద్ధతులపై శిక్షణ అందించడమే కాకుండా, దానివల్ల కలిగే మానసిక,శారీరక ప్రయోజనాలు వివరించారు. టౌన్ సీఐ అప్పలనాయుడు రూరల్ సీఐ రామకృష్ణ ఇంకా ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కురుపాంలో కాలువల పూడికతీత పనులు



కురుపాం, మే21 ప్రభాత వార్త: కురుపాం మేజర్ పంచాయతీ స్వచ్ఛభారత్లో భాగంగా కా లువలు పూడిక తీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. గురువారం పంచాయితీ ఎజిక్యూట్ ఆఫీసర్ వెంకట్ నాయుడు ఆధ్వర్యంలో శోభ లతా దేవి కాలనీ ,గౌడ్ వీధి లలో పారిశుద్ధ్య కార్యక్రమంలో నిర్వహించారు. కాల్వలో పేరుకుపోయిన చెత్త మురుగును కార్మికులతో తొలగించారు. కాలువలు మూసుకుపోవడంతో దోమల వ్యాప్తి దుర్వాసన సమస్యలుతలెత్తుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పారిశుద్ధ్యత కార్యక్రమాలు చేపట్టినట్లు ఏ ఓ తెలిపారు. ప్రజలు చెత్తలను కాలువలలో వేయకుండా పరిశుభ్రత పాటించి సహకరించాలని ఆయన సూచించారు.

## పీఎం జన్మన్ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



పార్వతీపురం, మే 21, ప్రభాతవార్త : పివిటిజి (గిరిజన) ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీఎం జన్మన్' (పీవీ జీూచీపీూచీ) హౌసింగ్ స్కీం పనులను వేగవంతం చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్.వైశాలి అధికారులను ఆదేశించారు. గురువారం తన చాంబర్లో హౌసింగ్ శాఖ అధికారులతో కలిసి ఆమె ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గృహ నిర్మాణ పథకం ప్రస్తుత పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నిర్దేశించిన కాలపరిమితిలోగా లక్ష్యాలను అధిగమించాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను (ప్లాన్ ఆఫ్ యాక్షన్) అమలు చేయాలని, మండలాల వారీగా నిర్దేశించిన టార్గెట్లను అధికారులు బాధ్యతగా పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణే ప్రథమ కర్తవ్యం : ఎస్సై గణేష్



నెల్లిమర్ల, మే 21, ప్రభాతవార్త : సమాజంలో మహిళలకు రక్షణ ,భరోసా కల్పించడమే తమ ప్రథమ కర్తవ్యమని నెల్లిమర్ల ఎస్ఐ బి గణేష్ పేర్కొన్నారు. మండలంలోని కొండవెలగాడ లో బుధవారం రాత్రి డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మహిళలనుదేశించి మాట్లాడారు. సమాజంలో పురుషులతో పాటుగా స్త్రీలు సమానమేనని వారికి చట్టపరంగా అనేక రకాలుగా రక్షణ ఉందని, వారి మీద ఏదైనా దాడి జరిగినా, హింసాత్మక ఘటన జరిగినా మౌనంగా ఉండాల్సిన పనిలేదని బాధితులు వెంటనే పోలీసులకు తెలియజేస్తే వారికి భరోసాగా తాము నిలుస్తామని అన్నారు. ఆయా సంఘటనల్లో నిందితులకు శిక్ష పడే విధంగా చర్యలు చేపడతామని, మహిళలు అభద్రత భావం కి లోను కాకూడదని నిర్భయంగా వారి సమస్యలను పోలీస్ స్టేషన్ గాని లేదా 112 హెల్ప్ లైన్ లేదా 181 హెల్ప్ లైన్ కు ఫోన్ చేసి తెలియపరచవచ్చని సూచించారు. అలాగే ప్రతి ఒక్క మహిళ తమ ఫోన్లో శక్తి యాప్ ని డౌన్లోడ్ చేసుకొని యాప్ ద్వారా కూడా రక్షణ పొందవచ్చని ఈ సందర్భంగా ఎస్సై గణేష్ సూచించారు.

22-05pg10.qxd:22-05pg10.qxd 1/1/02 6:16 AM Page 1





# ఉప్పల్‌లో స్టార్ జట్ల ఉత్కంఠ పోరు

## ఆర్సీబీతో నేడు మ్యాచ్ * టాప్-2లో స్థానంపై సన్‌రైజర్స్ ఫోకస్

**హైదరాబాద్, మే 21(ప్రభాతవార్త క్రీడా ప్రతినిధి)**

ఉప్పల్ స్టేడియం వేదికగా నేడు మరో ఇంట్రెస్టింగ్ మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ప్లేఆఫ్‌కు చేరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. టాప్-2లో ప్లేస్ కోసం బెంగళూరుతో తలపడనుంది. సొంత గడ్డ, సొంత అభిమానుల అండగా బరిలోకి దిగుతున్న సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లో గెలుపొందడంపై ఫోకస్ పెట్టింది. ఇక 18పాయింట్లతోఉన్న ఆర్సీబీ ..ఈ మ్యాచ్‌లో నెగ్గితే టాప్ ప్లేస్ పటిష్టమవుతుంది. ఓడినా టాప్ టూలో వారి స్థానం దాదాపుగా ఖాయమైంది. ఎటొచ్చి సన్‌రైజర్స్‌కే ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. ఇక కోహ్లీ మానియాతో ఇప్పటికే ఉప్పల్ మ్యాచ్ టికెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

ఈ సీజన్‌లో సొంతగడ్డ ఉప్పల్ స్టేడియంలో ఆరేంజ్ టీమ్‌కు చక్కని రికార్డు ఉంది. ముఖ్యంగా రాత్రి మ్యాచ్‌లలో జరిగిన అన్ని మ్యాచ్‌ల్లోనూ ఎస్ఆర్‌హెచ్ గెలుపొందింది. ఓవరాల్‌గా హైదరాబాద్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌లలో నాలుగింటిలో విజయం సాధించగా, ఆ రెండు ఓటములు పగటి మ్యాచ్‌లలోనే ఎదురయ్యాయి. ఆర్సీబీతో జరిగే పోరులో కూడా ఈ రికార్డును అలాగే కొనసాగించాలని కోరుకుంటోంది. ఈ రెండుజట్లు మార్చి 28న తలపడినపుడు ఆర్సీబీ గెలుపొందింది. అప్పటికి ఇప్పటికీ ఎస్ఆర్‌హెచ్ మరింత పటిష్టంగా మారింది. కమిన్స్ రావడంతో బౌలింగ్ పటిష్టమైంది. సాకిబ్, హింగే, మలింగ, శివాంగ్ లు... ప్రత్యర్థి జట్లను చక్కగా కట్టడి చేస్తున్నారు. ఇక బ్యాటింగ్‌లో ఎదురేలేకుండా ఉంది. టాప్ ఆర్డర్ మొత్తం టాప్ ఫామ్‌లో ఉంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ సొంతగడ్డపై మరోసారి చెలరేగడానికి సిద్ధమయ్యారు.

ఆర్సీబీ కూడా ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో పటిష్టంగా ఉంది. ఎస్ఆర్‌హెచ్ లాగే ఆర్సీబీ టాప్ ఆర్డర్ కూడా పరుగుల వేటలో ఉంది. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో మెరిసిన వెంకటేష్ అయ్యర్‌తో పాటు కోహ్లీ, దేవదత్, టిమ్ డేవిడ్ చక్కని ఫామ్‌లో ఉన్నారు. ఛేజింగ్ కింగ్ కోహ్లీ టాప్ ఫామ్‌లో ఉండడం ఆర్సీబీకి కలిసొచ్చే అంశం. గాయంతో గత మ్యాచ్‌కు దూరమైన కెప్టెన్ రజత్ పాటిదార్.. ఈ మ్యాచ్‌లో ఆడనుండడం బ్యాటింగ్‌కు మరింత బలం. ఇక భువనేశ్వర్ కొత్త బంతితో ఆరంభంలోనే వికెట్లు అందిస్తున్నాడు. అదే కొనసాగితే ఎస్ఆర్‌హెచ్‌కు కష్టాలు తప్పవు. హేజిల్ వుడ్, కృనాల్, రసిఖ్, డఫీలతో ఆర్సీబీ బౌలింగ్ వైవిధ్యంగా ఉంది. ఎస్ఆర్‌హెచ్ టాప్ ఆర్డర్‌ను ఎంత త్వరగా పెవిలియన్‌కు చేర్చడంపైనే ఆర్సీబీకి విజయావకాశాలు ఉంటాయి.

### హెడ్ టు హెడ్ రికార్డు

ఆర్సీబీపై సన్‌రైజర్స్ బెటర్ రికార్డు కలిగి ఉంది. ఇరు జట్లు 27 మ్యాచ్‌ల్లో ముఖాముఖిగా తలపడగా.. సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో, ఆర్సీబీ 12 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

**సన్‌రైజర్స్ హైదరాబాద్ (అంచనా):** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా, స్మరణ్, నితీష్ కుమార్ రెడ్డి, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), శివాంగ్ కుమార్, ఈషాన్ మలింగ, సాకిబ్ హుస్సేన్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** ప్రఫుల్ హింగే

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (అంచనా):** వెంకటేష్ అయ్యర్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్ (కెప్టెన్), టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, రసిఖ్ సలామ్, జోష్ హేజిల్‌వుడ్; **ఇంఫాక్ట్ ప్లేయర్:** జాకబ్ డఫీ

# వ్యవస్థపై రగిలిన జ్వాల

## బ్యాడ్మింటన్‌లో బ్యాకప్ జీరో




**హైదరాబాద్, మే 21(వార్త క్రీడా ప్రతినిధి)**

**గుత్తా జ్వాల...** భారత బ్యాడ్మింటన్‌లో ఫైర్‌బ్రాండ్. ప్రముఖ మాజీ డబుల్స్ స్టార్ గుత్తా జ్వాల తాజాగా భారత బ్యాడ్మింటన్ వ్యవస్థపై ఓ రేంజ్‌లో విరుచుకుపడ్డారు. ఏకస్వామ్యం, పక్షపాతం, ఆటగాళ్ల అభివృద్ధిలో దీర్ఘకాలిక దృష్టి లోపించిందని ఆరోపించారు. బ్యాడ్మింటన్ అభివృద్ధి కోసం తాను చేసిన సేవలకు గుర్తింపు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన అకాడమీ ద్వారా క్షేత్రస్థాయిలో సేవలందించేందుకు ముందుకు వచ్చినా బ్యాడ్మింటన్ సమాఖ్య పట్టించుకోవడం లేదని వాపోయారు. ఒకే ఒక వ్యక్తి అన్ని నిర్ణయిస్తున్నాడని ఫైర్ అయింది.

### రిటైర్మెంట్ తర్వాత సొంత అకాడమీ

బ్యాడ్మింటన్‌కు గుర్తింపు తెచ్చిన ప్లేయర్లలో గుత్తా జ్వాల ఒకరు. ఆమె స్ఫూర్తితో ఎందరో బాలికలు బ్యాడింటన్‌లోకి దూసుకెళ్లారు. 2011 ప్రపంచ ఛాంపియన్ షిప్ బ్రాంజ్ మెడలిస్ట్ అయిన గుత్తా జ్వాలా... అంతర్జాతీయ స్థాయిలో పలు విజయాలు అందుకుంది. కామన్ వెల్త్ గేమ్స్‌లో ఓ స్వర్ణంతో సహా రెండు స్వర్ణాలు, ఓకాంస్యం... భారత్‌కు అందించింది. అలాగే ఉబర్ కప్‌లో రెండుసార్లు కాంస్యం సాధించిపెట్టింది. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో టాప్ ప్లేయర్‌గా వెలుగొందింది.

బ్యాడింటన్ గేమ్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత మేటి ప్లేయర్లను దేశానికి అందించాలనే సంకల్పంతో 2020లో హైదరాబాద్ శివార్లలోని మెయినాబాద్‌లో అత్యంత అధునాతన బ్యాడ్మింటన్ అకాడమీని నెలకొల్పింది. విశాలమైన 50వేల చదరపు అడుగు విస్తీర్ణంలో 14 కోర్టులు ఉన్నాయి. దేశం లోని అతిపెద్ద అకాడమీల్లో ఒకటిగా జ్వాలా అకాడమీ నిలిచింది. అత్యున్నత శిక్షణను అందిస్తున్నది.

### అండర్-13, 15 క్యాంపులైనా సరే

తాను అకాడమీని గత ఆరేళ్లుగా స్వయంగా, సొంత ఖర్చులతో నడుపుతున్నా ఎటువంటి మద్దతు లభించడం లేదని జ్వాల వాపోయింది. అండర్- 19, సీనియర్ క్యాంపులు కేటాయించమని అడగడం లేదని, కనీసం అండర్-13, అండర్-15 క్యాంపులైనా కేటాయించాలని పలుసార్లు విజ్ఞప్తి చేసినా బ్యాడ్మింటన్ సమాఖ్య అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడి మౌలిక వసతులను ఉపయోగించుకుని పిల్లలు బాగా ఆడి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. తాను ముక్కుసూటిగా మాడతానని, దీంతో తన అకాడమీలో శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ తిరుగుబాటుదారులుగా తయారవుతారని ముద్ర వేస్తున్నారని జ్వాల విమర్శించారు.

### బ్యాడ్మింటన్ వ్యవస్థ అంతా అస్తవ్యస్తం

ఈ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా ఉందని గుత్తా జ్వాలా అన్నారు. ఇక్కడ పూర్తిగా గుత్తాధిపత్యం నడుస్తోందని విమర్శించారు. వ్యవస్థలోని నిర్మాణాత్మక సమస్యల గురించి బహిరంగంగా ఎందుకు మాట్లాడలేకపోతున్నారని ప్రశ్నించారు. పత్రి ఒక్కరూ సర్దుకుపోతున్నారు, రాజీ పడుతున్నారు. అసోసియేషన్లు కూడా అలాగే ఉన్నాయి అన్నారు. ప్రత్యామ్నాయ ఆటగాళ్లను అందించడంలో భారత్ విఫలమవుతోందన్నారు. చైనాలో దీనికి భిన్నంగా పరిస్థితి ఉందని, అందువల్లే అక్కడ ఒకరి వెనక ఒకరు ప్రపంచ ఛాంపియన్లు పుట్టుకువస్తున్నారని గుత్తా జ్వాల తెలిపారు.

థామస్ కప్ బ్రాంజ్ మెడల్ నెగ్గినా తమకు సరైన గుర్తింపు లేదని ఇటీవలే భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లు వాపోయారు. తాజాగా గుత్తా జ్వాలా విమర్శలు బ్యాడ్మింటన్ వర్గాల్లో కాక రేపుతున్నాయి.

# చెన్నైపై గుజరాత్ టైటాన్స్ విక్టరీ

**అహ్మదాబాద్:** ఐపీఎల్ లీగ్ స్టేజ్‌ను గుజరాత్ టైటాన్స్ ఘనంగా ముగించింది. ఆరంభంలో తడబడ్డా ఆ తర్వాత వరుస విజయాలతో ప్లే ఆఫ్ లోకి దూసుకొచ్చిన గిల్ సేన... చివరి మ్యాచ్‌లోనూ అదరగొట్టింది. చెన్నై సూపర్ కింగ్స్‌పై 89 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్‌లో అదరగొట్టి 20 ఓవర్లలో 4 వికెట్లకు 229 పరుగులు చేసిన గుజరాత్ టైటాన్స్.. ఆ పై బౌలింగ్‌లోనూ బెంబేలెత్తించి చెన్నైను 13.4ఓవర్లలోనే 140పరుగులకు కుప్పకూల్చింది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సిరాజ్ గుజరాత్ టాప్ ఆర్డర్ పనిపట్టాడు. ఇన్నింగ్స్ తొలి బంతికే సంజూ శాంమ్సన్‌ను డకౌట్‌గా పెవిలియన్ చేర్చాడు. అదే ఊపులో తరువాతి ఓవర్లో ఏకంగా రెండు వికెట్లు తీశాడు. రుతురాజ్(16)ను క్లీన్ బౌల్డ్ చేసిన సిరాజ్.. ఉర్విల్ పటేల్‌ను డకౌట్‌గా వెనక్కి పంపాడు. మరో ఎండ్‌లో మాథ్యూ షార్ట్(24)ను రబడా అవుట్ చేశాడు. కార్తీక్ శర్మ.. గిల్ అద్భుత త్రో తో రనౌట్ అవడంతో 63 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. మధ్యలో శివమ్ దూబే(17 బంతుల్లో 47) మెరుపులు మెరిపించినా.. రషీద్ ఖాన్, రబడా చివరి వరుస బ్యాట్స్‌మెన్ పనిపట్టారు. దీంతో చెన్నై 140 పరుగులకే ఆలౌటైంది. గుజరాత్ బౌలర్లలో సిరాజ్, రబడ, రషీద్ ఖాన్ తలా మూడేసి వికెట్లు తీశారు. ఈ విజయంతో పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండోస్థానంలో నిలిచింది. నెట్ రన్‌రేట్‌ను భారీగా పెంచుకుంది.



## గిల్, సుదర్శన్, బట్లర్ హాఫ్ సెంచరీల షో

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ ఓపెనర్లు శుభ్‌మన్ గిల్(37 బంతుల్లో 64; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాయి సుదర్శన్(53 బంతుల్లో 84; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు).. చెన్నై బౌలర్లను ఊచకోత కోశారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగిపోయాడు. గ్రౌండ్ నలుమూలలా క్లాసిక్ షాట్లతో బౌండరీల వర్షం కురిపించాడు. తొలి వికెట్‌కు 125 రన్స్ జోడించాడు. హాఫ్ సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడే క్రమంలో గిల్ అవుట్ అయ్యాడు. మరో ఎండ్ లో ఉన్న సాయి సుదర్శన్ 35 బంతుల్లో అర్ధసెంచరీ తర్వాత మరింత జోరు చూపాడు. క్రీజ్‌లోకి వచ్చిన జోస్ బట్లర్(27బంతుల్లో 57; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా విధ్వంసకర బ్యాటింగ్‌తో సిక్సర్ల వర్షం కురిపించాడు. సీఎస్‌కే బౌలర్లకు ఎలాంటి ఛాన్స్ ఇవ్వకుండా ఊచకోత కోస్తూ మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రెండో వికెట్‌కు వీరిద్దరూ 82 పరుగులు వేగంగా జోడించి 200 మార్కు దాటించారు. సుదర్శన్ అవుట్ తర్వాత గుజరాత్ వేగంగా రెండు వికెట్లు కోల్పోయింది. తెవాటియా డకౌట్ కాగా, సుందర్ 7 పరుగులు చేశాడు. ఇక చివరి ఓవర్లో గుజరాత్ బ్యాటర్లు 13 పరుగులు రాబట్టడంతో స్కోరు 229కి చేరింది. సీఎస్‌కే బౌలర్లలో కాంబోజ్, జాన్సన్, ముఖేష్ చౌదరీ తలా ఓ వికెట్‌పడగొట్టారు.

# ఆసియా కుబేరుల్లో అంబానీ, అదానీలే టాప్




**ముంబయి, మే 21:** అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ క్షీణిస్తున్నప్పటికీ భారత బిలియనీర్లు రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా2026 ప్రకారం భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తి విలువ లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటింది. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్త సంపన్నులు జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు. తొలి 2 స్థానాల్లో అంబానీ, అదానీ భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు ప్రకటించాయి. ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు. యూట్యూబ్ క్లాస్ నుంచి బిలియనీర్స్ క్లబ్‌కు భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది.

ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ ఫిజిక్స్ వాలా కోఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా అరవింద్ శ్రీనివాస్(31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న పెర్‌ప్లెక్సిటీ ఏఐ సెర్చ్ స్టార్టప్ కోఫౌండర్ అయిన అరవింద్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత పేటీఎమ్ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి వచ్చారు. ఓలా క్యాబ్స్ ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తో పాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.

టాప్10 జాబితా ముకేశ్ అంబానీ 99.7 బిలియన్ డాలర్లు గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్లు, సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్లు, లక్ష్మీ మిట్టల్ 31.0 బిలియన్ డాలర్లు, శివ్ నాడార్ 30.9 బిలియన్ డాలర్లు, సైరస్ పూనావాలా 27 బిలియన్ డాలర్లు, దిలీప్ సంఘ్వీ 25.6 బిలియన్ డాలర్లు, కుమార్ బిర్లా 21.1 బిలియన్ డాలర్లు, రాధాకిషన్ దమానీ 15.7 బిలియన్ డాలర్లు, కాగా ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్లతో వరుసగా టాప్ పది జాబితాలో చోటుసాధించారు.



# యుఎస్‌లో పడగ విప్పిన ద్రవ్యోల్బణం

**న్యూయార్క్, మే 21:** అమెరికాలో ద్రవ్యోల్బణం మరోసారి పడగవిప్పింది. గ్యాసోలిన్, కిరాణా సరుకులు, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజల జీవనం కష్టతరంగా మారింది. గత 12నెలల్లో వినియోగదారుల ధరల సూచీ ఏకంగా 3.8 శాతం పెరిగింది. 2023 తర్వాత అత్యధిక వార్షిక పెరుగుదల కావడం గమనార్హం. కేవలం ఏప్రిల్ నెలలోనే ద్రవ్యోల్బణం 0.6 శాతం పెరిగింది. అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ సంక్షోభాలు, ఇంధన సరఫరాలో అంతరాయాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణమని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ప్రపంచంలోనే కీలకమైన ఇంధన రవాణామార్గం హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరాలో ఏర్పడిన ఆటంకాల వల్ల ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. అమెరికా కార్మిక గణాంకాల బ్యూరో ప్రకారం గత ఏడాదికాలంలో ఇంధనధరలు 17.9శాతం పెరగ్గా, ఒక్క గ్యాసోలిన్ ధరలే 28.4శాతం పెరిగాయి. దేశవ్యాప్తంగా గ్యాసోలిన్ సగటుధర గ్యాలన్‌కు 4.50డాలర్లు దాటింది. రవాణా ఖర్చులు పెరగడంతో ఆ ప్రభావం దాదాపు అన్ని వస్తువుల ధరలపై పడుతోంది. ట్రక్కుల రవాణావ్యయం పెరిగితే, దానిని సూపర్ మార్కెట్లు, రిటైలర్లు వినియోగదారులపైనే మోపుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలలో కిరాణా సరుకుల ధరలు 0.7 శాతం పెరిగాయి. గొడ్డు మాంసం, కాఫీ, పండ్లు, కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి. ఆహారం, గ్యాస్, బట్టలు, ఇంటిఅద్దె ఇలా ఏది చూసినా పైపైకే పోతోందని గృహిణులు ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఏప్రిల్‌లో ఉద్యోగుల నిజమైన సగటు గంట వేతనాలు 0.5 శాతం తగ్గాయని తెలిపింది. జీతాలు పెరిగినట్లు కనిపిస్తున్నా, కొనుగోలు శక్తి తగ్గిపోతోంది. డబ్బులు దేనికీ సరిపోవడం లేదు. ఈ పరిస్థితుల్లో అనవసర ఖర్చులను తగ్గించుకోవడం, క్రెడిట్‌కార్డుల వాడకం పెంచుకోవడం తప్పడంలేదు.

# పెరిగినట్లే పెరిగి క్షీణించిన ఈక్విటీలు

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, మే 21:** ఈక్విటీ మార్కెట్లలో సూచీలన్నీ పెరిగినట్లే పెరిగి మళ్లీ దిగజారాయి. రెండురోజుల పాటు లాభాల బాటలో నడిచిన సూచీలు గురువారం నష్టాలుచవిచూసాయి. రూపాయి మారకం క్షీణతను కట్టడిచేసేందుకు ఆర్బీఐ జోక్యంచేసుకోవడం, స్థిరీకరణ కార్యాచరణ ప్రకటించడం, అదనపు కరెన్సీ స్వాపింగ్, విదేశీ ఇన్వెస్టర్లనుంచి డాలర్ల సమీకరణ వంటివి కొంతమేర సూచీలను నియంత్రించినా విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడం, లాభాల స్వీకరణతో మార్కెట్లు ప్రతికూలంగా ముగిసాయి.

ఐటి, ఎఫ్ఎంసిజి కంపెనీలు భారీగా క్షీణించాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 135.03పాయింట్లు క్షీణించి 75,183.36పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 4.30 పాయింట్లు క్షీణించి 23,654.70 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. ఇన్ఫోసిస్ 1.05శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.03శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.74శాతం ట్రేడింగ్‌లో పతనం చెందాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ మాత్రం 0.18శాతం పెరిగితే స్మాల్ క్యాప్ సూచీ కూడా 0.70శాతం పెరిగింది. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2423 షేర్లు పెరిగితే 1748 కంపెనీల షేర్లు క్షీణించాయి. మరో 208 కంపెనీల షేర్లు యధాతథంగా కొనసాగాయి. ఇక డాలరుతోరూపాయి మారకం విలువలు కొంతమేర స్థిరపడ్డాయి. ముందురోజు 96.86తో పోలిస్తే గురువారం 96.23వద్ద స్థిరపడింది.

ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 0.29శాతం క్షీణించి రూ.1,59,538కి నమోదు కాగా కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై నెల సెటిల్‌మెంట్‌ధరలు 91 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 104.11 డాలర్లుగా కొనసాగింది. ఐటిసి స్థిరంగా కొనసాగితే జూబిలియన్ ఫుడ్ వర్క్స్ 7.81శాతం క్షీణించింది. అరియన్‌ప్రో సొల్యూషన్స్ 3.87శాతంపెరిగాయి. హనీవెల్ ఆటోమేషన్ 15.85 శాతంపెరిగింది. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 3.92శాతంక్షీణించింది. మెట్రోబ్రాండ్స్ 6.25శాతం, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ 3.65 శాతం పెరిగింది. లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ 2.39 శాతం, అపోలో హాస్పిటల్స్ 2.85 శాతం, జెఎస్‌డబ్ల్యు సిమెంట్స్ 5.42శాతం ర్యాలీ తీసాయి. ఆసియా షేర్లు దిగువస్థాయిలోనే ముగిస్తే యూరోపియన్ షేర్లు కూడా పిఎంఐల ప్రకటనలతో యుకె, ఫ్రాన్స్‌ల షేర్లు క్షీణించాయి. వాల్‌స్ట్రీట్ ఇన్వెస్టర్లు ప్రపంచ వృద్ధి అంచనాలతోపాటు భౌగోళిక ఉద్రిక్తతలు, పశ్చిమాసియా ప్రభావాలను గమనిస్తూ ట్రేడింగ్‌చేసారు. జపాన్ నిక్కీ 225 సూచీ 3శాతం పెరిగింది. రాత్రికి రాత్రే వాల్‌స్ట్రీట్ షేర్లు పెరిగాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 645.47 పాయింట్లు పెరిగితే ఎస్అండ్‌పి 500 1.08 శాతం పెరిగింది. అలాగేనాస్‌డాక్ కాంపోజిట కూడా 1.54శాతం పెరిగింది.

# అల్పాదాయ వర్గాలపై పన్నులు రద్దుచేయాలి: జెఫ్ బెజోస్



**న్యూయార్క్, మే 21:** అమెరికాలో అత్యల్ప ఆదాయం ఉన్న వారిలో సగంమంది ప్రజలకు ఎలాంటి ఆదాయపు పన్ను ఉండకూడదని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ కొత్త వాదన తెచ్చారు. తక్కువ వేతనాలు పొందుతున్న ఉద్యోగులపై పన్ను విధించడాన్ని తీవ్రంగా విమర్శించారు. దేశంలో చాలా మంది బాగా సంపాదిస్తున్నారు. కానీ, అదే సమయంలో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని బెజోస్ అన్నారు. క్వీన్స్‌లో ఏడాదికి 75 వేల డాలర్లు సంపాదించే ఒక నర్సు, నెలకు 1,000 డాలర్లకు పైగా పన్ను ఎందుకు చెల్లించాలని ఆయన ప్రశ్నించారు. ఆ డబ్బు వారి అద్దె, నిత్యావసరాలు లేదా ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందన్నారు. మొత్తం పన్ను రాబడిలో ఒకశాతం మంది పన్ను చెల్లింపుదారులు 40 శాతం వాటాను అందిస్తుంటే, దిగువన ఉన్న సగం మంది కేవలం 3శాతం మాత్రమే చెల్లిస్తున్నారు. అది సున్నాగా ఉండాలని బెజోస్ స్పష్టంచేశారు. ప్రభుత్వానికి ఇది చాలా చిన్న మొత్తమే అయినా, ప్రజలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన వివరించారు. ఏడాదికి 50వేలడాలర్లు సంపాదించే అమెజాన్ ఉద్యోగిపై పన్ను విధించడం అసంబద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. అమెజాన్‌లో కార్మికుల పరిస్థితిపై తీవ్ర విమర్శలు బెజోస్ పేదల పన్ను భారం గురించి మాట్లాడుతున్నప్పటికీ ఆయన సంస్థ అమెజాన్‌లో కార్మికుల పరిస్థితిపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. డెలివరీ డ్రైవర్లకు, యూనియన్ సభ్యులైన యూపీఎస్‌డ్రైవర్లకు మధ్య జీతాల్లో భారీవ్యత్యాసం ఉంది. యూపీఎస్ డ్రైవర్లు గంటకు 35డాలర్లు సంపాదిస్తుంటే, అమెజాన్ డ్రైవర్లు సగటున గంటకు 19డాలర్లు మాత్రమే పొందుతున్నారు. దీని కారణంగా 26 శాతం మంది అమెజాన్ కొరియర్ ఉద్యోగులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని, 33 శాతం మంది కనీస బిల్లులు కూడా చెల్లించలేకపోతున్నారని హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనలో తేలింది. ప్రస్తుతం కాలిఫోర్నియాలో బిలియనీర్లపై ప్రత్యేక పన్ను విధించాలనే ప్రతిపాదన నేపథ్యంలో బెజోస్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# లోన్ రికవరీపై ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు




**ముంబయి, మే 21:** రుణాల రికరీకి సంబంధించి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే ఆర్థిక సంస్థలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటీటీఎస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్ పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై మే 31వ తేదీ వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను ఆర్బీఐ సేకరించనుంది. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఆర్బీఐ ప్రతిపాదనల్లో కీలక అంశాలు ఉన్నాయి. వ్యక్తిగత, కారు, హోమ్ లోన్లకు సంబంధించి రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్ ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని ప్రతిపాదనల్లో పేర్కొంది. కస్టమర్లకు నోటీసులు ఇచ్చినా స్పందించకుంటే అప్పుడు చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయవద్దని పేర్కొంది.

## ఉద్యోగులకిచ్చిన ఐడిలన్నీ డీయాక్టివేట్ చేసిన మెటా




**శాన్‌ఫ్రాన్సిస్కో, మే 21:** టెక్నాలజీ సోషల్‌మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా సుమారు 8వేల మంది ఉద్యోగులను తొలగిస్తు ప్రకటించడమే కాకుండా వెంటనే మీ సామన్లుతీసుకుని వెళ్లాలని ఆదేశాలు జారీచేసింది. అంతేకాకుండా వారందరినీ అల్యూమినీ పోర్టల్‌కు అనుసంధానించడంతో ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తింది. అదే సమయంలో 7వేల మందికి పైగా ఉద్యోగులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాజెక్టులకు బదిలీ చేసింది. కంపెనీని మరింత సమర్థవంతంగా నడపడానికి, ఏఐ వంటి రంగాలలో చేస్తున్న భారీ పెట్టుబడులను భర్తీ చేయడానికి ఈ తొలగింపులు అవసరమని మెటా తన ప్రకటనలో పేర్కొంది. ఈమెయిల్ అందుకున్న ఉద్యోగుల యాక్సెస్ బ్యాడ్జ్‌లను తక్షణమే డియాక్టివేట్ చేశారు. కంపెనీ అంతర్గత సిస్టమ్స్‌కు వారి యాక్సెస్‌ను కూడా నిలిపివేశారు. గంటలోపే వారిని మెటా అలుమినీ పోర్టల్‌కు అనుసంధానించారు. అక్కడ సెవరెన్స్ ప్యాకేజీ, వీసా, ఆరోగ్య బీమా, ఉద్యోగ సహాయం వంటి వివరాలు పొందుపరిచారు. మెటా ప్రయాణంలో మీ పాత్ర ఎంతో ముఖ్యమైనది అని ఈమెయిల్‌లో పేర్కొనడం గమనార్హం. కంపెనీ నిర్మాణంలో పాలుపంచుకున్న వారికి వీడ్కోలు పలకడం ఎప్పుడూ బాధాకరమే. ఈ నిర్ణయం నాకెంతో భారంగా ఉంది అని సిఇఒ జుకర్‌బెర్గ్ పేర్కొన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.